



భాగవతము


విచారణ

కంస నాశనము








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరాములు.

కంసనాశనము.

Kamsa nasanamu.

ఇది

కలభరిగి వెంకటరమణారావుచే

Kalabherigi venkataramanrao

[illegible]

[illegible]

[illegible]ముద్రాక్షరశాలయందు ముద్రితము.


1919.

పీఠిక.

నాచే విరచింపఁబడిన పరీక్షిజ్జననము పురాణసంబంధ వచనగ్రంథము పండితపామరులచే మిక్కిలి కొనియాడఁబడి యుండుటంబట్టి నేనిప్పు డీకంసవినాశనమును రచియించితిని. ఇదియును బై దానివలె బాలికాబాలకులకును వయోవృద్ధులకును నత్యంతోపయుక్తముగ నుండఁగలదని దృఢముగ నమ్ముచున్నాను. చదువరుల కానందజనకముగ నుండునట్లుగఁ బటములను బెక్కులను జేర్ప నెంచితిని గాని ప్రస్తుతము సాధ్యముగాక పోయెను. పునర్ముద్రణమునఁ జేర్చెదను. అచ్చటచ్చట భాగవతములోని హృదయంగమంబులగు పద్యముల నీపాత్రంబునఁ జేర్చితిని. భాషాభిమానులెల్లరు నాయందుదయయుంచి యీగ్రంథము నభివృద్ధికిం గొనివత్తురని నమ్ముచున్నాను. ఈగ్రంథమునకు వలయుద్రవ్యము నొసంగి తోడ్పడిన నామిత్రులు చిట్టూరు అమ్మయ్యగారి కెంతయుఁ గృతజ్ఞుఁడను. తక్కుంగల పనుల నట్టులనే నిలిపి యీకృతినిఁ దమముద్రాక్షరశాలయందు యందు ముద్రించి సకాలమ్మునకు నాకందఁజేసిన యానందా ముద్రాక్షరశాలాధిపతులు నాస్తోత్రమున కెంతయుఁ బాత్రులు.

ఇట్లు,

కలబరిగి వేంకటరమణకవి.



కంసుని వధించుట.

మొదటి ప్రకరణము.

భరతఖండంబున నార్యావర్తమను పుణ్యభూమి గలదు. అందు యాదవ భూమీశులకు మొదలిపురియై మధురాపురంబు చెన్నారుచుండెను. పూర్వకాలంబున శూరసేనుండను యాదవేశ్వరుం డాపురంబును దనకు రాజధానిగఁ జేసికొని మాధురంబులు శూరసేనంబులను దేశంబు లేలుచుండెను. ఆరాజేంద్రునకుఁ బదుగురు కొడుకులును నేవురు కూఁతుండ్రును గలరు. వారలలోఁ బెద్దవాఁడు వసుదేవుఁడు. అతఁడు రూపసుగుణసంపత్తులఁ దక్కుఁగల రాజేంద్రులఁ దిరస్కరించుచుండెను. అతని ప్రఖ్యాతి నెఱింగి దేవకుండను యాదవేశ్వరుండు నిజపుత్రికను దేవకిని నాతని కొసంగి వివాహ మొనరించెను. వివాహానంతరంబున నాతఁడు కూఁతునకు వస్త్రాభరణంబులను దాసదాసీజనంబులను జతురంగబలంబులను నరణంబులుగ నొసంగి యల్లునర్చించి సాదరంబుగ వీడుకొల్పెను. కంసుండును చెల్లెలిని మఱఁదిని గూర్చుండఁబెట్టికొని రథముఁ దోలుకొని పోవుచుండెను. అట్లు మహానంద భరితుండై చను కంసునకు భయజనకంబుగ మింటనుండి యశరీరవాణి యిట్లని పలికెను.

ఏల యీత్రుల్లిపాటులు ? ఏటికీ యభిమానములు ? కంసా ! నీగతి నీవుచూచుకొమ్ము. ఈతరుణి యష్టమగర్భము నీప్రాణముల హరించు. నమ్ముము. జాగరూకుఁడవుగమ్ము. ఆ

పలుకులాలించి కంసుండు సంచలదంసుండై యడిదంబు బెడిదంబుగ జళిపించి చెల్లెలికొప్పుఁబట్టికొని యీడ్చి తోఁబుట్టువని సైతము వెనుదీయక తెంపునఁ దెగవ్రేయ గమకించెను. ఆతని వదనంబు క్రోధంబునం జేసి తరుణార్కుం దిరస్కరించుచుండెను. ఆతని నయనములనుండి నిప్పులు రాలుచుండెను. అతఁడు పండ్లు పటపటఁ గొఱుకుచు మొగముఁ జిట్లించుకొనుచుండెను. దయయననెట్టిదో యాతనికడఁ గానరాదయ్యె.

అట్టిసమయంబున మిన్నకున్నఁ గార్యము దప్పునని యెంచి వసుదేవుం డతనిడగ్గఱి హితవాక్యంబుల 'బావా! యిదియేమి యాగడము? ఇట్టిది లోకంబున నెందైనఁ గలదే? నీవన్నవు. ఈతరుణి నీకుఁ దోఁబుట్టువు. పుట్టినింటివారలాఁడుఁబడుచులకు సొమ్ములిత్తురు. చీరలిత్తురు. భూములిత్తురు. మంచిమాటల నాదరింతురు. మఱిమఱి మన్ననలు సేయుదురు. లోకంబున నట్టివి పెక్కులుగలవుగాని యిట్టి విపరీతపుఁ గొంతుగోఁతయెందైననుఁ గలదే. నీవెఱుఁగని ధర్మములు లేవు. మదోన్మత్తులగు వైరిరాజసింహుల రణంబున ననుకింపలేక తునుము నీకరవాల మీయబలకంఠంబుపై నెట్లేఁగఁగలదు? ఏదియో యశరీరవాణి పలికెనని భ్రాంతిపడి నీవింతపనికిఁ దెగుట ధర్మమగునే? నీకుఁ నేఁజెప్పఁదగినంతటివాఁడఁ గాను. అయినను జెప్పవలసెఁగాన జెప్పెదను.

మృత్యువు దేహముతోడన పుట్టును. పుట్టినవాఁడు నేఁడు ఱేపుగాకున్న నూఱేండ్లకైనఁ గిట్టియు తీరవలయు. తన తొంటి కర్మము విడువక నీడవలెఁ దన్ననుసరించియె వచ్చుచుండును. 'బుద్ధిః కర్మానుసారిణీ' యనుట యెఱుంగుదువు.

దేహము లనేకములైనను గర్మ చెడదు. నీటికుండల యందుఁ జంద్రసూర్యాదులు గానఁబడుచు గాలివలనఁ గదలునట్టు లాత్మ కర్మనిర్మితాంగంబుల యందు రాగకలితుఁడగుచుఁ బ్రాణిగద లుచుండును. కర్మములు మేలునిచ్చును. కర్మములు గీడు నాపా దించును. తనకైనను బ్రహ్మకైనను గర్మము లేక ర్తలు. కావున బుద్ధిమంతుఁడు సర్వము కర్మాధీనమని యెఱింగి యాత్మశుభము లకై పరులహింసింపఁదలంపఁడు. నీవు జ్ఞానవంతుఁడవు. మహాత్ము లువ్వాపుతో ప్రవఁబోవుట నీకవశ్యము కర్తవ్యము. ఈమె సీకుఁ బుత్రికవంటిది. సర్వోత్కృష్టురాలు. ప్రాణభయమున వడవడవ డంకుచున్నయది. అయ్యో! భీరువులఁ జంపఁదగునే? మహాత్మా! నీకు మ్రొక్కెదను. ఈ నూత్నవివాహను వదలుము. నాయం దు దయఁదలంపుము. చిరయశము సంపాదింపుమ'ని యనేక విధంబుల నీనుద్దై వేడుకొనెను.

ఎంత వేడుకొన్నను నాతనికి లవంబును గరుణగలుగ దయ్యెను. వసుదేవుఁ డాతని దృఢనిశ్చయంబెఱింగి విచారంబు నొంది 'యక్కటా! యీతఁడు దనకార్యమును మానఁడయ్యె ను. నాపల్కినహితవాక్యంబు లెల్ల బూదియందు హోమం బు చేసినయాజ్యంబుభంగి వ్యర్థములయ్యెను. ఏమిచేయు దును? వీనిని సన్మార్గంబునకుఁ ద్రిప్పనుపాయ మెద్దియుం దోఁపదు. వీఁడు మూర్ఖుఁడు. ఎవ్విధంబునను సంతోషింపఁడు. ఇనుమునందుఁ బ్రయత్నించినచోఁ దైలంబుఁ దీయవచ్చును. ఎండమావులయం దెవ్విధంబుననైనను నీరమును ద్రావ వచ్చును. తిరిగి తిరిగి చెవులపిల్లికొమ్మును సాధింపవచ్చును. దాపునఁజేరి యెంత తెలిపియును మూర్ఖులమనసు రంజింప

రాదు. మాకు దుష్టకాలము సంప్రాప్తించినది. అందులకై మనోవ్యథ నొందిన నేమిగలదు? ధైర్యము నవలంబింపవలయు. ధైర్యము సర్వసాధనము. కావున ధైర్యము నొంది చరియింతును. ఈమెకు జనియించిన పుత్రులనెల్లఁ దప్పక యిచ్చెదనని యిప్పుడీతనితో నందును. అంతటితో నీతని కోపము చల్లారును. ఇప్పటి మాముప్పుదప్పును. కొడుకులు పుట్టినపిమ్మటఁ జూచుకొందము. కాలమెన్నటికి నొక్కరీతిగ నుండదుగదా? అప్పటికేదైన నడ్డమురాకుండునే? దైవమా! నిన్ను నమ్మితిని. నాయందు దయఁదలంపుమ'ని తనలోఁ బలుగతుల వితర్కింపఁ దొడంగెను. అంత నాతని కధిక ధైర్యము గలిగెను. అప్పుడాతఁడు కంసుం జూచి 'యయ్యా! నీకేటికిఁ గోపము? ఈ లలనవలన నీకేహానియు లేదు. ఈమె యెనిమిదవచూలుగదా నీకుమరణకారణము. అట్లగుటం జేసి యీమె గర్భంబున జనించినపుత్రులనెల్ల నీకర్పింతును. వారిని నీయిచ్చవచ్చినట్లు వధింపుము. పిమ్మట నీకేరివలనను ప్రాణభయంబు గలుగదు. నీవు కలకాలంబు సుఖంబుగ రాజ్యంబు సేయవచ్చు న'ని తిన్ననిపలుకుల నమ్మకముపుట్టఁ బలికెను. అందులకలరి కంసుండు 'వసుదేవా! నీచెప్పినవిధము మంచిది. నేనవశ్య మట్లు చేయుదును. నీవు మాటదప్పక పుట్టినబిడ్డల నెల్లఁ గ్రమముగ నాకర్పింపుము. దానంజేసి నాకుఁ బ్రాణభయంబు గలుగనేరదు. నీకును మేలగున'ని పలికి గుణగ్రాహిత్వంబుఁగైకొని కొండలమందు చెలియలి మందలవిడిచి చనియెను. వసుదేవుండును డెందంబున నానందంబు నొంది యుండెను.

ఇట్లు గొంత కాలంబు సనిన యనంతరంబున దేవకి గర్భముధరించెను. క్రమము క్రమముగ నవమాసంబులు పూర్ణములయ్యెను. అంత నొక్కనాఁడు శుభలగ్నంబున నా మెకొక చక్కని పుత్రుఁడుపుట్టెను. కొడుకు పుట్టుటెఱింగి వసుదేవుండు దానుమున్నుఁ గంసునకిచ్చినమాటఁ దలంచుకొని కొంతచింతించి బిడ్డను గొని చని యాతని యెదుటఁబెట్టెను. ఆతని సత్యవాక్య పరిపాలనమునకు మిగులనచ్చెరువంది కంసుండు ప్రహృష్టహృదయుఁడై 'బావా! కొనియాడఁదగిన వాఁడవుగదా? మేలు మేలు. నీసత్యవర్తనమునకు మెచ్చితి. సత్యపాలనమునకై పుత్రవాత్సల్యంబు సైతముఁ దెగఁగోసిన వాని నిన్నుఁ దక్క నుఱియెవ్వరింగానము. బిడ్డనివలన నాకెద్దియు భయములేదు. వీనినిఁ గొని పొమ్ము. నీయష్టమపుత్రుండు నాకుమృత్యువఁట. వానిఁబట్టి వధించెద' నని సాదరంబుగఁ బలికెను. అందులకు సంతసమ్ము నొంది కంసుంగీర్తించుచు వసుదేవుండింటికిఁ జనియెను. మృత్యుగృహమునుండి నిరపాయంబుగ వెలువడ్డ సుతుంగాంచి దేవకీదేవిపట్టరాని సంతోషంబున నెత్తుకొని యక్కునఁగదియించి శిరముమూర్కొని 'నాచిన్నియన్నా! నేనెంతపుణ్యమొనర్చితినిరా! పులినోటికండ జాఱిపడ్డగతి నిన్ను మగలఁగాంచితి'నని ముచ్చటదీర ముద్దులాడుచుండెను. వసుదేవుఁడామెంజూచి 'తన్వీ! యేలసంతసమొందెదవు? ఇల్లలుకఁగనే పండుగగునే? ఈకంసునితోడి చెలిమిపాముతోడి చెఱిలాఁటము. వీనిని నమ్మఁదగదు. ఎయ్యదితలంచుకొని యెప్పుడు పైకొని వచ్చునో యెఱుంగరాద'ని వైరివలని భయం

బునం జేసి పలికెను. అందుల కాతఁడు నిరుత్సాహంబున మొగ ముఁజిన్నపుచ్చుకొని యెద్దియుఁ దోఁపకమిన్నకుండెను.

రెండవ ప్రకరణము.

కంసుఁడు దేవకుసోదరుఁడగు నుగ్రసేనునకుఁ బుత్రుఁడు. శౌర్యమున నద్వితీయుఁడు. ఆతనికి దోర్గర్వంబునఁ దీసిపోవని బాణాదినిశాచరులు ముఖ్యమంత్రులు. కంసుఁడు వారిలం గూడుకొని యాదవుల నెల్లఁ గదనంబున మదంబులడంచి పురంబులు విడిచివెడలఁదోలుచుండెను. ఆతని ధాటికాగఁ జాలక సదనంబులు విడిచి యదవలై యదువులు వదనంబులు వంచికొని నిలువక పరువులిడిరి. నిషధకోసలాదిబహువిషయ పతులు వారికి శరణులొసంగిరి. కొందఱు మచ్చరంబులు విడిచి యాతనిఁగొలిచి నిలిచియుండిరి.

కంసుఁడు వసుదేవునకు మగుడ నాతనిపుత్రునొసంగి వీడ్కొలిపి దేవకి యష్టమగర్భంబునకై తలఁచియుండెను. ఇట్లుండఁ గలహభోజనుండు నారదుం డొకనాఁడు మింటినుండి డిగి కంసునింటికరుదెంచెను. కంసుఁడమ్మునీంద్రుని కెదురేగి లోనికిఁగొనివచ్చి యర్ఘ్యపాద్యాదులర్పించి పూజించి యంజలి ఘటియించి యిట్లనియె. 'మహాత్మా! మీపావనంపుఁ బాదర జంబుసోకుటంజేసి నేఁడుమాగృహంబు పావనంబయ్యె. నేను ధన్యుండనైతిని. ఎందుండియెందులకేగుచు నిందులకు వచ్చితిరి? మహాత్ములు కారణములేక రారు. మీరు తిరుగని దేశంబులు లేవు. ఏయేదేశంబుల నేయేయద్భుతంబులు సూచితిరి?' నావు

డాతండు పిన్ననవ్వునగి 'కంసా! నాతిరుగని దేశంబులు లేవు. నా చూడనివారు లేరు. నాయెఱుంగనివిషయంబులు లేవు. ఎవ్వియును నాకద్భుతరంబులుగఁగానరావు. ఈపట్టణంబున నీకడ నొక్కవిశేషంబుఁగంటి. అంతటినుండియు నాకు వచియింప నలవిగాని యాశ్చర్యము గలుగుచున్నయది. అది యెద్దియని యడుగుము. అడుగకున్న నేమి? చెప్పెదవినుము.

ఆశరీరవాక్కు నాలకించియు మూఢుఁడవై నీవు దేవకీతనయునిఁద్రుంపక కరుణించితివి. ఇంతకంటె నాశ్చర్యమెద్ది గలదు? దేవకి యష్టమగర్భంబుగదా నాకుఁబ్రాణాంతకంబని యెంతువుగానోపు. బాంధవులనియెంచి నీవు సంతసంబునొందుచున్న యీదేవకీవసుదేవాదులెల్లరు నీకుబంధువులుగారు. శత్రువులు. విషసర్పంబులమధ్య సంచరించుచున్నావు. నీవు రాక్షసుఁడవు. వీరలెల్లరు దేవతలు. నీచావునకై యెదురుచూచుచున్నారు. నారాయణుండు దేవకీదేవకిఁ బుత్రుఁడై జనించును. అతఁడు నిన్నువధించును.. దీనికిఁ బ్రతిక్రియయోచించుకొమ్ము. చెప్పవలసినదంతయుఁజెప్పితి. పోయివచ్చెద న'ని వీణెమీటుచు నారాయణకీర్తనలు పాడుచు మింటికేగెను. పిడుగువడువున వినఁబడిన నుడువునాలించి కంసుండు క్రోధఘూర్ణితమానసుండై కన్నులనిప్పులుఁ రాలఁ బండ్లుపటపటఁగొఱుకుచు 'ఏమి! కలహాశనునిపలుకులు? వీరెల్లరు సురలా? నేనసురుఁడనా? దేవకికి హరిజన్మించుటయు నన్నువధించుటయునా? కానిమ్ము. చూతము. నన్నెవ్వఁడు చంపఁగలఁడో కనుఁగొందమ'ని మండిపడుచుఁ గరవాలంబును జేఁబూని దేవకీవసుదేవులున్నయెడ కరిగి వారినిరువురఁ బట్టియీడ్చి కారాగారంబునఁ ద్రోయిం

చెను. తక్కుంగలయాదవు లెల్లరుఁ దమకుఁ బ్రళయము సంభవించినట్లులడలి యెందరుగుటకు నందుఁగానక తల్లడిల్లుచుండిరి. మౌనులు దమయజ్ఞముల కాతనివలన విఘ్నములగుటెఱింగి దైవమును బ్రార్థింపఁదొడంగిరి. లోకములన్నియు నల్లకల్లోలములుగనుండెను. దేవకితనయులాఱుగురు ననుకంపలేక చంపఁబడిరి. కొంతకాలంబునకు దేవకీదేవి యేడవగర్భంబుఁ దాల్చెను. ఆగర్భంబునందు హరికాంతి చెన్నొందుచుండెను. అయ్యది యెఱింగి హరి తన్ను నమ్మినయాదవులకుఁ గంసునివలని భయంబుఁ బోకార్చువాఁడై యోగమాయం జూచి యిట్లనియె. 'భద్రా! నీవు గోపికాగోపకులుగల పసులమందకు శీఘ్రముగఁ బొమ్ము. అందు వసుదేవుభార్యలు కంసుచే నాఁకలఁబడియుందురు. వారిముట్టకుము. నందగోకులమందు రోహిణియను తరళాక్షిగలదు. ఆమె సుగుణాఢ్య. ఆమెగర్భంబున దేవకికడుపున వెలుంగు తేజమును జొనుపుము. పిమ్మట నీవు నందుభార్యకు యశోదకు జన్మమొందుదువు. సర్వకామదాయినివగు నిన్ను జనులు కానికలు బలులు నిచ్చి కొలుతురు. నీవు దుర్గాదిపదునాలుగునామంబులచే విలసిల్లుచుండుదువు'. నావుడు మహాప్రసాదం బని హరికిమ్రొక్కి నందగోకులమునకుఁ జనుదెంచి యోగమాయ యామహాత్మునాజ్ఞఁ బరిపూర్తి గావించెను. రోహిణికి గర్భముగలిగెనని జనులద్భుతమునొందఁజొచ్చిరి. అంత శుభలగ్నంబున నామెకుఁ బుత్రుఁడు జన్మించెను.

ఇట్లుండ దేవకి యష్టమగర్భంబుఁ దాల్చెను. అందు నారాయణుండు బాలార్కుభంగి నభివృద్ధినొందుచుండెను. దినదినాభివృద్ధినొందు దేవకిగర్భంబుఁగాంచి కంసుండు దఱచు

వెఱచుచు నేకాంతంబునఁ దనలోనిట్లని తలపోయఁజొచ్చెను. 'అక్కటా! యీయతివ యిప్పటిగర్భంబు గన్నులకుఁ జూడ బరువై తోఁచుచున్నది. ఇంతకుము న్నెన్నఁడునిట్లుండు టెఱుంగను. ఆకాశవాణివాక్కులు నిజమ్ములుగానోపు. కాకున్న నాకేల యింతటివెఱపుగలుగవలయు? ఇఁక నేమితలంపఁగలను. కార్యమెయ్యదియగు? నానాఁటికిఁ గామినిచూలు పెంపెసఁగుచున్నయది. ఈమె నాకుఁజెల్లెలు. మీఁదు మిక్కిలిగర్భిణి ఇట్టియీ మానవతి నేమనిచంపువాఁడ? తెగువజేసి చంపితినేని నన్నుఁ గిరాతుఁడని లోకులుదూషింపరే. నాకీర్తి యడుగంటదే. ఆయువుక్షీణింపకుండునే. ధర్మము చెడిపోవదే. నేను జీవన్మృతుఁడనుగావలసివచ్చు. అయ్యో! పౌరుషజ్ఞానకీర్తులడుగంటఁ గేవలకుక్షింభరుఁడనై లోకంబున నెట్లు జీవింపఁగలను? ఈపతివ్రతను సంహరించితినేని నాకు నరకము దప్పదు. తెలిసితెలిసి యెట్లునరకకూపంబునఁ బడఁగలను? ఎన్నిగతులయోచించిచూచినను నీమెను జంపుటకు నామనంబొడంబడదు. కానిమ్ము. కానున్నది కాకమానదు. 'లలాటలేఖానపునఃప్రయాతి' యను పెద్దలనుడువులు మఱవఁదగవు.' కొంత తడ విట్లుచింతించి యతఁడు మగుడ ధైర్యమవలంబించి క్రౌర్యంబును ద్యజించి శౌర్యంబుఁ బ్రకటించి చెల్లెలిని ద్రుంచుతలంపునుమాని హానియై నిలిచెను. అయినను నాతనికి నానాఁటికిఁ దోఁబుట్టువు గర్భంబుపైఁ బగ హెచ్చఁజొచ్చెను. ఏశబ్దము వినఁబడ్డను నతఁడది హరిపలుకని యులుకుచుండెను. ఏవస్తువుగానఁబడ్డను నయ్యది హరిమూర్తియని బెదరిచూచుచుండెను. దేహమ్మునన కెయ్యదిసోకిన నదిహరికరాఘాతమని కదియుచుం

డెను. ఎట్టి గంధముగలిగిన నదిహరిమాలికాగంధమని యెఱ
రుచుండెను. ఏదియైనను బలుకువలుకుచో బ్రమసి యతఁడు
హరిపలుకుఁ బలుకుచుండెను. తలఁపులేవైనను గలిగిన నవి
హరితలఁపులని యలుగఁ దలఁచుచుండెను. ఆతనికి సర్వమును
హరిమయమనితోఁచుచుండెను. హరిహరియనుచు నతఁడిత
రమునంతయును మఱచి తన్మయుఁడై చరియింపఁ జొచ్చెను.

అయ్యవసరంబున నమరులును నారదాదిమునులునుం
గొలిచి ముక్కంటియును దమ్మిచూలియును నక్కడకువచ్చి
దేవకిగర్భంబున నర్భకుండై యున్న పురుషోత్తము ననేకభం
గులఁ బ్రస్తుతించి దేవకింగాంచి 'యవ్వా! నిపుణ్యంబేమని
వచియింపఁగలము? తపములను దానములను యాగములను
జిక్కనిభగవంతుఁడు చిన్నబిడ్డయై నీగర్భంబునఁ బొలిచియు
న్నాఁడు. ఎల్లిపుట్టఁగలఁడు. మీకేమాత్రమును గంసుచేభయ
మింకఁగలుగనేరదు. మాకందఱికిని భద్రమగును. నీకడుపె
ప్పుడును జల్లఁగావలెను. యాదవులెల్లరు సంతసంబునం బొం
దుదుర'ని హరిం బొగడి దేవకీదేవిని దీవించి తమనెలవుల
కరిగిరి.

మూఁడవ ప్రకరణము.

జలదంబుల బృందంబులు కలఘోషణంబుల నుఱుము
దొడంగెను. సప్తసముద్రంబులు పరిశుద్ధంబులై పొంగు
చుండెను. మందమందమలయానిలంబులు మెల్లమెల్లన వీవఁ
జొచ్చెను. హోమాగ్ని మిగులఁజెన్నొంది వెలింగెను. గ్రహన
క్షత్రసహితంబై నభోభాగంబు విరాజిల్లుచుండెను. ఆశాభా

గంబు లెక్కుడు తెలివిందాల్చెను. నిర్మలజలపూరితంబులైన దులు ప్రవహించుచుండెను. విహంగమంబులతోడ వనంబులు సెలంగఁదొడంగెను. గంధర్వులు దమగానరసంబుల నెల్లరకును గర్ణరసాయనము గావించుచుండిరి. రంభాదియప్సరోగణంబు లాడందొడంగిరి. మింట దేవదుందుభులు మ్రోసెను. గ్రహనక్షత్రంబు లధికశుభస్థితిందాల్చియుండెను. అట్టిసమయంబున నర్థరాత్రమ్మున దేవకీదేవికిఁ బుత్రుఁ డుదయమయ్యెను.

'సీ. స్వచ్ఛంబులై పొంగె జలరాసులేడును
గలఘోషణముల మేఘంబులుఱిమె
గ్రహతారకలతోడ గగనంబు రాజిల్లె
దిక్కులు మిక్కిలి తెలివిఁదాల్చెఁ
గమ్మని చల్లనిగాలి మెల్లనవీచె
హోమానలంబు సెన్నొంది వెలిగెఁ
గొలఁకులు కమలాళి కులములై సిరినొప్పెఁ।
బ్రవిమలతోయలై పాఱెనదులు।
తే॥ గీ॥ వరపురగ్రామ ఘోషయై వసుధయొప్పె
విహగరవపుష్ప ఫలముల వెలసెవనము
లలరుసోనలు గురిసిరయ్యమరవరులు
దేవదేవుని దేవకీదేవి గనఁగ॥

క॥ పాడిరి గంధర్వోత్తము
లాడిరి రంభాదికాంత లానందమునం
గూడిరి సిద్ధులు భయముల
వీడిరి చారణులు మొరసెవేల్పులభేరుల్॥'

చక్కఁదనంబుల కెల్ల నెల్లయగు నక్కొమరుం గాంచి
వసుదేవుఁ డుత్సాహమొంది 'యాహా! యీపాపఁ డీపురు
టింటికిఁ బెట్టని దీపంబువోలె వెలుంగుచున్నవాఁడు. నిజ
ముగ నీతఁడు నలుమొగముల పాపనిఁ గన్న పాపండని తోఁ
చుచున్నద'నుచు సాష్టాంగ దండప్రణామంబు లొనరించి
యంజలి ఘటియించి 'దేవా!' నీవఖిలదర్శనుఁడవు. జ్ఞానా
నందస్వరూపుఁడవు. మాయాదూరుఁడవు. స్వయంజ్యోతివి.
ఇట్టి నిన్ను మేము తనయునిఁగాఁ బడయుట మాపూర్వజన్మ
సుకృతము దక్క మఱియొండుగాదు. మింటిమ్రోతలు నమ్మి
పాపియగు కంసుండు నీయన్నల నెల్ల సంహరించెను. నిన్ని
ప్పుడు వధియింప సన్నద్ధుండై యున్నవాఁడు. నీయభీష్టము.
మాభాగ్య మ'నిస్తుతియించెను. అంతట దేవకీదేవి ముకిళితకర
కమలయై 'యీశా! నీవునాకుఁగొమరుండవై పుట్టుదువని కం
సుండు పెద్దకాలంబునుండి వేచియున్నవాఁడు. మమ్ములఁ గారా
గారస్థులనొనరించియున్నవాఁడు. వానినేప్రకారముఁ దుదము
ట్టించి మమ్ముఁగాపాడెదవో యది నీభారము. మేము నోచిన
నోములెల్ల ఫలియించెను. మాకుఁబరమముక్తిగలిగెన'ని భక్తి
తాత్పర్యంబులు ముప్పిరిగొన వేడుకొనియెను. అందులకుభగ
వంతుండు సాక్షాత్కరించి 'యమ్మా! నీవు తొల్లిఁబృశ్నియను
పరమపతివ్రతవు. వసుదేవుండు సుతపుండను ప్రజాపతి. మీరి
రువురును సృష్టికాలంబున నలువపంపునఁ బంచేంద్రియంబుల
జయిచి శీతవాతాతపంబులసైరించి యాకలములుభక్షించి
వేండ్రంబుగఁ బండ్రెండువేలదివ్యవర్షంబులు తపంబుసేసితిరి.
అపుడేను నాదివ్యతేజంబుఁజూపి తిరంబులగువరంబులువేడుం

డంటిని. అందులకు మీరు పాయని మోహంబున బిడ్డలు లేని యడ్డంబున దుర్గమంబగు నపవర్గంబుఁ గోరక నాయీడు కొడుకు నడిగితిరి. నేనద్దానికి మెచ్చి పృశ్నిగర్భుండ నర్భకుండనైతిని. అదియునుం గాక మీరలదితికశ్యపులరై యున్నయపుడు నేను మీకుఁ గుఱుచవేషంబున వామనుండనై జన్మించితిని. ఇది మూఁడవభవము. ఈజన్మంబునను నేను మీకుఁ బుత్రుండనైతిని. కడచినదంతయుం జెప్పితిని. ఇటమీఁద నాకు మీయందు జన్మంబు లేదు. నన్నుఁ గొడుకని నమ్మి కడపట నన్నుం జెందెదర'నుచు నారూపంబు విడిచియెప్పటి యట్ల పసిబాలుండై తలిదండ్రులను జూచుచుఁ బరుండియుండెను. అంత వసుదేవుండోహో కాలమతిక్రమించుచున్నదే పుత్రజననంబు విన్నఁ గంసుండు మండిపడి వచ్చును. అంతఁ గార్యంబు దప్పును. ఇఁకఁ దడయం జనదని బిడ్డనిఁ గరముల ఱొమ్మున నడ్డంబుగఁ బట్టి తప్పుటడుగు లిడుచుఁ జప్పుడుగాకుండ మెల్లన గొల్లపల్లియవంకకు బయల్వెడలెను. అంతకుమున్న గొల్లపల్లెయందు నందుని సతికి యశోదకు యోగమాయ కూఁతురై పుట్టెను. అవ్విధంబందలి వారలెవ్వరెఱుంగక యొడళ్లు మఱచి నిదురించుచుండిరి. వసుదేవుఁడు నందుని మందం బ్రవేశించి యశోదశయ్యయందున నాచిన్నినల్లనయ్య నుంచి యయ్యవ్వకూఁతు నెత్తుకొని మరల నింటికివచ్చి యచ్చిఱుతపాపను దేవకి ప్రక్కనఁ బరుండబెట్టి యొక్కెడనొదిగియుండెను.

నందుని మందయందు యశోద గాఢనిద్రం జెంది యునికిం జేసి వనజాక్షునిఁ దెచ్చుటయుఁ దనసుతను గొంపోవుటయు నెఱుంగదయ్యెను. కొంతతడవునకుఁ గారాగారంబున దేవకి శయ్యఁ బరుండియున్న బాలిక యావురని యేడ్చెను. ఆచప్పుడు

నకుఁ గావలివారు మేల్కొని నలుగడలఁ జూచిరి. తలుపులతాళములు దొంటిచందంబున నుండెను. అదిచూచి యధికసంభ్రమమ్మునఁ గొందఱు పరుపులిడి చని కంసుతో దేవకి నీళ్లాడెనని చెప్పిరి. అతఁడు సిడిముడిపాటుతోఁ దల్పంబుపైఁ దత్తఱమ్మున లేచి పురుటింటివంకకుఁ బరువిడెను. ఆతని శిగముడివీడెను. పైవస్త్రము వ్రేలాడుచుండెను. కన్నులనుండి యగ్నికణంబులు రాలజొచ్చెను. మొగమెఱ్ఱవారియుండెను. అతని కోడలు దెలియదయ్యెను. బాలఘాతుకుని రోషాతిరేకమ్ము నీక్షించి భయంబుగదుర దేవకితత్క్షణంబకూఁతునక్కునఁ జేర్చెను. కంసుండా బిడ్డఁబట్టి చంపఁగదియ దేవకి యడ్డంబువచ్చి 'యన్నా శాంతింపుము. శాంతింపుము. నాపలుకులాలింపుము. మింటిమాతలు దలంపుము. ఈబిడ్డను వధింపకుము. పుత్రుఁడు నీప్రాణమునకు శత్రుఁడనివింటివి. ఆఱుగురుబిడ్డలఁ జంపితివి. పుత్రులకునోచుకొననైతిని. ఈబిడ్డయాఁడుబిడ్డ. నిరపాయురాలు. నీకెట్టిహానియుఁ జేయఁజాలదు. అక్కటా! యీపొత్తులకందువును సైతముఁ జంపవలయునే. ఈదుఃఖమును నేనుభరింపఁజాలను. అన్నా! నీపాదములుపట్టివేడుకొందును. నన్నుక్షమింపుమా. యశమార్జింపుము. మహాత్ములువ్రాఁపుత్రోవ ననుగమింపుము. నీతోఁడఁబుట్టువును. ఇంతటి స్వాతంత్ర్యమును వహింపఁజాలనే.

ఉ. 'అన్నశమింపుమన్న తగదల్లుఁడుగాఁడిది మేనగోడలా
మన్ననసేయుమన్న వినుమానినిఁజంపుట రాచపాడిగా
దన్ననుకీర్తివై మనఁగదన్న మహాత్ములువ్రాఁపుత్రోవఁబో
వన్నభవత్సహోదరిఁగదన్న నినుఁశరణంబువేడెదన్.'

యని జాలిఁబడ నేడ్చుచుఁ బయ్యెదఁ జక్కఁ సవరించుకొను
చుఁ బలవరించుచు భ్రాంతిఁ గొని కూఁతును నక్కునఁ జక్కఁ
హత్తుకొని యుత్తరీయాంచలంబుఁ గప్పి పలుగతుల వేఁడుకొని
యెను. ఆమె బ్రతిమాలుకొలందిని వానికిఁ గోపము హెచ్చు
చుండెను. అంత వాఁడు నిలువక తోఁబుట్టువుం దట్టి యావలకు
నెట్టి పొదిగిఁటనున్న చిన్నిపట్టి నొడిసిపట్టి బలిమికొలంది నేలపైఁ
గొట్టెను. ఆబాల నేలపయింబడక మింటికెగసి తన మొదలి
తనువును వదలి దివ్యరూపంబుధరించి కంసునీక్షించి పెద్దగొం
తుకతోడ నిట్లని విలపించెను. 'ఓరీ కుటిలమానసా! దేవకి బిడ్డల
నెల్లఁ జంపి యెంతటిపాపమార్జించితివిరా! అంతెఁ బోక మేఁటిమ
గండవని నన్ను జాలనొప్పింపఁగడంగితివి. ఇదియు బీరమే. నీకు
వినాశకాలము సంప్రాప్తమైనది. కావుననే యిట్టి విపరీతబుద్ధు
లు పుట్టినవి. కానిమ్ము. ఎంతకాలము నీయాటలు సాఁగఁగలవు?
నిన్నుఁ జంపెడివీరుఁ డొక్కఁడుఁ బుట్టివర్ధిల్లుచున్నాఁడు.

ములుకులఁ బోని యప్పలుకులకులికిపడి కంసుండు
జళుకుగదిరిన మనంబున ఘనంబుగ వెఱఁగంది దేవకీవసుదేవులం
జేరి యాదరంబున నిట్లనిపలికెను. 'అయ్యో! నేనెట్టి పాపుఁ
డను! ఎంతటి బాలఘాతుకుఁడను! బయలిపలుకుల నమ్మితిని. మీబి
డ్డల నెల్ల వధించితిని. బందుగులకుఁ గష్టముఁ దెచ్చిపెట్టితిని. దుష్ట
చిత్తుఁడనై బ్రాహ్మణుల నాశముఁ గావించితిని. చేయరానిపను
లెన్నెన్నియో చేసితిని సాధువుల హింసించినవారికిఁ బుణ్యము
లెట్లుగలుగును? కర్మానుసారులై ప్రాణులు లోకమునకు రాక
పోకలు సేయుచుఁ జిక్కులొందుచుందురు. ఎన్నాళ్లకును దుదలు
సేర నేరరు. సంసారమును బాయఁజాలరు. నేను వట్టిభ్రాంతి

నొందితిని. నేనెక్కడివాఁడను? మీశిశువులెక్కడివాన్యాలు? ఎఱుఁగక మిమ్ముదూఱితిని. నాతప్పులుక్షమించి నాకుఁ బ్రసన్నులుగండు.' ఇట్లనుచు నాతఁడు గన్నులనీరునించి వగచి దేవకీవసుదేవుల పాదంబులు వట్టుకొని సంకెలియలువిప్పించెను. వారును బరితుష్టుండైన కంసుంజూచి తమరోషంబులువాసిరి.

అంత కంసుండు వారలయనుజ్ఞలువడసి గృహంబునకరుదెంచి యప్పుడ తనకుఁ బరతంత్రులగు మంత్రులరావించి యోగమాయవలనఁ దానినవృత్తాంతమంతయుఁ దెలిపెను. అందులకు వారలద్భుతభయాక్రాంతచిత్తులై యిట్లనిరి. 'రాజేంద్రా! యిందులకై యింతచింతయేల? మున్ను నీచేనొచ్చిన శాత్రివులను దోలుదొల్తు శోధింతము. వారు నీబాహుబలంబునకు వెఱచి యెందుడాగిరో తెలియరాదు. ఒకవేళ శివునిఁజొచ్చియైన నుండవచ్చును. లేక బ్రహ్మఁ జెందియైన నుండవచ్చును. అట్లుగాక విష్ణువును సేవించియైన నుండవచ్చును. కాకున్నచో మౌనులై వనాంతంబుల నిల్చియైననుండవచ్చును. వారింతకు మున్ను నొచ్చియుండిరని మన మప్రమత్తులమైయుండరాదు. అట్లున్నచోఁ దప్పకకీడువాటిల్లును. వారు మననాశనమునకై మార్గములు వెదకుచుందురు. ఋణశేషము శత్రుశేషముండఁగూడనివని దేపరయెఱుంగని విషయములుగావు. వారలెన్నెన్ని వేషములనైన మనల బేలుపుత్తురు. వారిని వృద్ధినొందనీయరాదు. రోగములను బుట్టినపుడ నిర్మూలింపవలెను. అట్లులోనరింపనిచో నవి వృద్ధినొంది దేహమును నాశనమొనర్చును. మొలకలై వంగనివి మ్రానులై వంగునే? దేవతలకెల్లముఖరుండుచక్రి. ఆచక్రిధర్మంబునందుండును. గోవులు యాగములు

తపములు దమములు దయాసత్యములు శ్రద్ధాశాంతులు వేయేల సకలచరాచరాదిభూతంబులు విష్ణుదేహంబులు. వాని నన్నింటిని నిర్మూలనంబొనర్చితిమేని నాహరి యంతంబొందును. కావున నాలస్యమొనర్పక సమ్మింపుము. మేము చని పట్టణంబులయందును, బల్లెలయందును, మందలయందును బుట్టి పెరిగెడి శిశువులఁబట్టి వధించెదము. నిలింపులం జంపుదుము. తాపసుల యమునిపాలికంపుదుము. ఆవులను దూడలను ద్రుంతుము. బ్రాహ్మణుల వెడలఁదోలుదుము. నిగమంబుల నెల్ల విదారింతుము. లోకములను నశింపఁ జేయుదుము'; నావుడు కంసుండలరి వారలంజూచి 'యమాత్యులారా! మీయుత్సాహంబులకు నాకెంతయు సంతసము. ఇది మొదలు మీరు మీ యిచ్ఛవచ్చినయట్లు సంచరింప ననుజ్ఞయొసంగితి. మనమున నను కంపవహింపవలదు. వైరులను మీమీశక్తులకొలందిఁ బేరులేకదోరింపుఁడు. వైరంబచనుఁడ'ని యాజ్ఞాపించి యంతిపురంబునకుం జనియెను.

అంత వారలు జేనియాజ్ఞ మూళిందాల్చి యచటినుండి కదలి పురములఁ జొరఁబడిరి.

నాలుగవ ప్రకరణము.

అంతలోఁ దెల్లవారెను. మందలోనివారెల్లరు మేల్కనిరి. యశోద కన్నులువిచ్చి శయ్యపైఁ దనప్రక్కనఁబరుండి యున్న పాపనింగాంచి సంభ్రమమ్మున నుప్పొంగుచుండెను. నందుండు దనకు నందనుండు పుట్టుటెఱింగి మహానందంబునొంది

నెఱవాదులగు వేదవిదులఁ బిలిపించెను. వారలరుదెంచి బాలు నాశీర్వదించి పుణ్యాహవాచనంబులు సదివిరి. జాతకర్మంబులు యథావిధినడుపఁబడెను. దుందుభులు మొరసెను. గాయకులు పాటలుపాడిరి. వందిజను లనేకవిధంబులఁగీర్తించిరి. భద్రకాహళ నాదంబులు వీతెంచెను. వల్లవులు దమవాకిండ్లను మంగళతో రణంబుల నలంకరించిరి. ఎల్లయెడలను సాంబ్రాణిధూపవాస నలు బయల్వెడలుచుండెను. మందలందుఁ బసులు పసుపు నూనెలపసలఁ దనరుచుండెను. లేఁగలు క్రేళ్లుఱికి మసలుచుం డెను. మదవృషభములు ఱంకెలిడఁజొచ్చెను. మొదవుల పొదు గులయందుఁ బాలుజల్లించెను. పల్లెయందలి గొల్లలందఱును సంతసంబున వసంతములాడిరి. గోపికలు దమలో 'మనయశో దయేమినోమునోచెనమ్మా. ఆమెకడుపునఁ జిన్నిమగవాఁడుపుట్టె నఁట. పోయిచూచివత్తము రండమ్మా'

'ఆ॥ వె॥ ఏమినోముఫలమొ యింతప్రొద్దొకవార్త
వింటి మబలలార వీనులలర
మనయశోద చిన్నిమగవానిఁ గనె నఁట
చూచివత్తమమ్మ సుదతులార''

యనుకొనుచు నొండొరులం బిలుచుకొనుచు నందునిం టికి బయలుదేరిరి. ఎవ్వరినోటవిన్నను నందనందునిజననవార్తలే. నందు నింటికి వచ్చిన గోపికలకు యథావిధిమర్యాదలు జరు పఁబడెను. గోపికలును దాము గొనివచ్చినకానికల నర్పించిచిన్ని కృష్ణునెత్తుకొని ముద్దాడిరి. కొందఱాబాలునికిఁ దలయంటి నీళ్లు వ్రోసిరి. మఱికొందఱాతనిఁ దొట్లయుందుంచి జోజోయనిపాట లువాడిరి.

క. "జోజో కమలదళేక్షణ
జోజో మృగరాజమధ్య జోజో కృష్ణా!
జోజో పల్లవకరపద
జోజో పూర్ణేందువదన జోజో యనుచున్."

ఇవ్విధంబున నందఋను దనివిఁదీర నాబాలునెత్తుకొని ముద్దులాడుచు సంతసించుచుండిరి. నందుఁడు దనకుఁ గొడుకు పుట్టిన వేడుక గొనసాగ రోహిణిఁబిలువఁబంచి చిత్రచేలంబులను మండనంబులనిచ్చి మన్నించెను. అదిమొదలుగ మొదవుల కదుపులు బొడువులుగలిగియుండెను. ఇట్లుండ నొకనాఁడు నందుఁడు గోపులరక్షకు దక్షులైన వారిని నియమించి మధురాపురంబని కంసునకు నేఁటేఁటబెట్టుకి యరిఁబెట్టెను. కంసుఁడాతని సగౌరవంబుగ వీడుకొలిపెను. కంసుని వీడ్కొని నందుఁడు వసుదేవునింటికిఁజనియెను. దేవకీవల్లభుం డాతనిఁగాంచి యుప్పొంగెను. ఆతని బొందిప్రాణముఁ బొందినదియుంబోలెఁ బొలుపారెను. ఆతనికడకన్నులయందానందాశ్రువులు గ్రందుకొనియెను. ఇట్లుసంతసించి వసుదేవుండు నందునిఁగౌఁగిలించుకొని సుఖాసీనుంజేసి తనకొడుకువలని ప్రీతిదీపింప నిట్లనియెను. 'మిత్రమా! నిన్నుఁజూచినంతట నాప్రాణములు లేచివచ్చినవి. నా యాపదలన్నియు నశించినవి. ప్రాణంబులకంటెఁ బ్రాణంబుగనెంచు మిత్రునిఁజూచుట చచ్చిమరలఁబుట్టుటయ గదా? పలుపాటులొందువారల కొకచోనుండుటకగునే? ఏళ్లవెంబడి కలిసిపోవు మ్రాకులన్నియు ననేకమార్గములఁ బోవుఁగాక. ఒక్కటిగానుండఁగలవే? సంతతి లేదని నీవుమిగుల

జింతించుచుంటివి. పెద్దవాఁడవైతివి. ఇన్నాళ్లకునీకు సంతతి గలిగినందున నాకు మిగులసంతసము. సంతతిగలవాఁడు సౌఖ్యవంతుఁడు. సంతతిలేనివానిగతిఁ జెప్పవలసిన దేమిగలదు? అది యట్లుండనిమ్ము. నీపశువులు రోగంబులనొందకున్నవియా? ఆవులుపాలిచ్చుచున్నవియా? వాఁగులువంకలు జలసమృద్ధములై యుండునా? గోష్ఠప్రదేశములయందుఁ బులులు దుష్టులు సంచరింపవుగదా? ఘోషములుపొలుపొందుచున్నవియా? కాంతారభాగంబులయందుఁ బచ్చని పూరిజొంపములున్నవియా? గృహమేధి యాశ్రమ మెంతకష్టము? వానికొక్క సంతోషమును లేదు. పుత్రమిత్రులఁదనివిఁదీరఁజూచువీలులేదు. వారెల్లరు మరణించినను నాతఁడొంటిమనవలయు. నిన్నుఁ దండ్రిగను నీకాంతను దల్లిగను నమ్మి నీమందయందు నాకొడుకున్నవాఁడా?' నావుడు నందుఁడులుకతోడ వసుదేవుఁజూచి 'వసుదేవా! బాగాయెలెమ్ము. కొడుకులభ్రాంతితోడఁ దెలియక మాటలాడుచున్నాఁడవు. నీకుఁ బుట్టినకొడుకుల నెల్లఁ గంసుఁడు హింసించెను. మీఁదుమిక్కిలి నీపుత్రికను సైతముఁ జంపఁగడఁగెను. ఆబాల దైవాధీనంబునం జేసి మింటి కెగసిపోయెను. ఏలభ్రాంతిపడియెదవు? నీతొంటికర్మమిట్లుండ నూరివారల కొడుకులను నీకొడుకులనుకొన్న మేలగునే? మంచిది. ఇఁక నట్టి పలుకులుపలుకవలద'ని వచియించెను. అందులకు వసుదేవుండు 'నందా! నీవన్నటులనే కానిమ్ము. నీవువచ్చినపని యాయెను. మమ్ముఁగనుఁగొంటివి. ఇంక వేవేగ నింటికరుగుము. గోకులమునందు నుత్పాతములు దోఁచుచున్నయవి. వానికిఁ బ్రతిక్రియలను యోచింపు మ'నినుడివెను.

అంత నందుఁడు వసుదేవుని వీడ్కొని మందకుబయలు దేరెను. మార్గమున నాతనికిఁ బ్రతీతంబులైన యుత్పాతంబులు పెక్కులుదోఁచెను. అవిగాంచి భయపడి యాతండు వసుదేవుపలుకులు దప్పవని యెంచుకొనుచు వడివడినడుచుచుండెను. పల్లెలయందెల్లెడలను జనులు గలంతనొంది తల్లడిల్లుచుండిరి. తల్లులు బిడ్డలఁ గోల్పోయి యేడ్చుచుండిరి. బ్రాహ్మణులు దమయజ్ఞములు విఘ్నములొందుటకుఁ జింతిల్లి గుమిగూడి గుజగుజలాడుచుండిరి. పశువు లూరక యఱచుచుండెను. వానికిఁ గారణములరసి నందుఁడు కంసానుచరుల దుర్నయంబులకుఁ జింతిల్లుచుఁ దనప్రయాణమును సాగించెను.

అంతకుమున్నఁ బూతనయనురక్కసి కంసుపంపున బయల్వెడలి పల్లెలయందును బట్టణములయందును మందలయందును గల బాలురనెల్లవధించుచుఁ బోయిపోయి నందుని పల్లెను డాసెను. అందుఁ దనగుట్టెఱుకపడునని యెంచి యది కామరూపిణియై తిరుగఁజొచ్చెను. ఇల్లిల్లు వెదకవెదకి దానికొక్కెడ నందునింట నొక బాలునేడ్పువినఁబడియెను. ఆ యేడుపువిని సంతసించి యది సుందరీవేషంబుఁ గైకొని యింటిలోనికరిగెను. దాని మోహనాకారముం గాంచి గోపికలు లక్ష్మి తమ్ము ధన్యులఁ జేయవచ్చినదని యాశ్చర్యంబునఁ జూడఁదొడఁగిరి.

పూతన లోన నెల్లెడలను బరికించుచుండెను. కొంత తడవునకు దానికిఁ దొట్లియం దొకబాలుఁడుగానవచ్చెను. ఆ బాలుఁడు భగవంతుఁడగుటం జేసి దానికాపట్యము నెంచి లోలోన నవ్వుకొనుచుఁ గాలును గేలును గదల్పక యూరకప

రుండి గుబ్బువెట్టుచుండెను. రక్కసి మెల్లన నుయ్యెలం జేరఁ బోయి బాలునిలేపి యక్కునం జేర్చి ముద్దాడుచుండెను. అది చూచి యశోదారోహిణులు భయమొంది డగ్గఱి 'యెవరమ్మా నీవు? మాబాలు నేలముట్టెదవు? నీచను బాలుమాబాలున కక్కఱలేదు. పిలువని పేరంటము నీ కేటికమ్మా! నీదారిని నీవు పొమ్మని' నుడివిరి. అందుల కాకపటవేషధారిణి మాఱుపలుకక నవ్వుచు బిడ్డను దొడలనడుమనిడుకొని యెడలు నివురుచు 'నాయనా! చన్నుఁగుడువుమ'ని నోటఁబెట్టెను. బాలుఁడు మేల్కొన్నట్లు మెల్లనఁ గనువిచ్చిచూచి యెడలు విఱచుకొని యూపులించి దాని చన్నుఁ గుడువఁదొడఁగెను. ఒకటి రెండు గ్రుక్కలు పీల్చునంతకు దాని సత్వమెల్లఁ బ్రాణంబులతోడ బాలునుదరంబుఁ జొచ్చెను ప్రాణంబులు గోలుపోకం జేసి యారక్కసి గ్రక్కునఁ గేకవేసి పెనుగొండవలె నేలపైఁబడి యెను. దానిపాటునకుఁ గొండలతోడభూమి యదరెను. నభంబున గ్రహనక్షత్రంబులు బెదరెను. ఆశాంతంబులందు మాఱుమ్రోఁతలెసఁగెను. లోకంబులు భీతిల్లి కదలంబాఱెను. గొల్లలెల్లఁ దల్లడపడఁజొచ్చిరి. కొంతతడవునకు గోపకాంతలు గలంగినమనంబుల దృఢపఱచుకొని యశోదారోహిణులం గూడి దాని భయంకరరూపంబుఁజూచిరి. వారి యాశ్చర్యమునకు మేర గానఁబడదయ్యెను. కొంద'ఱబ్బా! యీయాకారమెందైనఁగలదే? ఇదిరక్కసియైయుండున'నిరి. కొంద'ఱిది ప్రాణముతోడికొండ'యనిరి. కొందఱు 'దీనిదంతంబులులాంగల దండంబుల కెనయగున'నిరి. మఱికొందఱు 'దీనినాసిక నగగహ్వరంబును ధిక్కరించుచున్నది'ని నుడివిరి. ఇంకఁ గొందఱు

దీని నేత్రంబులు చీఁకటి నూతులం జెనయుచున్న వని పలికిరి. వేఱొకకొందఱు 'దీనికరచరణంబులు జాఁగుకట్టలం బోలియున్న వని చెప్పిరి. 'దీనికడు పింకిన చెఱువుతో నెనయుచున్న దని కొందఱనిరి. 'దీనిపాద వాఱుక్రోసులదూరమున్న దని మఱికొందఱు పలికిరి. ఇట్లందఱు అనేకవిధముల నుడువుచు దాని ఘోరశరీరంబుపై భయము లేక యాఁడుకొను బాలుని డాసిరి. యశోద కొడుకుఁ గుఱ్ఱ నెత్తుకొని యాతని కెట్టియుత్పాతంబులు గలుగకుండునట్లు దీవించి రక్ష సేసి తొట్లయందుఁ బరుండఁ బెట్టెను.

కొంతతడవునకు నందుఁడింటికి వచ్చెను. యశోదాదు లాతనికిఁ గడచిన వృత్తాంతమునంతయుఁ బూసగ్రుచ్చినవిధంబునఁ దెలిపిరి. అతఁ డాశ్చర్యంబునొంది వసుదేవుని మెఱుక కద్భుతంబంది యాతనిని యోగియని పొగడెను. పిమ్మట గొల్లలనేకులారక్కసిదేహంబును గుఠారంబులచే నఱికి తమకుటీరంబులకు దవ్వగు వటారంబున దహనముఁ గావించిరి. అమ్మగువదేహంబునుండి యగరుపరిమళముల పొగలు వెడలుచుండెను. గోపకులెల్ల రాపాపిశరీరంబున నట్టిసుగంధము వెడలుట కచ్చెఱువొందిరి. భగవంతుఁడు దేహంబు స్పృశించుటం జేసి యాతరుణి సకలదురితములు వాసి పుణ్యలోకంబులు వడసెను. నందుండు బాలుఁ జేరి యాతని చేతలకు వెఱఁగుపడి యెత్తుకొని శిరంబు మూర్కొని ముద్దాడి మోదంబున నుండెను.

అయిదవ ప్రకరణము.

కృష్ణుండు క్రమక్రమముగ నొదికిలఁబడనేర్చెను. అయ్యది యెఱింగి నందుఁ డాతని జన్మనక్షత్రంబున నొకనాఁడు

పండుగుఁగావించెను. విప్రులు వేదమంత్రంబుల నభిషేచనాదులొనరించిరి. నందుఁడు వారికి గోదానంబులొనర్చెను. వారు బాలుని దీర్ఘాయుష్మంతునిగ దీవించిరి. బంధువులెల్ల రమ్మహర్షోత్సవమునకు వచ్చియుండిరి. ఇంట నెక్కుడుసందడిగనుండెను. యశోద గోపికలకుఁ బూజలొనర్చుచు బాలునిమఱచెను. కొంతతడవునకు బాలున కాఁకలియయ్యెను. అందువలన నాతఁడు పెద్దపెట్టున నేడ్చుచుండెను. ఎవ్వరును వినిపించుకొనరైరి. అంత నతఁడు కోపమొంది కాలికడనున్న బండినొకదానిం దన్నెను. ఆతన్నున నాశకటము వికటంబుగ నేలఁబడియెను. అదిచూచి గోపకులాశ్చర్యమొందిరి. ఆబండియందుండు సరసపదార్థంబులు వ్యర్థంబులై నేలంగూలెను. అవియట్టులఁగూలుటకుఁ గారణంబెఱుంగక యశోదానందులు బహువిధంబుల వితర్కింపఁదొడంగిరి. ఎంత వితర్కించినను గారణము దెలియరాదయ్యెను. వారి వాక్యులెఱింగి యందాడుకొనుచుండిన బాలురు జరిగినవృత్తాంతమును సాంతముగ వచియించిరి. ఆపల్కులు నమ్మఁజాలక నందాదు'లిసీ! యెక్కడిబాలుఁడు? ఎక్కడిబండి? ఎక్కడివిఱుగఁదన్నుట? ఇట్టిచోద్యమెందైనఁగలదే? ఈయాటపడుచు లనృతంబులాడిరి. ఇయ్యది యిట్లైయుండఁజాలదు. దీనికెద్దియైన నితరకారణముండనగున'ని యూహకుండిరి.

అంత యశోద బాలునెత్తుకొని పాలిచ్చెను. బాలుఁడు గడుపారఁదల్లిపాలుఁద్రావి యామెతొడలపై నాడుకొనుచుండెను. యశోద యాతనిముద్దాడి యొడలునిమురుచుండెను. అంత

కంతకు బాలుఁడు బరువైతోఁచెను. ఆమె యాతనిమోయఁ జాలక వెఱచి భూమిపైనుంచి 'యిదియేమివిపరీతము? బాలుఁ డింతబరువయ్యెను. ఇది యేమినాభ్రమయా? నిజముగనిట్లయ్యె నా? యని తనలోఁదాను వితర్కించుకొనుచు నది తనవట్టి భ్రాంతియని సమాధానముఁజేసికొనెను. బాలుఁడు క్రిందసల్లారు ముద్దుగా నాడుకొనుచుండెను.

అంతలో నున్నట్టులుండి తృణావర్తుఁడను రాక్షసుఁ డొక్కఁడు సుడిగాలియైవచ్చి యాడుకొను బాలునెత్తుకొని విను వీధికెగసెను. ఆసుడిగాలికి ధూళియెగసి గోపకులకన్నులను నింపెను. వారలు కన్నులనుదెఱువఁజాలక తొట్రుపడుచుం డిరి. కొంతపడికి గాలితగ్గెను. ధూళిమాసెను. అందఱుగన్ను లుదెఱచిరి. బిడ్డగానఁబడఁడయ్యె. అవ్విధంబెఱిఁగి యశోద తొట్రుపడుచు నిటునటుజూచుచు దిగ్భ్రమఁజెంది యెద్దియుం దోఁపక యయ్యో! పుత్రకా! పుత్రకా! యెందుఁబోయితివి? ఇప్పుడింకదాడుకొనుచుంటివే! ఇంతలో మాయమైతివే! ఈపాడు సుడిగాలియెందుండివచ్చెను. అయ్యో! ముద్దులపట్టీ! నిన్నెడఁ బాసి నేనొక్కక్షణమైనఁ దాళఁగలనా? గోపికలారా! మీరే మైనను జూచితిరా? ఈవైపరీత్యమెందైనఁగలదఁటమ్మా!యని యందుండు వారలనెల్ల నడుగుచుఁ జూచినచోట్లను మఱల మఱలఁ జూచుచు నిటునటుదిరుగుచు నందునితోడఁజెప్పెను. నందుఁడును గోపాలకులఁగూడుకొని యెల్లయెడలను వెదకెను. బాలుఁడెందునుగానఁబడఁడయ్యె. అంత వారందఱు చిట్టిచెల్లడిల్లు చు నటునిటుపరువిడుచుండిరి.

తృణావర్తుఁడా బాలునాకసంబునదూరంబుగఁ గొం
పోవఁదొడంగెను. అంతకంతకుబాలుఁ డాతనికి బరువగుచుండె
ను. ఆభారము మోయంజాలక యాతఁడు భయభ్రాంతుఁడై
'ఇదేమియాశ్చర్యము? నేనీలాగుబాలుని మున్నెన్నఁడునుఁ
జూచియెఱుంగ. ఇది పుడమిలో లేనిచిత్రముగనున్నట్లుతోఁచు
చున్నదని యెద్దియుఁ జేయునదిలేక కదలమెదలక నిలువంబడి
యె. భగవంతుఁ డాతనిమెడ గట్టిగబిగియఁబట్టి పీడించెను.
ఆబాధకుఁ దాళఁజాలక వాఁడు విలవిలఁదన్నుకొనుచుఁ బెను
గొండవలెఁ బుడమిపయింబడియెను. శిశువు వానిమెడను వద
లక వ్రేలాడుచుండెను. గోపికలా చిత్రంబుఁగాంచి దిగ్భ్రమఁ
జెందిరి. కొంతవడికిఁ దెలిసి యశోద యయ్యెడకుఁ బరువిడి
వచ్చి బిడ్డనెత్తుకొనియెను. నందుఁ డానందమొందెను. 'మీ
పూర్వపుణ్యంబునఁ జేసి మీబిడ్డను మరలఁ గంటిరి. యశో
దమ్మతల్లీ! నీనోములపంట నీపూజాఫలము నీతనయుఁడు నీకు
మగుడదక్కెను. నీవు ధన్యవు. నీకేహానియుఁ గలుగఁజాలద'ని
గోపికలు సంతసించుచు యశోదను నుతించిరి.

ఇట్లుండ నొకనాఁడు వసుదేవుపంపున యాదవపురోహి
తుండు గర్గుండు నందునిమందకుఁ జనుదెంచెను. నందుఁ డాత
నిఁగాంచి లేచి నిలువంబడి కృతాంజలియై భజియించి తగు
సత్కారంబులాచరించి యిట్లనిపలికెను. 'మహాత్మా! మీరాక
చే నేఁడు మాగృహాము పావనంబయ్యెను. మేము ధన్యులమై
తిమి. భవాదృశులగుపుణ్యమూర్తులు మాయిండ్లకూరక రారు.
చిరకాలమునుండియు నాకొక్కకోరికగలదు. అయ్యదితీర్చి
న్నుధన్యుంజేయవేఁడెద. ఈకుమారులు సంస్కారములేక

యున్నారు. మీరు జ్యోతిశ్శాస్త్ర పారంగతులరు. తేజోమూర్తులరు. దిగంతవిశ్రాంత కీర్తియుతులరు. వీరికిసంస్కారంబు గావింపుఁడు.' నావుడు గర్గుండు నందునింజూచి యోగమాయావృత్తాంతంబు సాంతంబుగ వినిపించి 'నందా! యీబిడ్డఁడు దేవకీకొడుకు. ఈసంగతిఁ గంసుఁడెఱుఁగఁడు. ఇదిపరమరహస్యము. వానిచెవిఁబడినచోఁ దప్పకముప్పువాటిల్లును. కావున రహస్యంబున సంస్కారంబు సేయుట కార్యంబు. ఇది మఱువవలద'నియె. అందులకునందుఁడుసంభ్రమపరీతచేతస్కుండై 'పుణ్యపురుషా! నేనవశ్యము మీయాజ్ఞ ననువర్తింతును. ఇంతకంటె నాకేమిగావలయు న'నిపల్కెను. అంత యాదవపురోహితుండు రోహిణీతనయుఁజూచి యీబిడ్డఁడు జనులు రమియింపఁదిరుగుచుండును. అందువలన నీతఁడు రాముఁడనంబరఁగును. యదుసంకర్షణంబునం జేసి సంకర్షణుండనిపిలువంబడును. ఘనబలంబున బలుఁడని పేర్కొనఁబడునని కృష్ణునిదిక్కుమొగంబై యీబాలుఁడింతకుమున్ను ధవళారుణపీతవర్ణుండై నెగడెను. ఇప్పుడు నల్లనయ్యెను. కావునఁ గృష్ణుఁడనంబరఁగును. వసుదేవునకు జన్మించినకారణంబున వాసుదేవుఁడనంబడును. ఈపాపనికి గుణరూపకర్మంబు లనేకంబులు గలుగుటంజేసి నామంబు లనేకంబులుగలవు. ఈబాలకునివలన మీరుదుఃఖంబులఁ దరియింతురు. ఈయర్భకునిచేత దుర్జనశిక్షణంబును సజ్జన రక్షణంబును నగును. ఈకుమారుఁడు నారాయణసమానుఁడని పలికెను. నందుఁ డత్యంతానందమునొంది గర్గు ననేకసత్కారంబులఁ బరితృప్తుంజేసి సాదరంబుగ వీడ్కొలిపెను. గర్గుఁడు గృహంబున

కరిగి వసుదేవునకుఁ దనపోయివచ్చినవృత్తాంతమును దెలిపెను. బాలు నభివృద్ధివిని దేవకీవసుదేవులు ప్రహృష్టహృదయులైరి.

నందగోకులమందు బలరామకృష్ణులు దినదినప్రవర్ధమానులై గోపబాలురఁగూడికొని యాడుకొనుచుండిరి. కృష్ణుఁడు దక్కుంగల గోపబాలురంజూచి యొక్కతఱి 'నేను గోవల్లభుఁడను. మీరుగోవుల'నుచు వంగి అంకెవైచుచు నాడును. మఱియొకతఱి 'నేను దొంగను మీరింటివార'ని వారిని నిద్రవుచ్చి సొమ్ములుదొంగిలించుకొని పోయి డాగుకొనును. వేఱొకతఱి 'నేనుసూత్రధారుఁడను. మీరునాటకపాత్రల'ని యందఱి నాటలాడించును. అప్పుడప్పుడు బాలురతోఁ బందెములువేసి పరువులెత్తును. దాఁగురుమూతలాడును. బంతులెగురవైచును. చెట్లులెక్కిదూకును. చిన్నతనంపుఁజేష్ట లనేకములు సేయుచు నానందించుచుండును.

కొన్నితరుణములయందు బలరామునిఁగూడి కృష్ణుఁడు గోపాలురయిండ్లకరిగి నవనీతములను భక్షించుచుండును. బాలెంతలు తమబిడ్డలకుఁ బాలులేక మొఱలిడుచుండ వినక యాతఁడావులకు దూడలనువిడుచుచుండును. కడవలలోని కాఁగినపాలు ద్రావి వట్టికడవలను బగులమోదుచుండును. కొన్నియిండ్లయందుఁ బాలయుట్లెత్తుగనుండ నాతఁడు ఱోళ్లుబోరలించి పీటలువేసి యెక్కి కుండలకుఁ దూట్లువొడిచి పాలన్నియుఁద్రావును. కొందఱిండ్లఁజొరఁబడి కుండలలోని నెయ్యిద్రావి యాకుండల నితరులయిండ్లయందిడును. అంతనాయింటివారికి నీయింటివారికిఁ దగవుపడును. వేలుపులగోడలపై నుమిసి పాడుజేయును. గొల్లపల్లెయందలివారు కృష్ణునిరాకకు భయ

పడి వాకిండ్లు మూసికొని తాళంబులు వేసికొని వీథులనుందురు. అతఁడు వారెఱుఁగకుండ లోనికరిగి పాలు పెరుగును ద్రావును. తలుపులుదీయునంత కందఱయిండ్లయందు నాడుచుఁ బాడుచుండును. ఇట్లతఁడు సేయుచుండ గోపికలోపికలు లేక యశోదకడకేగి యోయమ్మా! మీబిడ్డ డెంతదుడుకువాఁడమ్మా! మీపాపనిచేమేము గృహములువిడిచి యెందేనియుఁ జనవలసి నట్లున్నది. మాయిండ్ల పాలు పెఱుగు నిలుచునట్లులేదు. మీరు భాగ్యవంతులైన బాగుగఁదినుఁడు. చక్కనివలువలుగట్టుకొనుఁడు. మంచినగలుపెట్టుకొనుఁడు. బిడ్డలను బడుగులకొంపలపై విడువఁదగునే? మాకుఁ బోరాములగుచున్నయవి. మేమెందైనఁ బోవుదుము. ఇంక నిందునిలువమనిపలికిరి. ఆపలుకులాలించి

క. ఓయమ్మ సుకుమారుఁడు
మాయిండ్లను బాలుపెఱుగు మననీఁడమ్మా
పోయెద మెక్కడికైనను
మాయన్నల సురభులాన మంజులవాణీ.

యశోద తనకొడుకును దండింతునని సమాధానపఱచి గోపికల నిండ్లకంపును.

ఆఱవ ప్రకరణము.

గోపికలు దనతల్లితో నివ్విధమునఁ గొండెములు సెప్పుచుండఁ గృష్ణుఁ డెద్దియు నెఱుంగని వానిభంగి భయాన్వితుండై యూరకుండును. అంత నొక్కనాఁడు బలరామాది గోపకుమారులుఁ వెన్నుండు మన్నుఁదినెనని యశోదతోఁ జెప్పిరి.

ఆమె వానికేలువట్టుకొని యిట్లనియె. నాయనా! మన్నేటికిఁ దినియెదవు? తినవలెనన్న మఱిపదార్థము లేదా? మీయన్నయు గోపకుమారులును జెప్పుచున్నారుగదా! దుడుకుదనములు మానుమురా! అనవిని యాతండు దల్లింజూచి 'మన్ను దినుటకు నేను వెఱ్ఱివాఁడనటమ్మా! ఆకలిగొంటినటమ్మా! వీరిమాటలు నీవు నమ్మకుమమ్మా! నన్నుఁ గొట్టింపవలెనని వీరందఱుజేరి యీయుక్తిఁ బన్నుచున్నారమ్మా! కాదేని నానోరు చూడుమమ్మా! తప్పైనదండింతువు గాక' యని కరుణపుట్టఁ బలికి నోరుదెఱచి చూపెను.

ఆతని వదనంబున సకలబ్రహ్మాండ భాండంబులు గానబడియెను. అయ్యదిచూచి వెఱగందిన యశోద 'యిదియెక్కవింత? ఇదికలయా? వైష్ణవమాయయా? ఇతర సంకలార్థమా? సత్యమా? నేనుయశోదాదేవినా? కానా? ఇదినా యిల్లా? పరస్థలమా? అట్లుగాదేని నీబాలుఁడెంత? వీని మొగంబున నీబ్రహ్మాండ భాండంబులుంటయెంత? దీనికెద్ది హేతువు? ఈతఁడు చూపునకు బాలుఁడుగనున్నాఁడు. నిజముగ బాలుఁడుగాఁడు. ఈతఁడు సర్వాంతర్యామియైన నారాయణుండని నాకుఁదోఁచుచున్నది. ఇంతకాలమ్మునుండి నేనీతనిఁ గొడుకని నమ్మితిని. అది విశ్వసనీయము గాదు. ఈమందయు నాభర్తయు నేనును నీగోపజనులును నీతని వదనమున నున్నాము. నాకుఁ దరుణముదొరకెను. ఈ సర్వాత్మునాశ్రయించి యిఁకఁ గడతేరవలయున'ని తలంచుకొనుచు భ్రాంతిఁజెంది నిలుచుండెను. భగవంతుం డదియెఱింగి యిఁకమిన్నకున్నఁ గార్యము

దప్పునని యామెయందు వైష్ణవమాయం బొందించెను. అంత నామెచిత్తవిభ్రాంతినిఁ బాసి యాబాలునిఁ దనకొడుకనియెంచి తొడలపై నిడుకొని ముద్దులాడఁ దొడంగెను.

ఒకనాఁడు యశోద పెరుఁగుఁ దరుచుచుండెను. కృష్ణుఁడు గంతులువైచుచు వచ్చి యామె కొంగుఁబట్టుకొని పాలిమ్మని యడిగెను. యశోద యాతనిని దొడలపై నిడుకొని పాలిచ్చి పీటపైఁ గూర్చుండఁబెట్టి పొంగుపాలుదించుటకై లోనికరిగెను. అందుల కతఁడు కోపమునొంది కడవలలోని వెన్నసంతయు మెసవి ఱాలతోఁ గడవలన్నిఁటినిఁ బగులఁగొట్టెను. కొంతవడికియశోదవచ్చెను. బాలుఁడచట లేఁడు. కుండలన్నియు భిన్నములై యుండెను. అంతనామె చేత సెలగోలఁ బట్టుకొని యాతనిని వెదకికొనుచు బైలుదేరెను. వెన్నుఁడు ప్రక్కయింట నొక ఱోలుఁదరుగవేసి యెక్కి యుట్టిమీఁది వెన్నను దినుచుండెను. అదిచూచి యామె వానిని డగ్గఱి 'వీరెవ్వరు శ్రీకృష్ణులుగారా! ఎన్నఁడును వెన్న నెఱుఁగరఁట. దొంగతనము నేరువరఁట. ఇట్టినియతులు లోకమందుఁగలరా?

'క॥ వీరెవ్వరు శ్రీకృష్ణులు
గారా? యెన్నఁడును వెన్నఁ గానరఁటకదా!
చోరత్వం బించుకయును
నేరరఁట ధరిత్రి నిట్టినియతులు గలరే? ॥'

యని పట్టుకొనఁబోయెను. బాలుఁడు ఱోలుదూఁకి పరుగిడఁ దొడఁగెను. యశోదయాతనివెన్నంటి పరుగెత్తెను. ఎంతపరుగిడినను నామెకుబాలుఁడు చిక్కఁడయ్యెను. అలసట

మిక్కుటమగుడు నామె మఱిపరువెత్తలేక యందునిలిచి యబ్బా
వీనిదుడుకుఁదనము నానాఁటికి నెక్కుడగుచున్నయది. వీఁడు
చెప్పినమాట వినుటలేదు. ఇంటనిలుమన్న నిలువఁడు. పసి
వాఁడు లెమ్మని యూరివారలూరకుందురా? నాతోఁ గొండె
ములు సెప్పుచుందురు. నేనువానిని దండింతునని వారికేమైనఁ
గరుణగిలదా? వాఁడు శిక్షనొందినవారికేమి? నెమలికంట
నీరు గారినవేఁటగానికిముద్దా? కాకిబిడ్డ కాకికిముద్దు. నాబిడ్డఁ
డు నాకెక్కువ. అట్లని యూరకుందునా వారలకుఁ గోపములు
వచ్చును. దండింతునందునా లేక లేక కలిగినబిడ్డ. ఎట్లుచేయు
టకును దోఁపదు. ముందుఁజనిననూయి వెనుకకేగినగోయి.
అయ్యోపాపమను కోలఁదిని వీనికొంటెతన మెక్కువగు
చున్నది. వీనిని దండింపవలెను. దండనమునఁగాని బాలురు
చక్కఁబడరని సెలగోలజళిపించి ‘బాలకా! నీదుశ్చేష్టలుమఱిమఱి
యెక్కువగుచున్నవి. నిన్నునేను మార్గమునకుఁ ద్రిప్పలేన
నియా యిట్లు చేయుచున్నావు! నీవు పట్టువడవేని నిన్నుఁగఠి
నముగ దండింతును. చూడుము’నుచు మఱల వానివెంటనరి
గెను. తల్లిదన్నుఁగొట్టునని భయము నొందినవాఁడు వ్రాలె
నాబాలుఁడు యశోదకెదురై ‘యమ్మా! యీతప్పుసైపుము.
ఇఁకమీఁద నిట్టిపనులుసేయను. చేసిన నన్నుఁగొట్టుము’ని
యేడ్చుచుఁ గన్నులు నులుముకొనుచు నామెను డాయఁబో
యెను. యశోద వానివినయమునకుఁ గోపముడిగి వెన్నదొంగ
చిక్కెనని కొట్టఁజాలక పట్టుకొని ఱోటికిఁ గట్టఁదలఁచెను.
ఎన్నిత్రాళ్లుగాని వచ్చినను వాని నడుముచుట్టుఁదిరిగి రావ
య్యెను. క్రొత్తత్రాడుఁ జేర్చుకొలఁది నొకమూరతక్కువగు

చు నేయుండెను. ఇంటఁగల రజ్జువులన్నియుఁ బూర్ణములయ్యెను. బాలుఁడు గట్టువడఁడాయెను. అంత నామెయొడలఁ జెమట లెగయ నుత్తరీయముజాఱఁ గొప్పువీడఁ బూవులురాల నూర కరోజుచు నిటునటుజూచుచు నిలువఁబడెను. కృష్ణుఁడయ్యది యెఱింగి బొజ్జఁబెంపునొందింపక సంకుచితము గావించెను. యశోద వానింగట్టెను. ఇట్టులు పట్టినిఱోటికి గట్టిగఁ గట్టి యాయమ యింటిపనులు చూచుకొను చుండెను.

అంతఁగృష్ణుం డామె నేమఱిచి ఱోలీడ్చుకొనుచుఁ బోవఁ జొచ్చెను. దారియందు రెండు పెద్దవృక్షము లొకదానికొకటి యంటియుండెను. వానికర్జున తరువులని పేరు. కృష్ణుఁడు వాని రెంటికి నడుమఁ దన ఱోలు ద్రోవనిచ్చి యీడ్చెను. ఆతని బలిమి కాసంగడిమద్దులు మహాభీలధ్వనితోడ భూమిపైఁగూలెను. అట్లుగూలిన సాలంబులలోన నుండి కీలికీలలు వెల్వడు పోలికి సిద్ధులిద్దఱు వెడలివచ్చి లోకపాలుఁడైన బాలునకు మ్రొక్కి నిలిచిరి. భగవంతుఁడు వారినిమన్నించి సెలవొసంగి యని పెను. వారు దేవదేవు ననేకవిధంబులఁ గీర్తించుచుఁ దమ దారింజనిరి.

తొల్లి నలకూబర మణిగ్రీవులను నిరువురుయక్షులుం డిరి. వారు కుబేరునకుఁ బుత్రులు. శంకరకింకరులు. మదోన్మత్తులై వారు వెండికొండపైఁ బూదోఁటలయందుఁ గొందఱు చేడియలంగూడి క్రీడించుచుండిరి. బ్రహ్మమానసపుత్రుఁడు నారదుఁడొకనాఁడు వారున్న యెడ కరుగుదెంచెను. చెలువ లమ్మునిరాక నెఱింగి తమవలువలుధరించిరి. నలకూబరమణి

గ్రీవులు మదిరాపాన పరవశులగుటంజేసి వివస్త్రులై మెలంగు చుండిరి. మునీశ్వరునకువారిఁజూచినంతఁ గోపమువచ్చెను. అప్పు డతఁ 'డౌరా వీరిపొగరు! వీరికిఁగన్నులుగానరావు. ఇది సంపద వలనిమదము. సంపన్నుఁడు సంసారమును నమ్మి యితరులఁ గానలేఁడు. దరిద్రుఁడెత్తువడి శుష్కీభూతుఁడై చిక్కి యితరుల హింసింపఁడు. అతనికన్నుల కెల్లరు సములు. కావున సంపన్ను నకంటె దరిద్రుఁడు మేలు. సంపన్నంధునకంజనము దారిద్ర్యము. ఒక్క త్రుటిలోన వీరిక్రొవ్వడఁగింతున'ని వారిదిక్కు మొగంబై 'యక్షులారా! మీరలు స్త్రీ మదాంధులరు గావున భూలోకం బున నర్జునతరువులై పుట్టి నూఱుదివ్యవర్షంబులు జీవింపుఁడ'ని శాపంబిచ్చెను. కొంతతడవునకు వారొడలెఱింగి మునీంద్రుఁ డొసంగిన శాపంబునకు వగచి తన్మోచనంబునకు మార్గముఁ జూపుమని యామహానీయుని వేడిరి. నారదుండు వారలఁ గరుణించి యిట్లనియె. 'కొండొకకాలంబునకు భగవం తుఁడు కృష్ణుఁడై భూలోకమున నవతరించును. ఆపురుషోత్త ముని పాదసంస్పర్శంబున మీశాపంబులు దొలంగును. మీరు ధన్యులరగుదురు.' అనవిని వారలు సంతసంబునొంది యమ్మహా నీయుఁ గీర్తించుచుఁ దమదారి నరిగిరి. నారదుండును వాసు దేవుని స్మరించుచు వియన్మార్గంబునం జనియె. పెద్దలనవమానిం చిన ననర్థములు సేకూరును. అయ్యది యెఱింగి ప్రవర్తింప వలయు.

సాలంబులు పడినచప్పుడు పిడుగుచప్పుడుగ వినఁబడ్డ భయపడి నందాదులు పరుగున యాదెసకరిగిరి. మద్దులునేలఁ బడియుండెను. ఱోలువానినడుమనుండెను. బాలుఁడు చెక్కు

జెమర్పక నిలిచియుండెను. అదిచూచి యందఱు నిదియాశ్చర్యముగనున్నది. పిడుగుపడదాయె. పెనుగాలి వీవదాయె. అర్జునమ్ములు వడినవి. ఇతఁడు బాలుఁడు. వీనిని గూల్పనసమర్థుఁడు. ఇవివడుటకుఁ గారణమెద్దియై యుండునని యనేకభంగుల వితర్కింపఁదొడంగిరి. అందఱిబాలురు వారిసందేహమును దీర్పనెంచి జరిగినవృత్తాంతమును సాంతముగఁ దెలిపిరి. గోపకులాబాలకుల పలుకులు మిథ్యలుగనెంచి 'మనబిడ్డఁడుబ్రదికె. ఇఁకనీకారణంబు మనకుఁ దెలియకున్ననేమి? మనము లేచిన వేళమంచిద'ని బాలుఁదోడ్కొని యింటికరిగిరి.

కృష్ణుఁడెద్దియు నెఱుఁగనివానివలె మిన్నకుండెను. బలరామాదు లాతనిఁబ్రశంసించిరి. అంతవారందఱాటలాడ మొదలిడిరి.

ఏ డ వ ప్ర క ర ణ ము.

'ఇఁకనిందు మనము నివసించు మార్గము గన్పట్టదు. ఇక్కడ రక్కసులు పెక్కులున్నవారు. మనకృష్ణున కాపదలనేకములు గలుగుచున్నయవి. భగవంతునకు మనయందు దయదప్పినట్లున్నది. ఎక్కడికేనియుఁ బోవుదము. పయనముగండ'ని యుపనందుఁడను నొక వృద్ధగోపకుఁ డొకనాఁ డితరగోపాలురఁ గాంచి పలికెను. వారెల్ల రాతనిపలుకు లాదరించి పోఁదగుచోటొక్కటి నిరూపింపుమని కోరిరి. ఉపనందుఁడు గొంతయోచించి వారలంగాంచి 'గోపాలకులారా! కాళిందీత

టంబున మునీంద్రబృందావనమగు బృందావన మొందు గలదు. అందుఁ బసులకుఁ గసవు విశేషముగఁ గలదు. తోటలు పెక్కులున్నవి. ఆతోటలు మిక్కిలి రమణీయములు. అందు సుందరములు తరుబృందము లొప్పారుచుండును. అదియు మనకు నివాసయోగ్య మగుచోటు. మన మెల్లర మచ్చటికిఁ బోవుదము. ఇది నాయభీష్టము. మీయిష్టమెట్లట్లు యోచింపుడ'ని తెలియఁబలికెను. ఇతరగోపకులెల్ల రావృద్ధగోపకుని యభీష్టము సరియనిరి. అంత నొక మంచిముహూర్తంబున గోపాలకులు ప్రయాణోన్ముఖులైరి. కొందఱాలమందలం దోడ్కొని ముం దరిగిరి. వారిపిఱుంద మఱికొందఱు బాలవృద్ధనారులారోహించిన తేరులఁబోవనిచ్చిరి వారివెనుకఁ బ్రౌఢులగు మఱికొందఱు గోపకులు తనుత్రాణతూణబాణధరులై విండ్లు పట్టుకొని నడిచిరి. బండ్లను వెన్నంటి యింకఁ గొందఱు తూర్యరావంబులతోడ నార్యపురోహితసమేతులై బైలుదేరిరి. మార్గంబునఁ గొందఱు స్త్రీలు శ్రీకృష్ణలీలలు గానముచేసిరి. రోహిణీ యశోదలు రథంబులపై రామకృష్ణుల ముందటనిడుకొని వారలవినోదంబులకుఁ బ్రమోదంబు నొందుచుండిరి.

ఇంతలో బృందావనంబువచ్చెను. అయ్యది యత్యంత మనోహరమై కన్నులకుఁ బండువుసేయుచుండెను. గోపకులా యూరుఁజొచ్చిరి. శకటంబులెల్ల నర్ధచంద్రాకారంబుగ నిలుపంబడియె. యశోదాదులు రథంబులుడిగిరి. అందఱకుఁ దగు విడుదు లేర్పఱుపఁబడియె. మహానందంబున నందఱుఁ దమతమ యిక్కువలఁ జేరి సుఖంబుగఁ గాలముఁ బుచ్చుచుండిరి.

రామకృష్ణు లీడుజోడు బాలురతో నల్లారుముద్దుగా నాడు
కొనుచుండిరి. కొంతకాలమ్మునకు వారు గోవులుగాయుఁదలంపుఁ
గొనిరి. తలిదండ్రులు వారియభీష్టముల కొప్పుకొనిరి తోడి
బాలురు గొందఱు వారిఁగూడుకొనిపోవ సమ్మతించిరి. ఒకనాఁ
డందఱును జలిదియన్నంపుఁజిక్కములుభుజములకుఁ దగుల్చుకొ
ని నిడుదలగు కఱ్ఱలను జేతనుంచుకొని బయలుదేరిరి. ముందు
గోవు లేగుచుండెను. కృష్ణుఁడు చేతఁ బిల్లనగ్రోవినుంచుకొని
యూదుచుండెను. ఆనాదమున కందఱు నానందపరవశులగు
చుండిరి. మార్గముఁ దప్పిచనిన గోవుల నదల్చి కొందఱు మంద
లోనికిఁ జేర్చుచుండిరి. నడుమనడుమఁ గొందఱొకరినొకరు హెచ్చ
రించుకొనుచు నెద్దియేని వింతలుచూచి వికవికనవ్వుచుఁ జప్ప
ట్లుచఱచుచు గొల్లున నఱచుచుండిరి. కొందఱు పురాణకథలఁ
జెప్పుచుండిరి. కొందఱూఁగొట్టుచుండిరి. కొందఱిట్లుగా నట్లని
యాక్షేపించుచుండిరి. ఇవ్విధంబున నందఱును జనిచని యము
నాతీరంబునఁ బచ్చనిపుఱిజొంపముల గోవుల మేయఁదోలి
యందందు నాటలాడుచుండిరి.

ఇట్లాడుకొనుచుఁ గృష్ణుఁ డొకవింత క్రేపుంజూచి బల
రామునింబిలిచి 'యన్నా! చూడుము. ఇదియొకమంచిలేఁగ.
ఇట్టిది మనమందయందు మఱియొండు గానరాదు. దీనితోడ
నాడుకొన నాకు బుద్ధిపొడముచున్నయది. దీనినిఁ బట్టుకొనియె
దన'నుచు దానితోక నొకచేతఁబట్టుకొని చేరువనున్న యొకవె
లగమ్రాని కీడ్చిమోదెను. ఆపెట్టుతోడ వత్సరూపముందాల్చి
యున్న యసురుఁడు చచ్చెను. వానియాకారము నీక్షించి

తక్కుంగల గోపబాలకు 'లబ్బా! వీడెక్కడిరాక్షసుఁడు? తాటి ప్రమాణపొడుగున్నవాఁడు. వీనిచేఁబడకుండఁ గృష్ణుఁడు మనప్రాణంబులు రక్షించె' ననుచు భగవంతునిఁ బొగడఁదొడఁగిరి.

ఆలోన సూర్యుడపరవార్ధిఁ జేరెను. కులకులగూయుచుఁ బక్షులు దమకులాయంబులఁ జేరఁబోవుచుండెను. గోపకులు దమకదుపులఁదోలుకొని యిండ్లకు బయల్వెడలిరి. గోవులు గొట్టంబులఁ గట్టఁబడెను. తలిదండ్రులు దమ తనయుల రాకలకు హర్షించిరి. గోపబాలకులు వేఁడినీటజలకంబులాడి ధౌతవస్త్రంబులు దాల్చిరి. యశోదారోహిణులు దమబిడ్డలకు బంగరు కంచంబులువెట్టి మృష్టాన్నంబులు నడ్డించిరి. తల్లులువెట్టిన యన్నంబుఁదిని చేతులుగడిగికొని యాబిడ్డలు దమపగటిచేతలెల్లఁ దెలియఁజెప్పిరి. కృష్ణుని సాహసమున కచ్చెరువంది యాంద ఱాతనిఁబొగడిరి. తమబిడ్డలు సురక్షితముగ వచ్చినందులకు నందయశోదలు సంతసించిరి. బలరామకృష్ణులు శయ్యపైఁబరుండి సుఖముగ నిద్రించిరి.

అరుణోదయంబున నందఋను మేల్కొంచిరి. రామకృష్ణులు కాల్యకృత్యములం దీర్చికొని యితరగోపబాలురం గూడుకొని గోవులఁదోలుకొని బైలువెడలిరి. పచ్చికబయళ్లయందు గోవులు మేయుచుండెను. అంతలో మధ్యాహ్నమాయెను. ఎండమిగులఁ దీక్ష్ణముగఁగాయుచుండెను. క్రిందఁగాళ్ళూనవలనుగాకుండెను. తలలు మలమలమాడఁజొచ్చెను. నోళ్లెండిపోవుచుండెను. క్రేపులు దప్పిగొని మోరలుపైకెత్తుకొని యూరక నిలువఁబడియుండెను. అదిచూచి గోపకులు వానినొకకొలంకు

నసుఁదోలిరి. అందుదిగి పసులు దనివిదీర నీరుఁద్రావెను. బాలుకును దమదప్పిఁదీర్చుకొనిరి.

ఆకొలంకు కెలంకున నొక్కబకము నిలిచి యుండెను. దానియొడలుమిగులఁబొడవుగనుండెను. దానికన్నులు సగము మూయఁబడియుండెను. అదియెద్దియో ధ్యానము సేయుచున్నట్లు గన్పట్టెను. గోపాలురు దానియాకారమును వెఱఁగుపడిచూచుచుండిరి. కొంతతడవట్లు మిన్నకుండి యదిచంచువు సవరించుకొని పక్షంబులువిచ్చి పదంబులెత్తి నింగికెగసెను. అట్లెగసి యది మఱలభూమికిడిగ్గి యచటనిలిచియున్న చిన్నికృష్ణు నొడిసి మ్రింగెను. కృష్ణుఁడు గనఁబడఁడాయెను. గోపబాలకు లాతనిపోఁబడి యెఱుంగక భయభ్రాంతచిత్తులై యూరక చిత్తరువులవలె నిలువంబడిరి. హరి బకాసురుని కంఠంబునుండి లోనికేఁగక రెండుచేతుల నాతనికంఠంబును దౌడలను బీడించెను. ఆపీడనకుఁదాళఁజాలక యాముక్కిడి రక్కసుఁడు బాలునివెడలఁగ్రక్కెను. కృష్ణుఁడు గ్రిందఁబడి యాతని మొడగట్టిగఁ బట్టి వంచి చంచువులను రెంటినిఁ జీల్చివైచెను. రాక్షసుఁడు ప్రాణంబులుగోల్పోయి భూమిపయింబడెను. రామాదు లానందమొందిరి.

అంత వారు గోవులఁదోలుకొని మఱియొక్కెడ కరుగుచుండిరి. అయ్యది చూచి బకదానవునితోడఁ బుట్టు 'వయారే యీదుండగీఁడులు మాయన్నను బంచత్వమునొందించిరి. నామగంటిమివీరెఱుంగరు. కంసుఁడు నాశక్తి గాంచియ కదా యీ పనికినియోగించెను. వీరినెల్ల నొక్కక్షణంబున మ్రింగివైతును.

మాయన్నకు హితముగావింతును. ఈబుడుత లిటువచ్చుచు చున్నారు. రానిమ్ము'అనుచు నొక యజగరంబై పడియుండెను.

అంతలో బాలురెల్లరు దారిం జనుచుండి దూరంబున నొక మహా పర్వతంబుం బోని యా పామును గాంచి 'యిది యెక్కడి పర్వతము? ఇది మనము చనుమార్గమే కదా! మన మార్గమధ్యంబునం గొండలేదు. మనమేమి మార్గము దప్పితిమా' యనుకొనుచుండిరి. కొంత సమీపమునకు వచ్చి నంత వారి కది పాముని తోంచెను. కొందఱు దాని యాకృతిం గాంచి 'యిది యెక్కడి సర్పము? దీని నిడివి యొక యోజనంబునకంటె నెక్కుడుగ నున్నది. ఎత్తు పర్వతంబును మించుచున్నయది. దీని కోఱలు మన నాగళ్లను బోలుచున్నవి. దీని పెదవులు దట్టములగు మొగిళ్ల ననుకరించుచున్నవి. దీని యిగుళ్ల సందులు పెద్ద బిలంబులం బోలుచున్నవి. దీని వదనాంతరాళంబంధకార బంధురంబై చూపట్టుచున్నయది. దీని దృక్కులనుండి దావాగ్ని కీలలు వెల్వడుచున్నయవి. దీని విషనిశ్వాసంబులకుం బరిసరంబులందలి చెట్లు మాడిపోవుచున్నవి. ఇది నేల నాలుకలు పఱచుకొని యున్నది. అబ్బా దీనిని డాయ భయము వొడముచున్నద'ని నిలిచిరి. మఱికొందఱు 'భయము లేదు. నడువుడు. బకాంతకుండు కృష్ణుండు మనకుం దోడుండ భయపడనేల? వీం డజగరాసురుండు. బకాసురు ననుగమింప నున్నాండు. రం డితని వధం గన్నులారం గాంతమ'ని నిలిచిన వారినిం దోడ్కొనిచనిరి.

వారినిం జేరువకు రానిచ్చి యా పాము తన వదనగహ్వరంబుం దెఱచెను. అందఱును దాని నోటం జొరంబడిరి.

అంతఁ గృష్ణుఁడు వారల మౌర్ఖ్యమునకు మిగుల నొచ్చుకొని 'నేనున్నానను ధైర్యమునం జేసి వీరందఱును దీని గర్భంబుఁ జొచ్చిరి. ఇట్టి మూర్ఖులెందైనఁ గలరే. వీరి విడిచియుండఁ జాలక నేనును దీని నోటఁబడితిని. ఇఁక దీనిఁ జంపు మార్గ మెయ్యది? మా కొఱకై యింటఁ దలిదండ్రు లెంత చింతిల్లు చుందురో. కానిమ్ము. దీని నిప్పుడ యమసదనంబున కంపుదు' నని తన దేహముఁ బెంచెను. అసురున కుచ్ఛ్వాస నిశ్శ్వాసము లాడవయ్యెను. కొంత తడవునకు వాఁడు గిజగిజఁ దన్నుకొనుచుఁ బ్రాణంబులు విడిచెను. కృష్ణుఁడు వాని శిరంబు భేదించుకొని తోడివారలఁ గూడికొని బయటికి వెడలెను. గోపబాలుర యానంద మేమని వచియింపనగు? కొందఱు కృష్ణునిఁ గౌఁగిలించుకొనిరి. కొందఱాతని పాదంబులకు మ్రొక్కిరి. కొందఱు చిందులు ద్రొక్కుచుఁ బాటలు పాడిరి. కొందఱు దమ నొంగళ్ల నెగురవైచి పట్టుకొనుచుండిరి. వారి సంతోష మింతింతయని చెప్ప వశముగాదు.

కొంత తడవునకా సర్పము దేహమ్మునుండి యొక వెలుఁగువచ్చి కృష్ణునిఁ జొచ్చెను. గోపకు లెల్లరుఁ దమ మందఁ దోలుకొని యిండ్ల కరిగి నాఁడు జరిగిన వర్తమానంబు లెల్ల నిండ్లలోఁ జెప్పిరి. గోపకులెల్ల రద్భుత భయాక్రాంత చిత్తులై కృష్ణునిఁ బొగడిరి. యశోద కృష్ణునికి దృష్టిదోషము దగులకుండఁ గట్టుదిట్టములు గావించెను.

ఎనిమిదవ ప్రకరణము.

మఱునాఁ డరుణోదయంబున మేల్కాంచి రామకృష్ణులు కాంతారంబున బంతిచల్దులు గుడువనుద్యోగించిరి. యశోదారోహిణులు చలిదికావడు లాయత్తముచేసి యిచ్చిరి. శృంగంబులు పూరింపఁబడెను. అధ్వనివిని తక్కంగల గోపాలురెల్లరు మేలుకని తమతమ క్రేపులం దోలుకొని బయలువెడలిరి. మార్గంబున వారధికోత్సాహులై బాల్యచేష్టలం జేయుచు నానందించుచుండిరి. మణిభూషణభూషితులయ్యుఁ గొందఱు చెట్లపూవులు దొడవులుగ నిడుకొనిరి. కొందఱు వేణువులు పూరించుచుండిరి. కొందఱు తుమ్మెదలంగూడి పాడుచుండిరి. కొందఱు మయూరంబులతోడ నాడుచుండిరి. పికంబులంగలసి కొందఱు కూయుచుండిరి. కొందఱు శుకంబులం జేరి రొదలు సేయుచుండిరి. పులుఁగులనీడలఁ గొందఱు వాఱుచుండిరి. పొదరిండ్లఁ గొందఱు దూఱుచుండిరి. వాగులయందుఁ గొందఱీదుచుండిరి. కొందఱు మరాళములచెంత నడుచుచుండిరి. కొందఱు బకములంగని నిలుచుచుండిరి. సారసంబులంజోపి కొందఱలంచుచుండిరి. కొందఱు నదీజలంబులం దోఁగుచుండిరి. తీవయుయ్యెలలఁ గొందఱూగుచుండిరి. పల్లంబులఁ గొందఱుడాగుచుండిరి. కొందఱు దూరంబులకేగుచుండిరి. కపులసందడిఁ గొందఱు తరువులెక్కుచు ఫలంబులు మెక్కుచుండిరి. కొందఱు కయ్యంబులకుఁ గాలుద్రవ్వుచుండిరి. కొందఱు చెలంగుచుండిరి. కొందఱు మెలంగుచుండిరి. కొందఱు వ్రాలుచుండిరి. కొందఱు

సోలుచుండిరి. ఇట్లందఱనేకశరీరవికారంబులు సేయుచుఁ దనువులు మఱచియుండిరి.

కొంతతడవునకు వారొక పచ్చికబయలునఁ జేరిరి. ఆవులు దమదారిని మేయుచుండెను. అందఱును దమచలిదికావడులు వరుసగ దించిరి. వారిలో నొకఁడింకొకనికావడి యడకించి దాఁచెను. మఱియొకఁడు దాని నెత్తుకొనివచ్చి మొదటివానికిచ్చెను ఒకఁడు గజ్జముఁ దినుచుండ మఱియొకఁడు దాని నెగురఁదన్నెను. వేఱొకఁడు వానికడఁ జేరి పెద్దబొబ్బవెట్టెను. వాఁడులికి క్రిందఁబడెను. మఱియొకఁడు వానిని హేళనఁ జేసెను. తుట్టతుద కందఱింజూచి కృష్ణుండు 'బాలకులారా! మీ చేష్టలింకఁ జాలింపుఁడు. ప్రొద్దుమధ్యాహ్నమాయెను. ఎండయందు విశేషమ్ముగ మ్రగ్గితిమి. ఆఁకలియగుచున్నయది. మీమీమూటలు విప్పుఁడు. చల్దిగుడుతము'ని పల్కెను. అప్పలుకుల కోఁగాక యని గోపాలకులు దమతమపసులకు నీరువెట్టి యెప్పటియట్ల మేయవిడిచిరి.

అంత నందఱును దమతమ చిక్కంబులు విచ్చిరి. కృష్ణుండు నడుమఁగూర్చుండెను. తక్కినవారాతనిఁ జుట్టికూర్చుండిరి. ఆకులయందుఁ గొందఱును జేతులయందుఁ గొందఱును ఱాలపైఁగొందఱును జిక్కంబులయందుఁ గొందఱును భుజియింపఁదొడంగిరి. మాటిమాటికిని వ్రేలుమడిచి యితరుల నూరించుచు నొకఁడూరుఁగాయలు దినుచుండును. ఒకనికంచంబులోనియన్నంబు నొడిసి యింకొకఁడుమ్రింగును. కృష్ణునిఁ జూడుమని యొకనినేమఱించి వానియన్నము నింకొకఁడుభక్షిం

చును. ఇవ్విధంబున నందఱును భుజియించుచుండిరి. అంతలోఁ గృష్ణుఁడటునిటు పరికించి చూచెను. గోవులు గానరావయ్యెను. అయ్యది యెఱింగి యాతఁడితరులం జూచి 'ఓ బాలకులారా! విచిత్రముగ నున్నయది. ఇందు మేయుచుండిన గోవులు గానరావు. అవి యెంతదవ్వరిగెనో తెలియరాకున్నది. ఇయ్యది ఘోరారణ్యము. ఇందుఁ గ్రూరజంతువులు విశేషంబుగఁ గలవు. మన గోవుల కేయేజంతువులవలన నేయేబాధలు గలిగెనో తెలియరాకున్నది. మీరు భుజియించుచుండుఁడు. నేను నిమిషంబున వానియిక్కువ లరసివచ్చెద

'మ. వినుఁడో బాలకులార క్రేపులట వీవీథిన్ మహాదూరముం
జనియెన్ గోమలఘాసఖాదనరతోత్సాహంబుతో నెందుఁబో
యెనో యేమయ్యెనో క్రూరజంతువులచే నేయాపదం బొందెనో
కని తెత్తుం గుడువుండు చల్దిగొఱతల్ గాకుండ మీరందఱున్.'
న'ని చెప్పి యందుండి బయల్వెడలెను.

ఎంతదవ్వరిగినను నాతని కావులజాడ గానరాదయ్యె. అంత నతఁడు వానిగిట్టలజాడలఁ బట్టి 'యిచ్చోటఁ బచ్చిక మేసినవి. ఇచ్చోట నీరు ద్రావినవి. ఇచ్చోట మందగొన్నవి. ఇచ్చోట వేఱువేఱైపోయిన

'క. ఇచ్చోఁ బచ్చిక మేసిన
విచ్చోఁ ద్రావినవి తోయ మేగినవిచ్చో
నిచ్చోట మందఁ గొన్నవి
యిచ్చోఁ బాసినవి జాడ యిదె యిదె యనుచున్.'
య'నుకొనుచుఁ జనుచుండెను.

అవ్విధంబంతయు నెఱింగి బ్రహ్మ 'యీబాలుఁడు లోక కంటకుఁడగు నఘాసురునిఁ ద్రుంచెనని వింటిని. ఏవిధంబున వాని వధియించెనో? బాలురను క్రేపుల నెభ్భంగిఁ గాపాడెనో యెఱుఁగరాదు. బాలున కింత శక్తిగలిగెనను నంతకంటెఁ జోద్య మేమిగలదు? ఈతఁడు మాయకాఁడని తోఁచెడిని. ఈతని నెట్లైనను వంచింపవలెన'ని గోవులను బాలురనునొక్కెడ డాఁచెను. కృష్ణుఁడు పొదలయందును గొలంకుల కెలంకుల యందును వెదకి వెదకి యాలమందం గానక విసివి గోపాలురు చల్దిగుడుచు నెడకువచ్చెను. అయ్యెడ నెవ్వరును గానరారైరి. అంత నాతఁడు దివ్యజ్ఞానంబున నలువ చెయ్దము నెఱింగి యిట్లని తలంచెను. 'నలువకు నన్ను వంచింపఁ బనిలేదు. నన్నుఁగను బ్రామి నావారలను డాఁచ నాతనితరమా? కానిమ్ము. ఈపనికై జంకనేల? మీబాలుగు నాయెఱుక లేక యెందరి గిరో యూహింపఁ జాలనంటినేని గోపికలు దల్లడిల్లుదురు. నన్నుఁ బలుగతుల దూఱుదురు. వీరుదు మిక్కిలి ప్రాణములు విడుతురు. తెలిసి చెప్పకున్నందున నాపాపము నన్నుఁ జుట్టుకొనును. అంతయేల? కన్నులు పూవు నంతకాటుక యేటికి? నన్ను సామాన్యునిగ నెంచి బ్రహ్మయింతగావించెను. నాశక్తి చూపుదుఁగాక' ఇట్లని తోడిబాలుర యాకారంబును గోవుల రూపంబులను దాల్చి ప్రొద్దు గ్రుంకుడు నింటికిఁ దరలెను.

సాయంకాలంబున గోవులందోలుకొని బాలకులిండ్లకు వచ్చిరని గోపకులు సంతసంబున నుండిరి. భగవంతుని చిత్రమెవ్వరికిని దెలియదయ్యెను. అదిమొదలొకవర్షముదనుకఁ గృష్ణుఁ

డారూపంబున మానక చరియించుచుండెను. అవ్విధంబెఱింగి బ్రహ్మ! 'యోహో! ముప్పువాటిల్లెనే? సర్వాంతర్యామిని విష్ణుమూర్తిని వంచింపఁదొరకొనిన నాబుద్ధి పెడతలఁబట్టెను. ఇది నావలననగునే? ఏల యిట్టిదుర్భరకార్యంబునకుఁ గడంగితిని? వైళంబ చని యప్పరమేశ్వరు నాశ్రయించెద. ఆపద్బాంధవుఁడు నన్ను క్షమించి రక్షించును'ని రాయంచ నెక్కి దేవదేవుఁడున్న యెడ కరుదెంచెను. అందుఁ గృష్ణుండు సకల గోగోపబాలక సంఘంబులతోఁ గూడియుండెను. అదిచూచి వెఱఁగంది బ్రహ్మ రాయంచదిగ్గనడిగ్గి హరిడాయఁజనియెను. గోవిందుండు నలువరాక నెఱింగియు నెఱుంగనివాఁడువోలెఁ దనయాటలు పాటలు నెఱపుచుండెను. చతుర్ముఖుం డాతనిడాయంబోయి సాగిలఁబడి ప్రమ్రొక్కి లేచి కృతాంజలియై డగ్గుత్తికతో నిట్లని స్తుతియించెను. 'దేవదేవా! నీమహిమ నెఱుంగక నేనట్టి మౌఢ్యంబునొందితిని? నాతప్పు మన్నించి యే జన్మంబునందైన నీచరణసేవనొసంగి మన్నింపుము. నాకింతకంటె నేమియవలయును.' నావుడు భగవంతుఁ డాతనిమన్నించి వీడుకొల్పెను. బ్రహ్మ రాజహంసంబునధిరోహించి సత్యలోకంబున కరిగి నిరతంబు నీశ్వరారాధనఁగావించు చుండెను.

మందయందు గోపాలురు కృష్ణుంగాంచి సంతసించి 'చెలికాఁడా వచ్చితివే? నిన్నుఁగాంచి యెంత కాలమాయెను? నీమాయ నెఱుంగ నెవ్వనివశమ'ని యనేకభంగులఁ బొగడఁజొచ్చిరి. కృష్ణుఁడు వారికిఁ దనకావించిన మాయఁ దెలియఁబఱచెను. సాయంకాలంబున నందఱు నిండ్లకరిగిరి.

తొమ్మిదవప్రకరణము.

భలభద్రుఁ డొక్కనాఁడు మందతోడఁ బోవక యింటి యందుండెను. కృష్ణుఁడితరగోపబాలురఁగూడుకొని గోవులఁ దోలుకొని బయలుదేరెను. కొంతతడవునకు వారెల్లఁ గాళిందీతటంబుననిల్చిరి. పశువులు పచ్చికమేయఁజొచ్చెను. కొంతతడవున కవి దప్పిఁగొని యమ్మడుగునదిగి నీరుఁద్రావెను. గోపబాలురు గట్టుననుండిచూచుచుండ నవి యన్నియు నున్నటులుండి మెడలుద్రేలవేసి క్రిందఁబడి జీవములు విడిచెను. అది చూచి వారుగొల్లుననేడ్చిరి. శ్రీకృష్ణుఁడు వారియేడ్పులుడిపి యందఱంజూచి 'బాలులారా! యేలయేడ్చెదరు? ఇదికాళింది యను పేరుగన్నమడుగు. దీనియందు సర్పమొకటివసించుచుండును. దానినామము కాళియ. ఆకాళియాహియందునికిం జేసి దీనికిఁగాళిందీ తీర్థమని పేరు. దాని నోటినుండి విషవహ్నిశిఖలు వెలువడుచుండును. ఈమడుగుపైఁ బఱతెంచుపక్షులు సయితముదాని విషకీలలు సోకుటం జేసి యందుఁబడిమ్రగ్గును. ఆమడుగుపైనిగాలిసోకినయెడలఁబ్రాణులెవ్వియైన నీల్గును. మీరుచూడుఁడు. ఆయుదకము పొంగుచున్నది. అదియెల్లప్పుడు నుడుకుచుండును. మీరు వెఱఁగందకుఁడు. నేనిందుదిగి యాసర్పంబును జంపి యీహ్రదంబును నిరపాయంబు గావింతును. పిమ్మటమన గోవులనుబ్రదికింతును. మీరిందుండి చూచుచుండుఁడ'ని పలికి సమీపంబుననున్న యొకకదంబభూజంబు నెక్కెను. అల్లెక్కి

యతఁడు నడుమునఁ జేలంబుగట్టిగ బంధించి వెండ్రుకలు చక్క-
గముడిచి మడుగువైపునవ్యాపించిన యొకశాఖాగ్రంబునకుఁ
జని రెండుపాదంబులను గీలించి వక్షంబును బెంచి బాహువుల
నిరుప్రక్కలకుఁ జాచి **హుమ్మ**నుచు మడుగునదూకెను. అప్పు-
డుమడుగున జలంబు మఱింతపొంగెను. కృష్ణుఁడు బాహువుల
రెంటినిజాచి మహాభీమంబుగా నీదుచుండెను.

అట్టిసమయంబున నావిషాహి మనంబునఁ గ్రోధంబగ్గ-
లంబగుడు మేనువెంచి దుస్సహవిషాగ్నిజ్వాలలం గ్రక్కుచు
'నీబాలుండెవ్వఁడు? నాబలంబెఱుంగక యిందుఱికినిర్లక్ష్యంబుగ
నీదుచున్నాఁడ'నుచునాతనింజుట్టి గట్టిగఁగఱచెను. కృష్ణుండు
చూపఱకుఁ బ్రాణంబులు గోల్పడినవానియట్లులు చేష్టలుదక్కి-
యుండెను. అంతగోపాలకులు వెఱఁగంది 'యయ్యయ్యో! యింకేమి
గలదు? ఈభుజంగము మనకృష్ణునింగఱచి యంతటఁబోక యా-
తనిం జుట్టుకొనియె. ఈ యాపదనుండి మనల నింక రక్షించు
వారెవరు? ఎవ్వరినిశరణుఁజొత్తము? ఎవ్వరి కడకరుగుదమని'
యూరక విలపింపఁజొచ్చిరి. కొందఱు మందకుఁబరువులిడి నంద
యశోదాదులకు నావృత్తాంతంబు వినిపించిరి. అంతవారు బెగ-
డుగదిరినచిత్తంబులను త్తలపడుచు మహాఘోషంబున నాఘో-
షంబు వెలువడిగోపబాలురుదారిఁజూప కాళిందీతటంబునకుఁ బరు-
గుపరుగునవచ్చిరి. కృష్ణుని స్థితికరమసహ్యదాయకమైగనుపట్టెను.
అదిచూచివారు 'కృష్ణా! కృష్ణా'యని విలాపంబులుసేయుచుఁ
దాపంబులంబొందుచు 'నక్కటా! కాలముమనకింత ప్రతికూల-
మయ్యెనే. హతవిధీ! నీకుమేమే మెగ్గొనరించితిమ'ని దైవమును

దూఱుచుండిరి. కొందఱు యశోదంబట్టుకొని విలపించుచుఁ గృష్ణు నుద్దేశించి యిట్లనిరి.

అయ్యో! కృష్ణా! నేఁడిదేమి విపరీతపుఁగాలము! అన్ని దినంబులను మీతల్లి నీకెదురుగావచ్చిన నెదురువచ్చువాఁడవీనాఁడేలరాకున్నావు? నిన్నుఁగృపతోఁడఁజూచిననానందమునఁజూచు నీవేల గనువిచ్చిచూడకున్నావు? నాయనా! యని పిలిచిననో యని పలుకువాఁడ వీనాఁడేల పలుకవు? నాఁడు రాక్షసివిష కుచముల దుగ్ధంబుఁద్రావి విషవిజయుఁడవైన నీకీసర్పవిషమెక్కెనే? అక్కటా! యీక్రూరభుజంగమలిగి నిన్నుఁగఱవఁగా నెంతకంపించితివో! పాపఁపువిధి నెంతతిట్టితివో! మమ్ముఁదలంచి యెంతపలవించితివో! మమ్ముఁగఱవక యీపన్నగము నిన్నేలకఱచెను? తండ్రీ! నీవొక్కఁడవున్న మమ్ములనందఱ రక్షింపఁగలవు. మేమిందఱముండియు నిన్నుఁగాపాడ నేరకున్నామే. ఏల మాబ్రదుకులు? నీగోపాలక విహితులు నిన్నుఁ బిలుచుచున్నారు. జాగుసేయక లేచిరమ్ము. అందెలుపాదమ్ములమ్రోయ నాడుదువురమ్ము. మావీనులకువిందుగా భాషింతువురమ్ము. నీవు మడుగుననున్న మాకిందుఁబ్రభువులెవ్వరు? నీతోడమమ్ముఁ గొనిపొమ్ము. మే మిందుండఁ జాలము. ఇట్లనుచుఁ దక్కుంగల వారలఁ జేరి హ్రదంబును జొరగ నుద్యోగించిరి. బలభద్రుఁడు కృష్ణునిమాయ నెఱింగినవాఁడుగావున వారినందఱివారించెను.

ఒక్కముహూర్తమాత్రమట్లు నిశ్చేష్టుఁడై యుండి కృష్ణుఁడు మేను వెంచెను. అప్పుడు భుజగుఁడావృత్తులంబాసి కఱచుటలువిడిచి శ్రాంతుఁడై తలయెత్తి విషమునుగ్రక్కుచుఁ జింత

చేనలుదిక్కులుసూచుచు ధూమకాష్ఠమువలెఁ దొలఁగి నిల్చెను. అంతఁ గృష్ణుఁడు కాళియుని నోక్కచేతఁ జఱచి వైన తేయునియట్లు దౌడలువట్టిచీల్చి జఱజఱఁద్రిప్పిక్రిందఁబడవైచెను. విషాగ్ని దానికన్నుల జొబ్బిలుచుండెను. అటుపిమ్మట వాసుదేవుండు కాళియునిఫణిఫణామంటపమున నృత్యమాడఁ జొచ్చెను. ఆనృత్యమునకు యమునాతరంగఘోషను మృదంగఘోషమయ్యెను. బృందావనంబునందుఁ జరించు చంచరీకములగానము గాయకులగానంబై నెగడెను. కలహంసముల మంజుశబ్దములు తాళశబ్దములై చెలంగెను. త్రివిష్టపమునుండి వీక్షించుబృందారకాదిజనులు సభాసీనజనులై వెలింగిరి. అట్లు నృత్యంబుసలుపుచు నాతఁడానందించుచుండెను. ఫణీంద్రుఁడు కంఠగతప్రాణుండై దిక్కులుసూచుచుండెను. పిల్లికిఁ జెలగాటము. ఎలుకకుఁ బ్రాణసంకటము.

కృష్ణపదప్రహారంబులఁ బడగలెడసి నొచ్చి చచ్చినయట్లుపడియున్న భర్తంజూచి నాగాంగనలు మిగులఁ బలవించి లోకైకశరణ్యునికినామహాత్మునికి దండప్రణామంబులాచరించి యనేకవిధంబులస్తుతియించి యిట్లనిపలికిరి. 'దేవా' భోగమాకులమయ్యెను. జౌదలలన్నియుబ్రవస్సెను. ప్రాణములు వచ్చుచుఁబోవుచున్నవి. ఇఁకమాప్రాణనాయకుని నీకరుణాదృష్టులఁజూచి విడిచిపెట్టుము. మాకుఁబెండ్లిసేయుము. మాజీవితేశ్వరు ప్రాణములనిచ్చికావుము. చిన్నతనంబునందలి పెండ్లి పెండ్లిగాదు. నీవుసేయుపెండ్లియ పెండ్లి.

తొమ్మిదవ ప్రకరణము.

'ఆ. మమ్ముఁబెండ్లి సేయు మాప్రాణవల్లభ
ప్రాణమిచ్చి కావు భక్తవరద
నీవు సేయు పెండ్లి నిత్యంబు భద్రంబు
పిన్ననాఁటి పెండ్లి పెండ్లి గాదు.'

ఇట్లు వేడుకొను భుజఁగసతులయందుఁ గరుణించి పుండరీకాక్షుండు చరణఘట్టనంబు సాలించెను. ఫణీంద్రుఁ డెట్టకేలకుఁ బ్రాణేంద్రియంబుల మరలఁ బడసి చదిసి నలిసినతలలు సవరించుకొని వగరుచుచు నంజలిఘటియించి యంబుజాక్షున కిట్లనిపలికెను. 'మహాత్మా! నాపుణ్యమేమని చెప్పుదును? సనకాదిమునిచంద్రులకుసైత మలభ్యంబగు నీపాదరజంబును గంటిని. పుణ్యవంతుండనైతిని'. అనవుడు కృష్ణుం డతనింగాంచి యోయి ఫణీంద్రా! యీమడుగున గోవులును మనుజులును నీరు ద్రావుదురు. నీవిందుండఁదగదు. నీకుటుంబమును బిలుచుకొని యంబుధికి వైళంబ చనుము. నీఫణములయందు నాపదలాంఛనంబులుండుటం జేసి యిది మొదలు పక్షిరాజు నిన్నుఁ బట్టఁడని పలికెను. నాగేంద్రుండు భగవద్వాక్యంబుల కలరి కుటుంబసహితంబుగ నప్పుడ యామడుగువిడిచి కడలిం జేరెను. ఆనాఁడు మొదలామడువున నెల్లవారునుడిగి యాజలమును వాడుకొనఁ జొచ్చిరి. విషమునుబాసి జలము మధురమయ్యెను.

అంతఁ గృష్ణుండు మడుగువెడలివచ్చెను. యశోదయాతనిఁ గౌఁగిలించుకొని ముద్దాడెను. నందుండు మహానందము నొందెను. బలభద్రుండు సంతసించెను. గోపగోపికాజనంబు లుల్లాసంబులం జెలంగిరి. వృషభములు లేచి అంకెలువైవఁ

దొడంగెను. గోవులంభాయని యఱవఁజొచ్చెను. లేఁగలట్టిట్టు లుఱుకుచుండెను. వృక్షములన్నియుఁ జిగిర్చెను. గోపకులెల్లరు యశోదను మిగులభాగ్యవతిగనెంచి పొగడిరి.

ఇట్లువారారాత్రి యాకాళిందీతటంబుననివసించి యాఁకలిడప్పులడస్సి క్రుస్సియుండిరి. ఇంతలో నయ్యరణ్యంబున నొక్క దవానలంబుపుట్టి చుట్టుముట్టుకొనియెను. అదిజూచిగోపాలకు లదరిపడి'కృష్ణా!యల్ల దెచూడుము. కార్చిచ్చు పైకొనివచ్చుచున్నది. మేమెల్లరము నీపదపద్మంబులు నమ్మినాము. మమ్మేలాగున రక్షింతువోనీభారము. వేవేగనాదావాగ్ని వారింపుము'ని యెంతయువేడుకొనిరి. భగవంతుండు వారిఁబలుకకుండుఁడని గహనంబు నిండిన దావదహనంబును పానంబుసేసెను. అందఱు నాతని ననేకవిధంబులఁ గీర్తించిరి. ఆరాత్రి యెట్లోగడపి గోపకులు ప్రాతఃకాలమున మందకుఁజనిరి.

పదియవప్రకరణము.

నందాదు లొకనాఁడింద్రయాగంబు సేయందలంచిరి. కృష్ణుఁడు వారిం జూచి యిట్లనియె 'మీరు యాగము సేయఁబూనితిరి. మంచిది. దీనిఫలమేమి? దీనికీశ్వరుఁడెవ్వఁడు? దీనికి వలయుసాధనము లెవ్వి? ఇయ్యది శాస్త్రీయమా? అట్లుగాక జనాచారమా? దీనిని వైరులకెఱింగింపరాదు గాని మిత్రులకెఱిఁగింపనగును. ఎఱిఁగిచేసిన యెడలఁ గోర్కెలెల్లఁగలుగును. కాఁబట్టి యన్నియు నెఱింగిన మీరలు దీనివిషయంబును సాంతం

బుగా నాకెఱింగింపుఁడు' అనవుడు నందుఁడు నందనుంజూచి యిట్లనిపలికెను. 'పుత్రా! నీకోరినవిషయ మెఱింగినంత వచిం తును. అమరేంద్రుఁ డధికుఁడు. మేఘబృందము లతనికిఁ బ్రియమూర్తులు. దానంజేసి భూమిపై వర్ష మమరేంద్రునిఁ పంపునఁ గురియును. భూతములు హర్షించును. వర్షజలము లచే సస్యములు పండును. లోకులా పంటచే జీవింతురు. ఇంత యెఱిఁగి రాజులెల్లరు మేఘనాథుఁ డింద్రుఁడు మెచ్చుకొఱకు నింద్రయాగము సేయుదురు. దీని నెవ్వరు సేయకుందురు వారి కశుభంబు వాటిల్లును. అదియునుంగాక వర్షముగుసిరినఁ గసవు పెరుగును. కసవు మేసి యావులు వృద్ధిఁబొందును. ఆవులు వృద్ధిఁబొందిన వలసినంతపాడిగలుగును. పాడిగలిగిన మను జులందఱుఁ దృప్తివహింతురు.'

అన విని కృష్ణుఁడు దనకామఖమున నిష్టములేమిఁ దం డ్రింజూచి 'తండ్రీ! యిదియెక్కడిమాట. జంతువులోకమ్మున గర్మవశమునఁ బుట్టును. కర్మము చేతనే వృద్ధిఁబొందును. కర్మముచేతనేచెడును. జనులకుఁగర్మమే దేవత. సుఖదుఃఖముల కును గర్మమే కారణము. సర్వము కర్మాధీనమై యునికింజేసి భూతంబులకుఁ బురుహూతునివలన భీతియేటికి? ఉత్పత్తిస్థితి లయకారణంబులు. సత్త్వరజస్తమోగుణంబులు. అందు రజం బున జగంబుజన్మించు. రజోగుణప్రేరితంబులై మేఘంబులు వర్షించు. వర్షంబునఁ బ్రజావృద్ధియగు. ఇంద్రుఁ డేమిచేయం గలవాఁడు? అతనికేలక్రతువుసేయవలయును? కాఁబట్టియతఁడు మనపైఁగోపింపవలసిన యవసరమింతయుఁజూపట్టదు. ఒకవేళ

నతఁడు గోపించినను మనకు నష్టమేమియు లేదు. మనపట్టణ ములును గేహములును వ్యాపారంబులును బోయినఁ బోవనిండు. హాయిగా శైలారణ్యభాగంబులం దుందము. ఇంతియ కాదు. దీనికంటె నాకొక్కటి చాలమంచిదని తోఁచుచున్నది. అదిధర్మంబని మీకుఁదోఁచిన నది చేయుదుము. ఇంద్రయాగంబునకే వేవి తెప్పింపనెంచితి రవియెల్లఁ దెప్పింపుఁడు. వంటలు సేయింపుఁడు. పిండివంటలు గావింపుఁడు. పప్పును వండింపుఁడు. సర్వమును సిద్ధము సేయింపుఁడు. హోమము సేయుఁడు. విప్రులకు ధేనుదక్షిణ లిండు. పర్వతమునకుఁ బూజలొనరింపుఁడు. చండాలులకును శునకములకును దగినభక్ష్యములఁ గొనిరండు. పసులకుఁ గసవులు పెట్టుఁడు. ఇవన్నియు నొనరించి మనమెల్ల బంధుసమేతముగ నిష్టాన్నంబుల భుజియింతము. మేనుల గంధములనలందుదము. వలయునలంకారములఁ గావించుకొందము. చీనిచీనాంబరంబుల ధరించుకొందము. ఇవి యొనరించితిమేని మన జన్మము ధన్యంబగును. నాయభిమతంబు సైతమిట్లొనర్చుటయే. చెప్పవలసినది చెప్పితిని. పిమ్మట మీయిష్టము'ని యూరకుండెను. అందులకు నందాదులెల్ల సంతసించిరి. గోపికలెల్ల వలయు పదార్థంబులు సిద్ధములుగావించిరి. కృష్ణుఁడొకశైలాకృతిందాల్చెను. గోపకులా శైలంబును బూజించిరి. కృష్ణుని మాయ లెఱుంగమిం జేసి వారలు శైలము నైవేద్యంబులం దినెనని సంతసించిరి. పిమ్మట నందఱుం గలిసి భుజియించిరి. భోజనానంతరమ్మున గోపకులెల్ల రాకొండకుఁ బ్రదక్షిణంబు సేసిరి. అట్లంతయు నొనర్చి మహానందంబునొంది యందఱుం గదలి మందకుఁజనిరి

నందాదులు దనకుమఖముఁ జేయమి కింద్రుఁడు కోపించి సకలమేఘంబులంజీరి యిట్లనియె. వింటిరే నేఁడొక చోద్యము. ఈగోపాలురెల్లఁ గృష్ణునిమాటఁ బాటించి నన్నొక చీరికింగొనక పూజింపక యొకకొండనుబూజించి తమదారింజనిరి. వీరలకుఁ గ్రొవ్వుపట్టియున్నది. వీరు ద్రావిన పెరుగులను గ్రక్కింపవలయు. వీరుదిన్న భక్ష్యంబులను బయటికిరప్పింపవలయు. పిల్లవానిపలుకులు లెక్కసేసి నన్ను విడిచినవీరి నేమిచేసినను బాపములేదు. తత్క్షణముమీరిందుండి బయల్వెడలి మీమీతటిల్లతలఁగప్పి గర్జనములు సెలంగఁ జేసి గోవులను గోపాలురను వేధింపుఁడు. నేనునైతము మీవెంట నేవత్తును. మీరలుగురియు జాలవర్షంబునంగాని వీరలు ప్రాణములువాయరు. అనవిని మేఘములు మహామోదమునొంది యందుండి బయలుదేరెను. నిమిషమాత్రంబున నాకాశమెల్ల మేఘాచ్ఛాదితమయ్యెను. రోదోంతరాళంబు నీరంధ్రఘనిబిడాంధకార బంధురంబుగ నిరోధింపఁబడెను. కన్నులు మిఱుమిట్లుగొల్పుచుఁ దటిల్లతలెల్లెడలఁ దళుకుతళుక్కున మెఱయుచుండెను. వర్షపుఁ జినుకులు చిటపటమని భూమిపయింబడఁదొడఁగెను. ఇంచుకసేపులోన బ్రహ్మాండభాండంబులు పిల్లులువడునట్లు లేనుఁగుతుండంబులంత ధారలతోడ వర్షమత్యధికమయ్యెను. మిట్టపల్లంబులు సమతలంబులై యేకార్ణవంబురూపంబునఁ జూపట్టుచుండెను. నడుమనడుమ మేఘమ్ములుశిలలవర్షించుచుఁ బిడుగులఱువ్వుచుండెను. గోవృషభంబులు శిలాపాతంబులకు వెఱచి జలంబులనతిప్రయత్నంబున నీదుచుండెను. లేఁగలు మేఘఘోషణములకు భ్రమఁజెంది సొమ్మసిల్లిపడుచుండెను. గోపగోపికాజనంబు

లపాయంబుగలుగునని భీతిల్లి కృష్ణునిఁజేరి యిట్లనిమొఱలిడఁ దొడఁగిరి. దేవా! నీవెక్కడనున్నాఁడవు? మరణంబునొంద సిద్ధమైయున్న మమ్ముఁగావవేమి? మేమెల్ల నీదాసులముగామా? ఈయుఱుములు విపరీతములుగవినఁబడుచున్నయవి. ఈమెఱుములుగన్నులను దెఱవనీయవు. ఇట్టివర్షమును మేమెన్నఁడెఱుఁగము. నిన్నుఁదక్క మేమితరమెఱుఁగము. ఇట్లుమమ్ము పేక్షించుటనీకున్యాయముగాదు. రమ్ము. కావుము. కావుము.'

అనవిని కృష్ణుఁడు గోపకులభీతిమాన్పఁదలంచి వలకేల నాతపత్త్రంబులీల గోవర్ధన పర్వతమునెత్తి యెల్లరను దానిక్రిందికి రమ్మనిపిలిచెను. కొందఱుదానిక్రిందికిఁ జనిరి. కొందఱదితల పైఁబడునను భీతిచేఁ దల్లడిల్లుచుండిరి. కృష్ణుఁడు వారలంగాంచి 'బంధుజనులారా! యేలమీకు సందేహము? ఈతఁడు బాలుఁడు. కొండగొప్పది. దీనిభారము నీతఁడు సైరింపఁజాలఁడు. మాగతియేమగునో యని మీరు శంకింపఁబనిలేదు. మహీచక్రమంతయు విఱిగిపైఁబడ్డను నాకేలల్లాడదు. మీరెల్లరుదీని

'శా. బాలుండీతఁడుగొండదొడ్డది మహాభారంబు సైరింపఁగాఁ
జాలండోయని దీనిక్రిందనిలువన్ శంకింపఁగాబోల దీ
శైలాంభోనిధి జంతుసంయుత ధరాచక్రంబు పైఁబడ్డ నా
కేలల్లాడదుబంధులార!నిలుఁడీ! క్రిందన్ బ్రమోదంబునన్.'

క్రిందనిలువుఁడ'ని యుత్సాహవాక్కులుపలికెను. ఆతనిపలుకులచేననుమానములుమాని గోపజనమ్ములు పర్వతముక్రిందఁజేరిరి. ఇంద్రునకు మఱింతరోషము హెచ్చెను. ఆతఁడు మేఘములను

బురికొల్పఁజొచ్చెను. ఏడహోరాత్రములు వర్షము విడువక కురిసెను. కొండక్రిందివారికింతయైన నపాయము గలుగదయ్యె. బిడౌజుఁడు విఫలమనోరథుఁడై మేఘములమరలించుకొని తన దారిం జనియెను. వానగాలి మెల్లననుడిగెను. గోపజనమ్ములు గొండక్రిందనుండి వెలుపలికరిగిరి. కృష్ణుఁడు గిరిని యథాస్థానంబుననిలిపెను. సకలజనులాతని కీర్తినభినందింపఁ దొడంగిరి.

'సీ. కన్నులు దెఱవని కడుఁజిన్నిపాపఁడై
దానవిచనుఁబాలు ద్రాగిచంపె
మూఁడవ నెలనాఁడు ముద్దులబాలుఁడై
కోపించిశకటంబుఁ గూలఁదన్నె
నేడాదికుఱ్ఱఁడై యెగసితృణావర్తు
మెడఁబట్టుకొని కూల్చి మృతునిఁ జేసెఁ
దల్లి వెన్నలకునై తనుఱోలఁగట్టినఁ
గొమరుఁడై మద్దులు గూలనీడ్చెఁ
తే. బసులఁ గ్రేపులఁగాచుచు బకునిఁజీరె
వెలఁగతో వత్సదైత్యుని వ్రేసిగెడపె
సబలుఁడై ఖరదైత్యుని సంహరించె
నితఁడు కేవలమనుజుఁడే యెంచిచూడ॥'

అంతఁ బురందరుఁ డాతని చెంతకువచ్చి కరకమలములు ముకుళించి తనయపరాధమును క్షమింపుమని వేడుకొనెను. సంశ్రితావనుఁడగు కృష్ణుండాతనిమన్నించి వీడుకొలిపెను. తుంబురునారదాదులు భగవంతునిఁగీర్తించిరి.

పదునొకొండవ ప్రకరణము.

నందనందనుని చెయ్దంబులననుదినంబును జారులుకంసున కెఱింగించుచుండిరి. అవియెల్లవిని యాతఁడు భయంబున నూరక చింతిల్లఁదొడఁగెను. కన్నులుమూసిన నాతనికిఁ గృష్ణుఁ డెదుటఁ గానఁ బడుచుండెను. ఒక్క రాత్రినైన నాతఁడు సుఖముగ నిద్రింపఁ జాలఁ డయ్యెను. నిరంతర స్వప్నములచే నాతని మనము గలఁతనొందు చుండెను. ఆనాఁటికానాఁటి కాతనికి వ్యథమనముననధికముగాఁ దొడఁగెను. ఇట్లుండ నొక నాఁడు నిశీథమున నాతఁడు సభామంటపంబున నొక్కరుండు గూర్చుండి యెద్దియోచింతించుచుండెను. చాణూరుఁడొకఁడు ప్రక్కన నిలువఁబడియుండెను. కొంతసేపునకుఁ గంసుఁడాచాణూరుం జూచి యుగ్రసేనాదులఁ దత్క్షణమ తనకడకుంగొనిరమ్మని యాజ్ఞాపించెను. యదుభోజముఖ్యులెల్లరుఁ జారుని వెంటఁ గొలువునకువచ్చిరి. కంసుఁడువారల కుచితాసంబులర్పించి కూర్చుండ నియోగించెను. ఎల్లరుఁ గూర్చుండి తనుకేమి కీడుమూడునో యని యోచించుచుండిరి. కంసుఁడు వారలఁ గాంచి యిట్లని పలుకఁ దొడఁగెను. 'యదుభోజముఖ్యులారా ! మీరెల్లరు సర్వకార్యజ్ఞులరు. సర్వాగమములఁ బారఁగులరు. త్రివర్గవర్తన నిపుణులరు. లోకవిక్రమ వివేకనిష్ఠులరు. సమర్థోపాయులరు. అభిగుప్తమంత్రులరు.అనర్థములయందుఁ బరాఙ్ముఖులరు. ఆర్యభావానుగతులరు. ఆర్తత్రాణతత్పరులరు. నయసమగ్రులరు.

బుద్ధిమగఁటిమి మీకు దేవతలు సైతముసాటిరారఁట. నరులవిష
యముఁగూర్చి చెప్పనేఁ? మీచరితములు పరమభద్రములు.
యదుభోజకులంబుల భరించి పేరుగన్న మీరు నాకెపుడు
హితవుఁదలఁచి నామనోవృత్తిననుసరించుచుందురు. ఇపుడునా
కొకయనర్థము జనించియున్నది. దాని నుపేక్షించుటమీకుఁ
బాడియగునే. అదియెద్దియనినవినుండు? కృష్ణుండు నాకపకారం
బు సేయఁబుట్టినవాఁడు. ఉపేక్షితమగురోగ మెట్టులట్టులాదురా
త్ముండు వర్ధిల్లుచున్నవాఁడు. ఎంతనేర్పునఁ జింతించినను వాని
పుట్టువుంబాడవు నున్నరూపునిశ్చయింపరాకున్నది. వానిచరి
తంబు లతిదైవతంబులునమానుషంబులుగఁ జూపట్టుచున్నవి.
అట్లగుటం జేసి యాతఁడాశ్చర్యకారణంబునఁ బుట్టిన దేవతాప
త్యంబని నేను తలంతును. అట్లుగానినాఁడెవ్వఁ డసురులతోడఁ
బూతనచను బాలుద్రావెననియోచింపనగు? ఎవ్వఁడు మద్దుల
నాశ్చర్యకరంబుగఁ గూలఁదన్న సమర్థుఁడు? ఎవ్వఁడు కాళియ
నాగంబునడఁచి యుండఁగలఁడు ? ఎవ్వఁడు గోవర్ధనపర్వత
మువలకేల బంతిలీలఁబట్టు నంతటి బలాఢ్యుఁడు ? ఇతరులకి
విసాధ్యంబులు గావు. మాయలయం దాఱితేఱిన నాబంటు
లింత కనేకులు మునిసిరి. ఇఁక శేషించినవాఁ డొక్క కేశి
యనువాఁడే. వాఁడును బోయి కృష్ణుని చేఁగూలును. ఇఁక
వాని తరువాతివాఁడను నేను. చంపమఱఁగినవాఁడు నన్నే
లసైచును? అతఁడెల్లైనవచ్చి నాపైనుఱుకును. అదితప్పదు.
అంతయేల? అప్పుడప్పుడాతఁడు యమునివలె బొమలుముడిచి
పిడికిలినమరిచి యపుడుఁ గఱచుచుఁ గోపంబున నాపైఁబడుట
నామొగమున | వేలుచుందును. అక్కటా! యాతఁడేగదా

తొల్లి నరసింహుఁడై పుట్టి హిరణ్యకశిపు వధియించెనని విను చుందుము. కూర్మావతారమున మందరపర్వతముఁదాల్చినవాఁ డీతనికంటె మఱియెవ్వఁడు గలఁడు? హిరణ్యాక్షుని వరాహ రూపంబునఁ బేరులేకదోరించిన యాతఁడితఁడనివేఱుగ వక్కా ణింపవలయునా? వైరోచనువంచించి స్వర్గరాజ్యము జంభారి కిప్పించిన మేటియితఁడనియే నానిశ్చయము. ఒక్కటియేల? యుగయుగమున నితఁడుపుట్టి దుర్మార్గుల శిక్షించుచు సన్మార్గు లరక్షించుచు భూదేవికి మేలొనరించుచున్నాఁడు. మమ్ముల సంహారింపనీభవంబుఁ గొన్నట్టు తోఁచుచున్నది. నారదు వాక్యములఁబట్టి చూచిన నియ్యదివట్టితోఁచుటయేగాదు. నిశ్చ యము. ముమ్మాటికి నిశ్చయము.

ఇదియెల్ల నెఱిఁగి యెఱిగి నేనేల ప్రాణంబులు గోలుపోవ లయు? కృష్ణునభివృద్ధినొందనీయక త్రుంచివైచిన నంతయుఁ దీరును. వానియభివృద్ధికిఁ గారణభూతుఁడు వసుదేవుఁడే. ఈతడు పుట్టిన బిడ్డనర్ధరాత్రంబునఁ గొని నందునిమందకుఁజనియెనఁట. అందుండి యశోద పుత్రికను గొనివచ్చెనఁట. అదియంబరంబు నుండి నామరణముఁజెప్పిచనియెను. ఔరా! నమ్మినవానిగొం తుఁగోయుట యెంతపాతకము? ఈవసుదేవుని నమ్మితిని. మన్న నలనేకములుగావించి మనిచితిని. నాకంటె నెక్కుడుగఁజూచి తిని. పూజించితిని. ఈతఁడింతటిద్రోహమ్మునకొడిగట్టునని కలనైన ననెంచియుండను. అట్టైననితడింతఁదనుక భూమిపై నిలిచియుండ గలఁడే' అనవినియెవ్వరు నేదియుఁ బలుకనోడిమిన్నకుండిరి. కం సుండుక్రోధముఁ బట్టఁజాలక వసుదేవుని దిక్కుమొగంబై పలి కెను. 'వసుదేవా! యెట్టికుటిలమానసుఁడవు! నీవుతడిగుడ్డలగొం

తులుగోయు చందము లెప్పుడు నేర్చితివి? నమ్మించి గొంతుగోత పాపమని యెఱుఁగవా? భ్రూణహత్యాది పాపములకైన నవధి గలదుగాని కృతఘ్నుని కలుషమునకు నవధి లేదను పలుకులు వినవే. దానికి ఫలము నరకలోక వాసము.

'తే.గీ. భ్రూణహత్యాదులగు పాపములకు నవధి
గలదుగాని కృతఘ్నుని కలుషమునకు
లేదు నిష్కృతియంతంబు లేని తీవ్ర
నరకపీడ సంప్రాప్యమన్నరునకండ్రు॥'

అది యట్లుండనిమ్ము. నేను కులమున కొక్కకొఱఁతయు లేక రక్షించుచున్నాఁడ. అట్టినాయెడ నీవిట్టి ద్రోహంబుఁ గావించుట పాడిగాదు. నీకు నేండ్లువచ్చినవి. నీవును ముదిసితివి. ఏమి ప్రయోజనము? నీ కౌటిల్యము నేనెఱుంగనైతినని తలఁపకుము. నన్నుఁ జంపించి నీకొడుకును రాజుఁగావించి మధుర నేలింపఁ జూచెదవు. కానిమ్ము. నన్ను సామాన్యునిగ నెంచి నీవిట్టి యోచన నొనరించితివిగదా! నాకేశ్వరుఁడైన నన్నెదిరింపఁ జాలఁడనువిషయమును మఱచితివిగాఁబోలు. పినాకధరుఁడు నాకు సాటిరాఁడనుట నీవెఱింగిన దేకదా! ఇఁక బాలుఁడెట్లు నాతోడ డీకొనునని యెంచితివి? ఇది నీతప్పుగాదు. నిన్నుఁబట్టి వేధించుచున్న యాశాపిశాచము నిన్నిట్లు పురికొల్పుచున్నది.

పామునకుఁ బాలోసి పెంచినట్లు దుర్మార్గునకు నీకు నాతండ్రి యెంత మేలొనరించెను? అది నీకింతయైనను దలఁపునకు వచ్చెనే? ఆదినుండియు నీకృత్యముల నీచత్వము గానరాదు. ఇప్పుడేలొకో యిట్టివానికిఁ బూనుకొంటివి. చేసినవానిఁ జేసితివి.

ఇంకను జేయుము. నీవెట్టి పనులొనర్చినను నిన్ను నేను చంపను. నా చేతులాడవు. పుట్టించినవాఁడు మొగమున వ్రాసినట్లగునని పూర్ణముగ నమ్మియుందును. నీదౌరాత్మ్యము యదుకులమువారికిఁ దలవంపుఁగలుగఁ జేసెను. మానహీనునకు నీకు కులమువారి జోలియొకటి వలయునే? కృష్ణునకును నాకును గలిగిన వైర మూరకపోవదు. మాయిరువురియందొక్కరుఁడు శాంతించుటనిక్కవము. నిన్ను నేను వెడలనడువఁజాల. నీకిష్టమున్న నిందుండుము. లేకున్న నెందేనిం జనుము. పలుకులఁబనిలేదు.' అన విని వసుదేవుఁ డెద్దియుఁ బలుకఁజాలక సర్వాత్ముని నమ్మి యూరకుండెను. కంసుఁడాతని ననినఁగార్యంబు లేదని యెంచి భోజకులాలంకారు నక్రూరుం బిలిచెను. అక్రూరుఁడు లేచి మెల్లనఁ గంసుడాయంజనియెను. కంసుఁ డాతనిం గాంచి యిట్లనిపలికెను. 'అనఘా! నీయందు నాకు నమ్మకము గలదు. నీవు నాకొక్క కార్యముఁ గావింపవలయు. వసుదేవునిక అపులెవ్వియు వినకుము. ఈప్రొద్దకె గలి గోకులంబునకుఁ జనుము. అందు నందగోపకునిఁ గాంచి నామాటగా 'నీవు నీవారలను గలిసి యియ్యేటియరిఁ గొనిరమ్ము. తడవు సేయంజనదు. అంతియకాక యేను నాధనువున కుత్సవంబు సేసెదను. దీనికి ననేక దేశాధీశ్వరులు రాజులు సకలజనులు వచ్చుచున్నారు. ఎల్లరకనేక దివసంబులదనుక భోజనంపు వసతు లేర్పఱుపవలసియుండును. అందులకు వలయు దధిక్షీరఘృతంబుల నపరిమితంబులుగ గోపాలుర చేతం బంపుము. నా మేనల్లురను బాలురను జూడ బుద్ధిపొడుము చున్నది. వారిని నీయక్రూరునితోడ నంపుమ'ని పలుకుము. ఎట్లైన నందునకుఁ దగుమాటలు సెప్పి బలరామకృష్ణులఁ దోడితెమ్ము. నాయొద్దనున్న జెట్టి మల్లులతో

వారిని డీకొనఁజేసెదను. వారి శక్తులావలఁ దెలియనగును. నా పలుకులకడ్డమువలుకకుము. వేవేగఁజనుము'. అనవిని యక్రూరుం డమందానందకందళితహృదయారవిందుం డై గోవిందు దర్శనము సేయు భాగ్యమబ్బెనని లోలోన నువ్విళులూరుచు బయలు దేరెను.

పండ్రెండవ ప్రకరణము.

అక్రూరుండు సనినవెనుకఁ గంసుఁడుకొలువుసాలించి వసుదేవాదుల నెప్పటియట్ల కారాగారంబునఁ ద్రోయించి తన కుముఖ్యునిఁ గేశియనురక్కసునిం బిలువనంపెను. వాఁడువచ్చి కంసునికి వందనమాచరించి యాజ్ఞయేమని మెల్లననడిగెను. కంసుఁడాతనిఁజూచి 'నీవు వేవేగఁజని నందునిమందయందుఁగల నా మేనల్లురవధించి యావార్తనా చెవిని వేయవలయు. వారి నిటకుఁ గొనిరమ్మనియిప్పుడ యక్రూరునంపితిని. ఆతఁడు రేపుద యమున బయలుదేరఁగలఁడు. మార్గమధ్యముననే రామకృష్ణు లమరణవార్తనాతని చెవినివేసి నీవాతని మగుడఁగొనిరమ్ము. పొమ్మ'ని సాగనంపెను. మహాప్రసాదమని కేశి నందుని మంద కప్పుడ బయల్వెడలెను.

తెల్లవారెను. మందయందు మహాఉగ్రరూపమున సంచరించుచుఁ గేశి పేరఘోరమగోపకుల నుక్కడఁగింపనిష్టము లేనివాఁడై శ్రీకృష్ణు వెదకఁజొచ్చెను. ఆతనిరాక నెఱింగి నారాయణుండు చిఱునవ్వునవ్వి గోపకులనెల్ల దూరముగనుండనియెను.

దానవుఁడుగ్రసింహనాదంబుఁ గావించి నోరుదెఱచి గోవిందుని మ్రింగఁదొడఁగెను. కృష్ణుఁడు మెల్లన నాతని నోటఁబడక దూరమయ్యెను. కేశి మహాకోపంబునొంది యాతనిఁ దన కాల నొక్క తన్ను దన్నెను. ఆతన్నునకు నొవ్వక హరి రెండు చేతుల నిశాటుని పాదములంబట్టి ధనుశ్శతమాత్రదూరము విసరివైచెను. వాఁడు దూరమునుండి హుంకరించుచు లేచి పరువిడుచు వచ్చి కృష్ణునింబట్టి నోటనుంచుకొని మ్రింగివైచెను. భగవంతుఁ డాతని కుక్షిలోనఁ జేరి దేహమ్మును బెంచెను. దానవుని కూపిరి యాడదయ్యెను. అంత నాతఁడు విలవిలఁ దన్నుకొనుచుఁ గ్రిందఁబడి చచ్చెను.

అయ్యది యెఱింగి మహాసంతోషంబున నరుదెంచి నారదుండు బాలకృష్ణునిఁ గీర్తించి తనదారిం జనియెను. అంత గోపాలకులు కొందఱు గొఱియలుగను కొందఱు పాలకులుగను కొందఱు దొంగలుగను నాడుకొనుచుండిరి. అది తెలిసి కంసునికి హితుండు మఱియొక దానవుండు వారిలో నొక గోపబాలుఁడై యాడుచుండెను. ఆతని యునికినిఁ గృష్ణుఁడు దక్క మఱెవ్వరెఱుఁగరు. గోపబాలుని రూపముననున్న దానవుఁడు దక్కిన గోపాలుర నెల్లఁ దోడ్కొని చని యొక గుహయందుఁ బ్రవేశింపఁజేసి దాని ద్వారమ్ము నొక పెనుఱాత మూసివైచెను. ఆవల నొక్కెడనున్న కృష్ణుఁ డయ్యది యెఱింగి దొంగ గోపబాలునిఁబట్టి 'యోరీ? నిశాట! నీదొంగతనము బయటపడియెను. నీవింకెక్కడికేగఁగలవు? చావుము'నుచుఁ బిడికిటఁ బొడిచెను. వాఁడు విలవిలఁదన్నుకొనుచుఁ జచ్చెను.

అక్రూరుండు రథమెక్కి బయలుదేఱెను. మార్గమధ్యమున నాతఁడు శ్రీకృష్ణునిఁ జూడఁగలిగినందులకు మనంబున నుప్పొంగుచు మధురాపుర మెప్పుడెప్పుడు వచ్చునో యనుకొనుచుండెను. మధురాపురము వచ్చెను. అక్రూరుఁ డందుఁ బ్రవేశించెను. ఆతనిరాక నెఱింగి నందాదులు పరమానందభరితులైరి. రామకృష్ణు లాతని నెదుర్కొనిరి. అక్రూరుఁడువారల పాదంబులకు మ్రొక్కి పొగడఁజొచ్చెను. కొంత సేపునకు నందునిపంపునఁ గొందఱు వచ్చి యక్రూరునిఁ గొంపోయి భోజన మజ్జనాదులు గావించిరి. అక్రూరుండు గొంత విశ్రమించెను. అంతట రామకృష్ణు లాతని డాసిరి. కృష్ణుఁ డాతనిఁగాంచి యిట్లనియె.

అయ్యా! యక్రూర! మధురాపురంబున నేమివిశేషములు? నాతలిదండ్రులు సుఖమున్నవారా? చుట్టాలకు క్షేమమే కదా! మామామ భయములేక వర్తించుచున్నాఁడా? అతఁడు నాతలిదండ్రులను గారాగారమునుండి ముక్తులఁగావింపఁ దలపెట్టఁడని తలంతును. నీవు వచ్చుటవిని నాజననీ జనకులేమైననాతోఁ డఁ జెప్పుమని చెప్పిరుగదా! వారిస్థితియెట్లున్నది? చెఱయందలి బాధలచేమిగుల డస్సిరిగాఁబోలు. సవిస్తరముగా నాకువిషయములెల్లఁ జెప్పుము'. అనవిని యక్రూరుండు కింసునిక్రౌర్యంబును దేవకీవసుదేవులబాధలనుజెప్పియిట్లనియె. 'మహాత్మా! యేమిచెప్పుదును! నిన్నరాత్రి కంసుఁడు మీతండ్రినూరకేయనరాని మాటలనియెను. ఆతనియెదుట మిమ్ములను జంపించునట్లు ప్రతినపట్టెను. ధనుర్యాగంబు పేరుసెప్పి మిమ్ములఁ గొనిరానంపెను. నేనువచ్చితిని. మీయిష్టము' నావుడు కృష్ణుఁడా

నందనుందనందాదులంగాచి 'కంసనాయకుండు ధనుర్యాగంబుఁ జూడ మమ్ముఁబిలుచుకొని రా నీయక్రూరునంపినాఁడు. మేము వశ్యమాత్రినిఁ జూడఁబోవలయు. మఖమునకువలయు కట్నము లు గానికలుగానిరిండు. పాలు నెయ్యి పెరుగులు గూడఁ బెట్టుఁడు. త్వరపడుఁడు'ని పలికెను. గోపకులు దమతమ గృహంబుల కేగిరి. రామకృష్ణుల మధురాపుర ప్రయాణంబులను విని పురంబు నందలిజనంబు 'కాకౌరా! యిదియేమివింత. బాలకుల యాట పాటలఁ గన్నులారఁ జూడక యెట్లు మనఁగలము? ఈయక్రూరుఁ డెక్కడ దాపరించెను? మనకు దినము లికె నెట్లు గడచునో యెఱుఁగరా దయ్యెను. అందఱము నేగి బాలకులఁ గొనిపోవవలదని యక్రూరునిఁ బ్రార్థింతమా! '. యనుకొనుచుండిరి. ఇంతలోన గోపాలకృష్ణుండు బలభద్రుఁగూడుకొని యక్రూరుండు తోడరాఁ గాంచనరథం బొం డారోహించి బయలుదేరెను. గోపికాగోపకసంఘము లాతని వెంటఁ దవిలిరి. కృష్ణుఁడు వారి నతిప్రయత్నమున వెనుకకు మరల్చి పోవుచుండెను.

రామకృష్ణులకు మార్గమధ్యమున నొక కొలంకు గానఁబడెను. వారలిరువురందుడిగి పానీయంబులుద్రావి మగుడరథ మెక్కిరి. అక్రూరుండు వారలయనుజ్ఞచే నాకొలంకునడిగి స్నానమాచరించెను. ఆతని కానీరు మిగులఁ జల్లఁగనుండెను. భగవంతుని సంస్మరించుచు మనముఁ జంచలంబు నొందనీయక దిటముగావించుకొని యక్రూరుండు నీటివైపు దృష్టిసారించి చూచుచుండెను. ఆతని కానీటిమధ్యమున రామకృష్ణులు గానఁబడిరి.

'వీరు రథముపైనున్నవా రిందుల కెట్లువచ్చిరి? రెండుదిక్కులను వీరు దోఁచుట నాకు విభ్రాంతి నొసంగుచున్నది. ఇది విభ్రాంతియని నమ్మవలసిన దగునే? కాదు. కాదు. ఇది నిక్కువ మ'ని యాతఁడు తెప్పవాల్పక చూచుచుండెను. శేషాహిపైఁ బరుండియున్న నారాయణుఁ డాతనికి లోచన గోచరమయ్యెను. అక్రూరు నానందమునకు మేరయెక్కడిది? 'ఆహా! యేమి నాపుణ్యము! యోగిజనమ్ములకు సైతము సాధ్యముగాని పరమపూరుషుఁడు నాకన్నుల కగపడుచున్నాఁడు. ఈమహాత్ముని ధ్యానించి కైవల్యము నందెద ననుచు' నాతఁడు రెండుచేతులు జోడించి నిష్ఠాపరుండై యనంతుని, నాదిమధ్యాంత రహితుని, స్వయంజ్యోతిని, నిరాకారుని, బ్రహ్మంబును, ధ్యానించుచు నిలువఁబడెను. కొంతసేపునకుఁ బరమాత్మ తనతొంటిరూపు సాలించెను. అక్రూరుఁడు నదీజలంబులు వెడలి వచ్చి వెఱఁగుఁగొన్నవాఁడై కృష్ణు డాయంబోయెను. కృష్ణుఁ డాతనింజీరి, 'యక్రూరా! యింతితడ వెందుంటివి? ఏమిచేయుచుంటివి? ఏవియైనను నీకు వింతలు గానఁబడెనా? య'ని యెద్దియు నెఱుఁగనటు లడిగెను. లీలామానుష విగ్రహుం డగుహరిపలుకుల నెఱింగి యక్రూరుండు సంతసించి యాతని స్తోత్రము గావించెను. ఇట్లు గావించి యాతఁడు రథమెక్కి హయములఁ బోవనిచ్చెను. ఇంచుక తడవునకు రథము మధురాపురంబును డాసెను.

పదుమూఁడవ ప్రకరణము.

పడమట బారెడు ప్రొద్దుండెను. మధురాపురంబు చెంగటరథమునిలిపి యక్రూరుండు రామకృష్ణులఁ దనయింటికి రమ్మని వేవిధములఁ బ్రార్థించెను. రామకృష్ణులాతని నాదరించి కంసవధానంతరమున వచ్చెదమని పలికి వీడ్కొల్పిరి. అక్రూరుండు సంతసంబునఁ బురముఁ బ్రవేశించెను.

ఆతనిరాకఁ జారులవలన నెఱింగి కంసుండు మేడపైఁ గూర్చుండి యాతనిఁ బిలువనంపెను. అక్రూరుండతని కడకు వచ్చి మ్రొక్కి యుచితాసనమ్మున నుపవసించెను. కంసుఁడాతనిఁ గాంచి 'యక్రూరా! నీవుపోయినపని యేమయ్యెను? రామకృష్ణులు వచ్చిరా? ఏరివారు? ఎందున్నారు? ఇందులకేలరారైర'ని యాతురతతోఁ బలికెను. అక్రూరుండు 'రాజేంద్రా! వారు వచ్చిరి. ఊరిబయట నున్నవారు. త్వరలోనఁ బురములోనికివత్తుర'ని నుడివెను. కంసునకుఁ బట్టరాని సంతోషము గలిగెను అదియ సమయముగ నక్రూరుండాతని కడసెలవు గొనియింటికేగెను.

రామకృష్ణులు మధురానగరప్రవేశముఁ గావించిరి. ఒప్పులొలుకు నప్పట్టణమునందలి రామణీయకముఁ జూచి వారచ్చెరువందుచుండిరి. కృష్ణుఁడన్నఁ జూచి యిట్లనియె.

అన్నా! యీప్రాసాదము లెంతయెత్తున్నవో చూడుము. ఏమి యీదీర్ఘికల సొంపు! ఇంతలింతలు వెడల్పు వీధు

లెండైనఁ గలవే? ధాన్యపురాసు లెందుఁజూచినను గలవు. ఈ వీరు లెంతబలిసియున్నారు! ఆహా! యేమియీపురలక్ష్మిశోభ! ఎన్నాళ్లకీపురంబును గాంచఁగలిగితిమి! అన విని బలరాముఁడౌ నౌ! నని వింతగఁ జూచుచుండెను.

వారి రాక నెఱింగి పౌరులెల్లరు మూకలు గట్టి యొకరితోడ నొకరు గుసగుసలాడుచుండిరి. సుందరులు సౌధవీథుల నిలిచి వారినిఁజూచుచుండిరి. కొందఱు కృష్ణుంగాంచి వింతపడి యిట్లని పలుకఁ దొడఁగిరి.

సీ. ఏఁడతఁ డక్కసి విగతజీవఁగఁ జన్ను
బాలు ద్రావిన మేటి బాలకుండు
ఏఁడతఁ డే నందుని వెలఁదికి జగమెల్ల
ముఖమందుఁ జూపిన ముద్దులాఁడు
ఏఁడతఁ డే మందలో వెన్నలు దొంగిలి
దర్పించి మెక్కిన దాఁప రీఁడు
ఏఁడతఁ డే యెలయించి వ్రేతలమానంబు
సూఱలాడిన లోకసుందరుండు

తే. ఏఁడు లేకున్నఁ బురమటవీస్థలంబు
ఏని బొందని జన్మంబు విగతఫలము
ఏనిఁ బలుకని వచనంబు విహగరుతము
ఏనిఁ జూడని చూడ్కులు వృథలువృథలు.

కొందఱాతనిఁగాంచి 'యాహా! యేమేమి నోములు నోచి నందుని మందయందలి గోపికలితనిఁ జింతించుచుఁ బాడుచు నానందమొందుచుండిరని' ముక్కులపై వ్రేళ్లిడుకొను

చుండిరి. కొంద ఱింతకంటెఁ బుణ్యాదివసముగలుగఁబో దని
రామకృష్ణులపైఁ బుష్పములు సల్లుచుండిరి. అట్లు పురమెల్ల
నానందరసాంబునిధినోలలాడుచుండ వారలు పురవీధులం గడ
చి చనుచుండిరి.

ఆసయమ్మున నామార్గమున నొక రజకుఁడు చనుచుం
డెను. వానిభుజమున నొక పెద్దమూట వ్రేలాడుచుండెను.
ఆమూట నిండుగ విలువగల వసనంబులుండెను. కృష్ణుఁడు
వాని జూసి 'యోరీ చాకలీ! యెవ్వరి కీవలువలు గొని చను
చున్నాఁడవు? ఈమూటయం దెట్టి బట్టలుగలవు మాకుఁజూపు
ము. ఇవి మాకైనఁజాల సొంపుగ నుండునట్లుతోఁచెడి న'నుచు
చంకనున్న మూటను లాగెను. చాకలి గన్నులఁ గెంపుగదురఁ
గృష్ణు నదలించి యిట్లనియె. 'ఏమేమీ? మారాజుచేలములు
నీకుఁగావలయునే? వానినిఁగట్టనీకర్హతగలదే. మారాజేంద్రుఁ
డెక్కడ? నీవెక్కడ? ఏనుఁగుతో దోమనుసాటిసేయవచ్చునే?
ఎంతమాటాడితివి! ఈమాటా మాటాడితివేని నీకు బ్రదుకుగ
లదే. జాగరూకతఁ బొమ్ము. లేకున్న నీగతి పట్టిదగును'. అనవిని
రోషించి కృష్ణుఁడాతని వెంద్రుకలువట్టియీడ్చి క్రిందఁ బడద్రో
బ్బియొక్కపిడికిటిపోటున యమునిఁజేరఁబంపెను. తమవాని
చావుఁజూచితక్కుంగలరజకులెల్లరుభయకంపితులైరి. కొందఱు
గోపాలుఁడు దమ్మెక్కడఁ జంపునోయని మూటలందుఁ బాఱ
వైచి కాలికి బుద్ధిసెప్పిరి. కొందఱామహాత్ముఁడు గోరినవలు
వల నిచ్చితృప్తిపఱచిరి. కొందఱు వడవడవడఁకుచు నేమియుఁదోఁ
పక నిలిచి యుండిరి. ధైర్యమవలంబించి యొక్కఁడు వచ్చి
గోవిందునకు నమస్కరించి తనమూటఁ గలవస్త్రములన్నియు

నర్పించెను. స్వామి గొన్నిఁటి బలభద్రునకొసంగి తక్కినవి దానుధరించి మిగిలినవి యితరగోపకులకొసంగెను.

అవ్విధంబునఁ గృతకృత్యులై వారిరువురందుండి బయలుదేరి సుదాముఁడను నొక మాలాకారుగృహమున కేగిరి. సుదాముఁడు వారిఁజూచినంత నేలేచి యాసనమర్పించి గౌరవించి 'మహాత్ములారా! యేమినాపుణ్యము! నాకులమంతయుఁ బావనమయ్యెను. పూర్వజన్మకృత తపంబుపండెను. నావలన నెయ్యదియైనఁ గార్యములున్న నానతిండు. తత్క్షణమదియొనర్చెద న'ని సవినయంబుగఁ బలికి సురభికుసుమదామముల ననేకములనుగొని వచ్చి వారిముందుంచెను. రామదామోదరులు వలసినన్నిసుమంబుల నలంకరించుకొని తోడివారలకొసఁగిరి. వారునుగావలసినన్ని ధరియించిరి. అంతఁ గృష్ణుఁడు సుదాముని దిక్కుమొగంబై 'యోయీ! నీభక్తికిమెచ్చితిమి. కోరినవరములడుగుము. ఇచ్చెద మని'పలికెను. మాలాకారుఁడు సంతసించి 'మహాత్మా! భవదనుగ్రహముచక్కనాకొండువరమేల? సర్వకాల సర్వావస్థలయందును నీభక్తినిమానకుండఁ జేయుము. సర్వభూతముల యందు సమబుద్ధినొసంగు

'క. నీపాదకమలసేవయు
నీపాదార్చకులతోడి నెయ్యము నితాం
తాపారభూతదయయును
దాపసమందార నాకుదయచేయఁగదే.'

మ'నిదీనుఁడై వేడుకొనెను. భగవంతుఁడాతని కోరికఁదీర్చియందుండిబయలుదేరెను.

కొంతదవ్వు చనునంతకు వారికొకవికృతపుశరీరముగల యొకయాఁడుది కానఁబడెను. ఆమె శరీరముమిగులఁ గుఱుచగ నుండి పెక్కువంకరల నొప్పుచుండెను. అట్టికురూపిఁజూచి కృష్ణుఁడు హాస్యంబుననట్లనియె. 'తరుణీ! నీవెవ్వతెవు? నీపేరేమి? ఈగంధము నెవ్వరికిఁ గొని చనుచున్నావు? మాకీలేపనమొసఁగుము. నీవు చక్కనగుదువు.' నావుడాయమ 'యయ్యా! నీవుచక్కనివాఁడవుగదా! నన్నేమి వెక్కిరింతువు? నీ వెగతాళిచేసినను జేయకున్నను నాకెక్కడనుండి చక్కఁదనమువచ్చును? పుట్టినవారందఱును జక్కనివారైనఁ గురూపులెవ్వరుగలుగుదురు? అందఱును బల్లకులెక్కనమోయువారుండవలదా! మీతో నాకేమి? నన్ను భగవంతుఁడిట్లుపుట్టించినాఁడు. నన్నుఁద్రివక్రయనియిక్కడివారందురు. నేనుకంసదాసిని. ఆయనఘునకీగంధముఁ గొనిపోవుచున్నాను. వలయునేని మీరును దీనిఁబూసికొనియానందింపుఁడ'నిగిన్నె వారలముందుంచెను. రామ కృష్ణులువలసినంత గంధమునలందిరి. వారితోడనున్న వారును గావలసినంత గంధమునుబూసికొనిరి. కృష్ణుఁడంతనయ్యబలకుపకృతి సలుపువాఁడై యామె పాదంబులఁ దనపాదంబునుంచి దేహమును బైకెత్తెను. కుబ్జవంకరదీరెను. ఆమెచక్కఁదనమునకెల్లవారును నద్భుతమందిరి.

రామకృష్ణులయ్యెడఁ గడచిచని విపణిమార్గంబులదాటి ధనుశ్శాలకరిగిరి. అయెడఁ గావలివారలు వారిని లోనికరుగనీయకవారించిరి. రామకృష్ణులు వారిఁజీరికిఁ గొనక వెడలఁ దరిమి లోనికేగిరి. అందొకదుస్తరశరాసనముండెను. కృష్ణుఁడుదాని నెత్తిగంధేభము చెఱకుగడఁ ద్రుంచునట్లు లవలీలఁద్రుంచి

వైచెను. ఆశబ్దము వీనులకు భీషణంబయి రోదోంతరములు నిండెను. కంసుఁడారవంబునకులికిపడెను. కావలివారలరుదెంచి బాలురనిరువురఁబట్టిరి. బాలురులాఘవంబునవారి నెల్ల నిర్మూలముఁ గావించిరి. వారిధాటికాగఁజాలక నసిచెడితక్కిన వారలక్కడనుండి ప్రాణములుగాచుకొనుతలంపున నెందేనిఁ బరువులిడిరి. అంత రామకృష్ణులు విడిదలకుఁజనిరి.

పదునాలవప్రకరణము.

అంతలో సాయంకాలమయ్యెను. ఆకాశమనునరణ్యమునఁ జరించు నంధకార గజమును బట్టనెంచి గుచ్చిడుటకుఁ గాఁగాలవ్యాధుఁడు చూతాంకురశ్రేణిచేతఁ గల్పించిన చెండోయను నట్లు పశ్చిమాద్రియందు మందప్రభతోడభానుండు చూపట్టెను. సాధ్వియగుకమలనారి తనపతిఁ దపనునిమానిన కతమ్మున దైన్యమువహించిన దోయను నట్లు ముకుళింపఁజొచ్చెను. క్రమముగఁ జీఁకటులు నలుదిశల వ్యాపింపఁదొడంగెను. తుమ్మెదలు మెల్లమెల్లన సరోరుహకుట్మలంబుల వసింపఁబూనెను. ప్రాగ్దిశాలలనాలలామ ఫాలతలంబున దీప్తిఁగాంచుసిందూర తిలకమనఁ జెంపొంది విరహిజనముల ధైర్యవల్లులఁద్రెంచుని మిత్తమ్మునద్వ్రరకుఁడై త్తినచాత్రిమననొప్పఁగాంచి, కాలకిరాతుఁడ లిగిచీకటిమెకంబుఁద్రుంచుకారణమ్మున మెఱయించుఖడ్గమనదర్పమువహించియాకాశతమాలతరుప్రాక్శాఖయందు మెఱయుపల్లవమననింపుఁగాంచికలువలు సంతసంబు నొంద చోరులుడెంద

ములఁ గుండ సముద్రమాకసము ముట్ట నతిశయముఁ జెందఁజ కోరకములానందమును బొందఁ జారులు భయంబునఁ గంద శీతకరుఁ డుదయాచలంబునఁ జూపట్టెను.

రామకృష్ణులారేయి తమతోడి గోపడింభకులఁగూడి వెన్నెలయందు క్షీరాన్నంబులుగుడుచుచు నానాగాథలం జెప్పుకొనుచు నానందమునొందు చుండిరి. కంసుఁ డనుచరులచే వారి చేష్టలెఱింగి విహ్వలుండై నిద్దుర లేక చింతిల్లుచుండెను. ఆతఁడు పాన్పునఁ బవ్వళింప నెంచిన నెద్దియో యొకరూపముగానఁబడి యాతని బెదరించుచున్నట్లుండెను. ఏమిచేయుటకును దోఁపక యతఁడు శయ్యపైఁబరుండి యటునిటు పొరలఁ జొచ్చెను. అతిప్రయత్నమున నాతనికెట్టెట్టులో గొంచెమునిద్దుర పట్టెను. ఆనిద్రయందాతఁడు కలవరించుచుండెను. మఱికొంత తడవునకెవ్వరో తన్ను దన్నినయట్లు తోఁప నాతఁడులికి లేచి చెంతనున్న భార్యలఁజూచి వికారముగఁ బలవించెను. వారాతనిడగ్గఱి కన్నులు దుడిచియాశ్వాసించిరి. ఆతనికొడలు దెలిసెను. ఆది యెఱఁగియాతని కాంతలిట్లనిరి. 'నాథా! యిదియేమియాగడము? ఏలయిట్లున్నారు,' అనవిని యతఁడువారలఁజూచి 'కాంతలారా! యేమిచెప్పుదును! నాకెద్దియో భ్రాంతిజనించినట్లున్నది. నిద్రపట్టక పట్టక యింతకుముందుఁ గొంచెము పట్టెను. అంతలో స్వప్నములు బయలుదేరెను. తలఁచుకొనిన గుండెలు జల్లుమనుచున్నవి. ఒడలుగంపమెత్తుచున్నది. కలలో గరళముఁదింటిని. ప్రేతమును గౌఁగిలించుకొంటిని. ఖరము నెక్కితిని. శిరమునఁ దైలము రాచుకొంటిని. అన్నిఁటికంటె నెక్కుడుగ మఱియొండుగలదు. రక్తకుసుమముల దండను మెడయందుఁ బూని యొ

క్కఁడనెందేనిఁ జనుచుంటిని. ఈకలలు నిక్కువములనియే తోఁచుచున్నవి. ఇట్టికలలువచ్చిన మరణముదప్పదందురు. అదియుఁగాక యింకొక్కరహస్యముగలదు. వినుఁడు చేతులతోఁ జెవులుమూసికొన్నచో లోనఁగల ప్రాణఘోషము వినఁబడకున్నది. నీళ్లయందుఁ దొంగిచూచినచోఁ దలగానరాకున్నది. అడుగుజాడగానఁబడుటలేదు. చెట్లుబంగారుపు జెట్లుగాఁ గన్నుదోయికిఁగానబడుచున్నవి. బుద్ధియంతయుఁ గలఁత వహించియున్నది. అక్కటా! యీదుశ్శకునములు నాకు సన్నిహితమరణమును సూచించుచున్నవి. నేను జీవింపఁజాలను. దేహము లనిత్యములనియెంచి మీరు నామరణమునకై చింతిల్లకుఁడ'ని పలికెను. వారాపలుకులకు ధైర్యమువదలి యేడువఁజొచ్చిరి. కంసుఁడువారలనాశ్వాసించి 'మీకేల భయము? నేనూరక పలికితిని. నాకేటిమరణము? నన్నుఁ జంపువాఁడెవఁడు? రేపు నావిరోధులను రామకృష్ణులను వధించెదను. పిమ్మట మరణభయములేక హాయిగ సుఖించెదను. సకలరిపుభయంకరుఁడను నన్నుఁ బతిగఁ గైకొన్న మీకునుదుఃఖమా? ఊరకుండుఁడు. నాజీవితవిషయంబున సందేహమునొందకుఁడ'ని పలికెను. వారలాతని పెడబుద్ధిమాన్ప ననేకవిధముల యత్నించి తదనుకూలవాక్యంబులు పెక్కులుపలికిరి. అయ్యవివిషంబులుగఁ దోఁపఁ గంసుండుకాంతల నదలించి శయ్యపైనుండి చివాలున లేచి పోయెను. భర్తయంతమాత్సర్యంబు వహించినందుల కాత్మఁగంది యాలలనలు దమలోఁ మనగతు లెట్లుగావలయు నట్లగును. చింతించి యేమి చేయఁగలమ'ని యూరకుండిరి.

అంతలోఁ గొక్కొరోకో యని కోడి కూఁత వినఁబడెను.

చీఁకటులు సడలఁ జొచ్చెను. చల్లని పిల్లవాయువు లుల్లాసంబు
న వీవఁదొడంగెను. కులాయంబులఁ బక్షులు కలకలఁ గూయు
చుండెను. తూరుపు దెల్లవాఱెను. పద్మినీకాంత తా నోఁచిన
నోములు ఫలించె నని సంతసమ్మునఁ బ్రసన్నవదనమ్మును
జగమ్మునకుఁ గన్పట్టఁ జేయుచుండెను. ఝుమ్మను శబ్దమ్ము సలు
దిక్కులఁ గ్రుమ్మఁ దుమ్మెదలమొత్తమ్ములు దామరలయందలి
తేనియను ద్రావుచు నానందించుచుండెను. క్రమక్రమముగ
భాస్కరుఁ డుదయ మయ్యెను.

అట్టియెడఁ గంసుఁడు గొలువుకూటంబున కరుదెంచెను. దుస్తంత్రంబుల ధరణీతలంబున నసమప్రజ్ఞఁ గొన్న మంత్రులిరుపార్శ్వంబుల నుచితాసనంబుల నాసీనులై యుండిరి. అప్పుడు కంసుఁడు వారలంగాంచి యమాత్యశేఖరులారా! వింటిరిగదా నామేనల్లుండ్రరాక! వారి నెట్లయిన నిప్పుడు దుదముట్టించు యత్నమొండు సలుపవలయు. మీమనంబుల కెద్దియెద్ది యుక్తమని తోఁచుచున్న యది యద్ది యద్ది వచియింపుఁడు. మనకు వలసినదాని నవలంబింతము. నాకనేకములు దోఁచుచున్నవి. అయినను నాకార్యంబునఁ దీర్మానమొండు గావింప నేను కర్తను గాఁజాల నని పలికెను. ఱేని పలుకుల కలరి మంత్రులయందు సమర్థుఁడగు నొక్కరుఁ డిట్లనియె. 'రాజేంద్రా! యిందులకై యింత చింత యేటికి? మన కడలోకము నంతయు జయించిన మల్లు రిరువురు గలరు. వారు చాణూరముష్టికులు. దేవరకు వారలఁగూర్చి తెలియకుండదు. వారల నిరువురఁ బిలువనంపుఁడు. మీ మేనల్లుండ్రను గొనివచ్చుట కాజ్ఞయొసంగుఁడు. మల్లయుద్ధమును జరుగునట్లు లేర్ప

ఉపుఁడు. చాణూరముష్టికులతోడఁ దలఁపడిన తత్క్షణంబ రామ కృష్ణులు మరణము నొందుదురు. అటుతరువాత దేవరకు లోకంబునంతయు శాసింప నడ్డుగలుగకుండును'. అన విని తక్కుంగలవారలెల్ల రది యద్భుతమార్గమని చెప్పి యట్టి మార్గమును వెదకిన మంత్రిని వేనోళ్లఁ బొగడిరి.

కంసుఁడు మంత్రులయాలోచనల కుప్పొంగి యొక రంగమును సిద్ధము గావింప నాజ్ఞాపించెను. స్వామియాజ్ఞ శిరసావహించి మెఱియలవంటిబంటులు గొందఱరిగి యొకస్థలంబును జక్కఁ జేయ మొదలిడిరి. నిమిషమాత్రంబులోన నందలిఱాలన్నియుఁదీయఁబడియెను. కొందఱు సింహాసనమొందు గొనివచ్చి రంగమధ్యమున నమర్చిరి. కొందఱు మేలియాసనంబులఁగొని వచ్చి రాజపీఠంబునకుసమీపమున నేసిరి. మఱికొందఱు నానాన్యాసనంబులఁగొన్నిటిఁనిసమీపస్థలంబులనుంచిరి. రంగమంతయుఁబందళ్లతోనిండియుండెను. పందిటి కంబంబుల కరఁటికంబంబులుగట్టఁబడెను. కన్నులపండువు సేయుచుండినయారంగంబునఁగంసుఁడుసింహాసనాసీనుండై యుండెను. పరివారమెల్లరాతనిఁబరివేష్టించియుండెను. కంసు నాజ్ఞ యయ్యెను. ఇరువురు మల్లులు మదగజంబుల లెక్కసేయని బలంబులతోడ రంగమునకు విచ్చేసి భుజాస్ఫాలనము గావించిరి. అప్పుడు కంసుఁడు బలరామకృష్ణులఁ గొని రాఁదగినవారి వారి విడిదల కంపెను. ఇంచుక సేపు లోన రామకృష్ణులు మల్లరంగమునకు విచ్చేసిరి.

వారలం గాంచినంతనే కంసున కనరాని యడలు పుట్టెను. ఆతని దేహము గంప మొందఁజొచ్చెను. అయ్యది వెలికిఁ గానరానీయక యాతఁడతిప్రయత్నంబునఁ దనలో నిట్లని విత

రీక్షింపఁ జొచ్చెను. ఔరా! యేమి వీరిబాహుబలము! ఏమి వీరిచక్కఁదనము! వీరు నిజముగ నాపాలిటి మృత్యుదేవతలని వేఱుగ వక్కాణింపవలయునే. అయినను భయపడ నవసరము లేదు. నామల్లు లసమబలులు. వీరి నిప్పుడ యమునిపురి కంపఁగలరు. నాహృదయంబును సంతసంబుననింపఁగలరు. మాత్రముగాక". ఇట్లనుకొనుచు దిగ్భ్రాంతితోడఁ జూచుచుండెను.

పదునైదవ ప్రకరణము.

కంసునిమనంబునకందముగాఁగజాణూరుండుబాలకులం గాంచి యిట్లనియె. 'డింభకులారా! మీరలు సంగ్రామంబున మిక్కిలి నేర్పరులని పలువురుపలుకవిని వేడుకపడి మారాజేంద్రుఁడు మిమ్మిందులకు రప్పించెను. మీమల్లాహవక్రీడానైపుణి నొక్కింతచూపింపుఁడు. అయినను నాకొకింత భయముగనున్నది. నాతోడఁదలపడినవాఁడీదివఱ కెవ్వఁడును జీవంబులతోడ నాహవభూమి వదలఁడయ్యె. మీగతిగూడ నట్టులేయయిన మీతల్లిదండ్రులు మీకై యెంతచింత నొందుదురో యూహింపనలవి గాకున్నది. ఇయ్యది మల్లయుద్ధముగాని నవనీతంబుల ముద్దగాదు'. అనవిని శ్రీహరియాతని దిక్కు మొగంబై 'యోయి! యేల మమ్ము దెప్పిపొడిచెదవు? నీవన్నట్లు మేముపిన్నవాండ్రము. మాకు సాములు లేవు. సత్త్వముగలదని చెప్ప సాహసింపఁజాలము. మీర నసామాన్యులుగారు. లోకభయంకరులరు. మల్లయుద్ధ విశారదులరు. కులిశకర్కశదేహులరు. మీరాజునకు వేడ్క సేయవచ్చి

రిది. మిత్రుఁడవుగా సమానుఁడవు! యొక్కఁడిది? అయినను బలములతోఁ డ నుపయోగము లేదని తోఁచెడిని. కార్యమునఁ గదా యెవ్వరెవ్వరి శక్తు లెట్టివియో తెలియనగును! నేను నీతోఁ డఁ బెనఁగెదను. ఈ మా యుగ్రజుఁడు ముష్టికునితోఁ డఁ దలపడెదును. సభ్యులు గలరు. రాజు గలడు. మన జయాపజయము లెల్లరకు వేద్యములుగాఁ గలవని పలికెను.

అప్పలుకులకుఁ జాణూరునకుఁ బట్టరానిరోషము వచ్చెను. బొమలు చిట్లించుకొనుచు నతఁడు హరిం గాంచి యిట్లనియె. 'గోపాలకులు పట్టిపిటికిపందలు. వారలలో నీవు బాలకుఁడవు. నీ కెందుండి యింతగర్వము వచ్చెను? నాతోఁ డఁ బోరుటకు నీ వెంతవాఁడవు? నీవు నన్నుఁ దాకుట తగరు కొండను దాకినట్లగు. నీవు నన్నెవ్వఁడనుకొంటివి? నా ప్రజ్ఞ నీకింతయుఁ దెలియదయ్యెను. శలభంబు మంటఁ బడి మడియునట్లు నీవు నాపైఁ బడి మడియుదువు. ఇవి ప్రేతల ప్రోలవేయుకుప్పిగంతులుగావు. చాణూరుఁడు స్థాణునిసైతము మెచ్చఁడు. బ్రహ్మయన నాతని కొక్క లెక్కలోనివాఁడుగాఁడు. విష్వక్సేనుఁడన నాతనికి నవ్వువచ్చును. జగత్ప్రాణుఁడీఁడుగాఁడని యెఱింగి యాతఁడాతని రమ్మనఁడు. మల్లయుద్ధమన నాతనికి భక్ష్యభోజ్యములు సిక్కినయట్లు. అట్టియతఁడు గోపాలబాలకుపనికిఁ జాలఁడా? ప్రల్లదము లేల పలికెదవు? నేను బల్లిదుఁడను. లోకమందుఁ బ్రఖ్యాతుఁడను. నా చల్లడము క్రిందదూఱని మల్లులు లోకమందు మందునకైన లేరు. చలముతోడ నన్నుఁ దాకి జలనిధిఁ జొరనీకు సాధ్యముగాదు. అటుగాకున్న గోత్రము దండ నిలుచుటకును గూడవలనుగాదు. అదియుఁ గాదనినఁ గుంభిని క్రిందికేగరాదు. అట్లనుగాదందువేని మనుజ

సింహుఁడనని నాప్రామాలములయ నీకుఁదరముగాదు. కానలఁ జొరఁబడఁజాలవు. ప్రబలరూపుఁడననుచుఁ బ్రకాశింపఁ జాలవు. నీగర్వంబులు, నీమోసంబులు, నీచేష్టలు నాకడఁబనికిరావు. రణరంగమునుండి శీఘ్రంబుగఁ దలఁగిపొమ్ము' అనుపలుకులా లకించుచు శ్రీహరియూరకుండెను. వాగ్వాదులకును గార్యవా దులకును భేదమింతియ కదా?

కృష్ణుఁ డూరకుండుటఁజూచి చాణూరుం డాతని మఱి మఱి దూషింపనారంభించెను. 'నాసాహసమునకు నీవుభయ మందుచున్నట్లు తోఁచెడిని. అంతగాక గొల్లవానిపని యిం కెంత? ముసలమ్మల సభల ప్రజ్ఞలు కంసనాయకుని సభయందు నాప్రామాల నుపయుక్తమగునే. బాగుగా యోచింపుము. నీమహిమఁజూపింపనియ్యది మధురాపురముగాని వైకుంఠపుర ముగాదు. నీగర్వంబును దెలియఁజేయనియ్యది కంసనరేంద్ర కంఠీరవుని సభామంటపముగాని సర్వసంగపరిత్యక్తులును సన్న్యా సులునువసించు మఠముగాదు. ఆలకించి యానందించుటకు నా బాహునాదముగానికలహభోజనునివీణానాదంబుగాదు. చదురు లాడుట కియ్యది మల్లవిగ్రహముగాని ప్రణయ విగ్రహము గాదు. నీయిచ్ఛవచ్చినయట్లు సంచరింపనియ్యది వేదాంతవీధి గాదు. తప్పించుకొని పోవ నియ్యది మునిహృదయంబుల యందలి మూలగాదు. ఇక్కడఁ జిక్కితివి. ఎందేగఁగలవు? నీకీనాఁడు చావు నిక్కవము, సంసిద్ధముగమ్ము?' ఇట్లనుచు నామల్లుండు పౌరమనోభల్లుండయి వల్లవ వల్లభుని నల్లనఁ జేరఁబోయెను.

రోషానల ధూమంపుం బ్రరోహమో యనునట్లు లాతని
శిరమునందొక సన్ననిసిక యొప్పుచుండెను. దిగ్గజకరసన్నిభం
బులై యాతని దోర్దండంబులు భయమును గొలుపుచుండెను.
ప్రళయాంతకుని దంష్ట్రల యట్లు లాతని మొగంబునం గోఱ
మీసములు మెఱయుచుండెను. ఆతని దేహంబు కాటుకకొం
డవలె నల్లచాయంగలదై యొప్పుచుండెను.

అంతఁ గృష్ణుండు మెల్లన మొల్లంబగు బీరంబు వెల్లి
గొన నుల్లసిల్లి బాహునాదంబుఁ గావించెను. ఆధ్వని రోదోం
తరాళంబు నిండి ప్రతిధ్వను లెసఁగెను. ఒండొరులు దలపడిరి.
పరస్పర ముష్టిపాతంబులు చూపఱకు భయ జనకంబులుగ
నుండెను. కృష్ణుఁడా మల్లుని చెట్టఁబట్టి యీడ్చి క్రిందికిఁ ద్రో
సెను. వాఁడు గ్రిందఁబడి లేచి కృష్ణునిం బట్టినెట్టెను. హరి
మరల నాతని నొక్క ముష్టింబొడిచెను. ఇట్లు కృష్ణచాణూరు
లొండొరులకుం దీసిపోనక సమరంబుసలుపుచుండిరి. బలభద్రు
డు ముష్టికునితోడఁ దలపడెను. వారిరువురు బాహాబాహింబ్ర
ళయాగ్నులయట్లు పోరుచు భీకరరూపులై చెలంగుచుండిరి.

అట్టి సమయంబున వారిదర్శనంబులఁ గోరుచు నానందిం
చుచుండిన చూపఱులు దమలో నిట్లని తలపోయఁజొచ్చిరి.
'ఆహా! యీకంసరాజేంద్రుని క్రౌర్యము! చక్కఁదనంబుల కెల్ల
లగు నీకుమారుల నీగిరికఠోరులగు మల్లులతోఁ బెనఁగఁజేసెను.
ఈతనికిఁ గీడుమేళ్లతో నెన్నటికి నగత్యమున్నట్లుదోఁపదు 'యథా
రాజా తథా ప్రజా' యనునట్లు సభ్యులు సైత మీతని వారిం
పరైరి. ఈడుగానివారల కిట్టిసమరంబు సెల్లునే? ఇయ్యది

శోకకారణముగనే యున్నది. అయ్యో! యీరాజునకు దయ యనునట్టిదో తెలియదు. ఇతఁ డేల వీరిని మాన్పించును. సభలలోనికి వచ్చుటంజేసి కాదే మనకిట్టి సంకటము గలుగుచున్నయది. అందువలననే సభకుఁబోవఁ జనదు. పోయినచో సభవారల దోషంబు లెఱిఁగి యూరకుండరాదు. తెలిసి తెలియక యేదియేనినొక్కటిపలికినఁ బాపము సంభవించును.

'సభకుఁ బోవఁ జనదు సభవారిదోషంబు
లెఱిఁగి యూరకున్న నెఱుఁగకున్న
నెఱిఁగి యుండ డైన నిట్టట్టు వలికినఁ
బ్రాజ్ఞుఁ డైనఁ బొందుఁ బాపచయము'

ఇట్లనేకు లనేకవిధంబుల ననుకొనుచుండఁ గొందఱు మల్లయుద్ధంబుపై దృష్టి నిడి యిట్లనిరి. 'మల్లుఁడు హారికి లోఁబడెను. నేఁ డీతనికిఁ జావు నిక్కువము. ఇప్పటికి మనమనంబుల దిగుళ్లు గొంతకొంత మట్టువడినవి'. కొందఱు వారింజూచి 'లోఁబడియుఁ బెగడక మల్లుఁడు హారివక్షంబును మరల నుగ్రముష్టిఁబొడిచెనుగా'! యనుచుఁ జింతించుచుండిరి. 'ఆ! చచ్చెఁ జచ్చె. ఇట్టివాఁడు కృష్ణు నేలయెదిరింపవలయును. భగవంతుఁ డతనికిఁ దగినశాస్త్రియొనర్చెన'ని కొందఱు చప్పటలు చఱచుచుండిరి. కృష్ణుఁడు చాణూరుని నేలఁబడఁగొట్టి బాహునాదము గావించెను. చాణూరుఁడు నోట ముక్కున నెత్తురొలుకఁ జచ్చెను. బలభద్రుండు ముష్టికుని చేతనెత్తి నేలపైఁ దలపగుల మొత్తెను. వాఁడు గాలిఁ గూలు తరువు భంగి నేలఁగూలెను. మల్లులపాట్లుగాంచి'వీరిని మల్లులువల్లవబాలకులనియెంచి పెనఁగి

యమనాయకునిపురికరిగిరి. మనమిందుంటిమేని యీబాలురుమమ్ము లనిలువనీయరు. ఊపిరి యున్న నుప్పమ్ముఁగొని బ్రదుకవచ్చును. ఇందునిలువ సాధ్యముగాదని తక్కుంగల మల్లులెల్లరు చెల్లాచెదరై పోయిరి. మల్లయుద్ధంబున రామకృష్ణవిజయంబునకెల్ల వారలాశ్చర్యమగ్నమానసులైరి.

పదునాఱవ ప్రకరణము.

చాణూరముష్టికవధానంతరంబునఁ గంస సభామంటపంబునఁ గలకలధ్వనులు సెలంగెను. కంసుఁడు సభాజనంబుల నెల్లవారించి మంత్రులంజూచి మహాక్రోధంబున నిట్లనియె. 'ఈగొల్లపిల్లవాండ్రను నగరివాకిటికి వెడలఁగొట్టుఁడు. ఈగొల్లలనెల్లఁ బట్టి బంధింపుఁడు. నందునిఁ గారాగారంబునఁ ద్రోయింపుఁడు. వసుదేవుని బ్రదుకనీయకుఁడు. ఉగ్రసేనుని గూల్పుఁడు. ఆలస్యము సలుపకుఁడు. పొండు', అన్పలుకు లాలించి గోపాలబాలుండు కృష్ణుండు లేచిపైకుఱుకు సింగమట్ల కంసునిపైఁ గుఱికెను. పౌరులెల్లఁ దల్లడిల్లిరి. కంసుఁడు ఖడ్గంబుఁ గేలంఁబూని కృష్ణునెదుర్కొనెను. తార్క్ష్యుండు పన్నగంబుఁ బట్టు లీలంబట్టి కృష్ణుండు కంసుంగ్రిందఁబడఁద్రోసెను. ఆపెట్టుచే రక్తధారలుగారఁ గంసుఁడు ప్రాణంబులం బాసెను. మహాకోపంబున నునికింజేసి హరియాతనికళేబరంబు నీడ్చెను. ఆసమయంబునఁ గంసానుచరులు విజృంభించి గోపాలుఁబట్టుఁడని కృష్ణునిపై కుఱికిరి. బలభద్రుండు వారల నొక్కపెట్టున

యము సదనంబున కనిపెను. ఇవ్విధంబునఁ గృతకృత్యులైన రామకృష్ణులంగాంచి యెల్లరు సంతసంబునం జెలంగిరి. నారదుఁడు మింటఁజేరి గీతము పాడఁదొడఁగెను.

'క॥ చేతులఁ దాళములొత్తుచుఁ
జేతోమోదంబుతోడ సిగముడి వీడం
బాతర లాడుచుమింటను
గీతము నారదుఁడుపాడెఁ గృష్ణాయనుచున్ ॥'

ఆకసమునుండి బ్రహ్మరుద్రాదులు కృష్ణునిఁ బొగడిరి. వేలుపులు పుష్పవృష్టులఁగురిపించిరి. దుందుభులు మ్రోసెను.

అట్టిసమయమునఁ గంసకాంతలు దుఃఖాక్రాంతలై యంతము నొందిన తమకాంతునిపైఁబడియెలుంగెత్తి 'హా! నాథా! హా వీరాగ్రేసరా! మహాత్మా! హా రాంజేంద్రా! మమ్మెడఁబాసి పరలోకంబునకు నీవొంటిఁబోయితివే. అయ్యో! నిన్ను జూడక మేమొక్కనిమిషమైనఁ బ్రాణములు నిలుపఁగలమా? మమ్మేలనీతోడఁ గొనిచనవైతివి? ఎంతచెప్పినను నీకప్పుడు మాపలుకులురుచింపవయ్యెనే. నాకేమియుభయములేదనిరాతిరిమాతోడనంటివే. దుఃఖించుచుండిన మమ్ములవారించితివే. ఇప్పుడుమేమిట్లేడ్చుచున్నవారింపవేమి? కన్నులుదెఱచియొక్క పలుకైనఁ బలుకవేమి? అక్కటా! యీదుఃఖంబును భరియింపఁజాలము'ని యూరకవిలపించుచుండిరి. శ్రీకృష్ణుఁడు వారి డగ్గఱి 'యేల మీరేడ్చెదరు? ఆతఁడు మీపలుకులు పాటింపక లోకంబులకుఁ గీడునాపాదించెను. తెలిసితెలిసి తమప్రాణములపైకిఁ దెచ్చుకొన్నవారి నేమిచేయఁగలము? కాలపైప

రీత్య మ'ని పలికి యూరార్చెను. వారు గొంతశాంతించిరి. కృష్ణుండు కంసాదులకుఁ బరలోకసంస్కారంబులు సేయం బనిచెను.

చెఱయందు దేవకీవసుదేవులాత్మజుని సాహసమ్మునకును గంసనాశనమ్మునకును సంతసంబునొందుచుండ హరి వారినిడగ్గఱి బలభద్రసహితుండై ప్రణామంబులుసేసి సంకెలియలు విప్పించి యిట్లనివచియించెను. 'జననీజనకులారా! మీరుమమ్ముఁ గంటిరిగాని మాబాలచేష్టలు చూచియానందమొందఁజాలరైతిరి. దానికై చింతిల్లకుఁడు. అదదైవయోగము. తల్లిదండ్రుల కడఁ దనయులుండి యవసరముల కొలఁదిలాలితులగుచువర్ధిల్లునట్టిమహిమయందఱకుఁ గలుగదు. తనయులఁజూచుచువారిముద్దుముచ్చటలఁగాంచుచు నానందించుపుణ్యముసైత మెల్లరకుఁగలుగదు. ఎవ్వరెవ్వరిప్రాప్తము లెంత లెంతలంతలంతలుగాక యెక్కువలు రమ్మనినవచ్చునే? మాప్రాప్తమట్లుండె. మీప్రాప్తమిట్లుండె. ఎవ్వరేమిచేయగలరు? అట్లననేల? నిఖిలపురుషార్థహేతువులగు నీమేనులకు మీరు దక్క నెవ్వార లాధ్యులు? నూఱేండ్లకైనను మీఋణంబును దీర్పమాకగునే! పెద్దలిట్లు పలుకుదురు.

'క॥ చెల్లుబడి గలిగియెవ్వఁడు
దల్లికిఁ దండ్రికిని దేహధనములవృత్తుల్
చెల్లింపఁ డట్టికష్టుఁడు
ప్రల్లదుఁడామీఁదనాత్మపలలాశియగున్॥

క॥ జననీజనకులవృద్ధులఁ
దనయులగురువిప్రసాధుదారాదులనే
జనుఁడుఘనుఁడయ్యుఁ బ్రోవక
వనరును జీవన్మృతుండువాఁడుధరిత్రిన్॥'

అదియునుగాక కారాగారంబుల మీరు మాకారణంబుగఁగంసుచే నధిక బాధలొందితిరి. ఆతని వారింపఁగల శక్తిమాకుండియు వారింపకుంటిమి. మాక్రౌర్యమేమని వచియింపనగు? నిష్కారుణ్య హృదయుల మమ్మేమిచేసినఁ బాపముతీరును? మాతప్పులన్నింటిని మన్నించి మీరుమమ్ము రక్షింపకున్న మాగతులేమి గావలయు? అని పలికిన హరిపలుకులకలరి దేవకీవసుదేవులు మోహితులై యక్కుమారుల నంకపీఠంబుల నిడుకొని కౌఁగిలించుకొని వారి వదనంబులు గన్నీటం దడుపుచు నానందించుచుండిరి. ఉగ్రసేనుండుమనుమల నెత్తుకొని యొక్కింతిముద్దులాడెను. అంతఁ గృష్ణుండుగ్రసేను దిక్కు మొగంబై 'తాతా! దుర్మార్గుఁడు లోకకంటకుఁడు కంసుఁడు గతించెను. ఆతనికై నీవు వగవఁబనిలేదు. లోకములకిప్పుడు శుభంబు సంప్రాప్తంబయ్యెను. మేము యాదవులమగుటంబట్టి తొంటి యయాతిశాపంబున రాజ్యముసేయరాదు. నీవు సత్వరముగ నేగుదెంచిసింహాసనమెక్కుము. మేము నిన్నుఁ గొలిచి యుండెదము. సకలరాజులును నిన్నుసేవింతురు. దేవతలుసైతము నీకరిం బెట్టుదురు. కంసపక్షపుఁబుడమి నాయకులెల్లరు నీసన్నిధికి వచ్చునట్టులిప్పుడ దిట్టముఁగావింతును. లెమ్ము' నిపలికి సకలరాజ్యంబునకు నాతనిఁ బట్టాభిషేకము గావించెను. అంత

రామకృష్ణులందుండి బయలు దేరి చెఱలోఁబడియుండు రాజుల నెల్ల విముక్తులఁ గావించి తోడ్కొనివచ్చి వారివారి రాజ్యంబులు వారివారికొసంగి యనిపిరి. రాజులెల్ల రామహాత్ములం గీర్తించుచుఁ దమతమ మార్గంబులంజనిరి.

నందుఁడు మధురానగరంబున మహానందముతో నుండెను. గోవిందుఁడు రాముంగూడుకొని యాతనిం జేరి 'తండ్రీ! పుట్టిపుడమిఁబడినది యాదిగ నిన్నుఁ దండ్రిగను యశోదారోహిణులందల్లులుగను నెంచి సంతసించుచుంటిమి. మాకన్నతలిదండ్రుల నెఱుఁగము. మీరు మమ్మెంత మక్కువతోడఁ బెంచితిరి? మీ ఋణమును మేమెట్లుదీర్చుకొనఁ గలము? మీ కరుణవలన గదా మేమింతవార మైతిమి. బాల్యంబునందలి పోషణ మెంతకష్టము. తల్లిదండ్రులకుఁ దక్కనన్యులకది సాధ్యమగునే? మీరు పల్లియకుఁ బోవ నెంచి యుండుట నే నెఱుంగుదును. ఇక్కడఁ బనులు విశేషములుండుటంజేసి మేమిప్పుడు మీతోడ రాజాలము. ఎక్కడనున్నను నే కుణమందైనను నేవిధమునన్నైనను నీస్మరణమానము. పనులుచక్కఁబెట్టుకొని మీకడకు వచ్చెదము. అప్పుడప్పుడుమిమ్ము దర్శింపక మాప్రాణములు నిలుచునా? అచ్చటిపెద్దల నెల్ల నడిగితిమని చెప్పుఁడు. మాతల్లులకు మానమస్కారంబులు దెలియఁ జేయుఁడు. మాతోడి బాలురవిశేషములుగ నడిగితిమనివచియింపుఁడు. మీకుశలవార్తలప్పుడప్పుడుమాకుఁ బంపుచుండుఁడు. పోయిరండ'ని యనేకవస్త్రభూషణంబులొసంగి పదములకెఱఁగెను. బలభద్రుండును నందునకు నమస్కరించెను. నందుఁడు బిడ్డలను మఱిమఱిఁ గౌఁగిలించు

కొని ప్రణయవిహ్వలుండై కన్నులనుండి బాష్పజలంబులు రాల వల్లవులంగూడుకొని వ్రేపల్లెకుంజనియెను.

పెంపుడుప్రేమ యెంతయెక్కుడు ? రామకృష్ణులవీడి పల్లియకుఁజని నంత రోహిణీయశోదలు నందున కెదురేగుదెంచిరి. నందుఁడువారికిఁ గంసనాశనాదిసమస్తవిషయంబులం దెలిపెను. బిడ్డలనువిడిచియుండ మనసురాక యాతల్లులు వారలం దలంచుకొని యూరక చింతించుచుండిరి. వ్రేపల్లెయెల్లఁజిన్నవోయియుండెను. బహుకాలంబుదనుక గోపకులెల్లరుఁదృప్తిఁ దీరభుజియింపరైరి.

మధురయందు వసుదేవుఁడు పురోహితుని రావించి రామకృష్ణుల కుపనయనాదిక్రియలు యథావిధి జరిగించెను. అంతనాతఁడు వారినిరువురను గురువుకడఁ జదువఁబంపెను. రామకృష్ణులు జగద్గురువులయ్యు భావికాలంబువారలకు గురుశిక్షలేని విద్యయుమఱుగుననున్న దీపమును రాణింపవని తెలుపుటకోయనునట్లు గురుకులవాసముచేయఁబోయిరి. కొలఁదికాలమున నే వారలు సంపూర్ణవిద్యను గ్రహించి దుష్టశిక్షణమును శిష్టరక్షణమును గావింపమొదలిడిరి.

మధురయందలిజను లుగ్రసేనుని రాజ్యంబున నధిక సుఖంబులొందుచుఁదొల్లిఁదారు గంసువలనఁ గొన్నకష్టంబుల నెల్లమఱచిరి.

ఉపసంహారము.

కంసుఁడు దొలుతటినుండియుఁ బ్రజలకు హానిగావించుచుఁ బితృకార్యంబులసైతమలక్ష్యముగావించి యప్రమత్తుఁడై మెలంగుచుండెను. తండ్రియాతనికిఁ బ్రజాపీడనంబున నెన్నియో కష్టములు గలుగునని చెప్పెను. వానిచెవులనవి దూరెనా ?

మూర్ఖుఁడుదనకుఁ దాను దెలిసికొనఁజాలఁడు. ఇతరులు సెప్పినవినఁడు. తుదకుఁ జెడును. వానికప్పటికి మేళ్లనితోఁచుపనులు ముందు దుర్భరకష్టములకు మూలంబులై నెగడును. ఎఱుకగలవారిఁ జేరి సర్వము నెఱుఁగుచు నెఱిఁగిన దాని ననుష్ఠించుచు నుండువాని నడతలయం దేలలోపము గానబడును? బాలునైననునట్టివానిని లోకు లేల ప్రశంసింపరు? 'లోకమున మనమనుగడ శాశ్వతము. మనకు దేనివలననుజావు లేదు. మనల మించి యొకరుండరాదు. ఒకరు మనకుఁ జెప్పువారుగలరా? ఒకరిపలుకులు మనమాలకించిన యవమానమునకుఁ బాత్రులమగుదుమ'ని సంతత మౌర్ఖ్యమును వహించువారి బుద్ధిప్రాబల్యమేమని కొనియాడనగును? ఔరా ! వారలకు వారలేసములు. తుట్టతుదకువారి కసహ్యాజనకపుఁమరణము దక్క మరి యెద్దియులేదు. రావణాదిరాక్షసులును దుర్యోధనాది మూర్ఖులు నట్లీల్గినవారే. వారిచరితలు దలంచుకొన గుండియలవియును.

కంసునకుఁ బితృవాక్యమన గడ్డిపఱకతో సమానము. తండ్రిమాటను వినకుంటయేకాక యాక్రూరకర్ముఁడు దైవసముని జనకునిఁ గారాగారంబునఁ ద్రోయించెను. ఇంతకంటె నన్యాయముగలదే! తల్లిదండ్రులకంటెఁ బిడ్డల కితరదైవము గలదా? ప్రాతఃకాలమున లేచి యెవ్వఁడు తల్లిదండ్రుల పాదంబుల మ్రొక్కుచుండు వాఁడధన్యుఁడు. అట్టిపుణ్యమేమని పలుకనగు? తల్లిదండ్రులు లేనివారికట్టి పుణ్యముగలుగదు. అదిదైవయోగము. దానిని దాట నెవ్వరిచే నగును? పితృవాక్యపరిపాలనార్థమై గదా రాముఁ డరణ్యమున కేగి యాకలములుదిని మృగములనడుమ సంచరించుచుండెను. మూర్ఖులకు మహాత్ముల యుపమానంబులు పనికిరావు. తండ్రియెందుఁజచ్చిన వారికేమి? ముదుకండైనంత నాతఁ డుపయోగింపఁడని వారినమ్మకము. తొలుతటినుండియునునయ్యాసఘుసహాయము లేకున్నఁదనయు లెట్లు వృద్ధికివచ్చియుందురు? తనయులఁ బోషించుట తలిదండ్రులకుఁగర్తవ్యమనియుఁ వారువారిఁ బోషింపవలసిన యవసరము లేదనిగొందఱు పెడవాదములు సేయుదురు. కంససభకు సంబంధించిన యట్టివారికి మెప్పుఁజెప్పమనచే నెట్లగును.?

కంసుని కాలమ్మున జనులనరాని బాధల నొందిరి. సాధువులకనేకకష్టములు గలిగెను. సాధుబాధస్వనాశమునకు మూలబీజము. రాజ్యకార్యములయం దసాధారణప్రజ్ఞ గలవాఁడయ్యును బాదుషా హా! యౌరంగజేబు ప్రజలనుహింసించియకదా బేబరుమహాసియునిచే స్థాపింపఁబడిన మొగలాయి రాజ్యమును నాశనముగావించుటకు మూలకారకుఁడయ్యెను.